www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
గురువారం
07-11-2024
సంపుటి : 01 । సంచిక : 185 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా|| కాచం సత్యనారాయణ
CMD

అమెరికాలో
ట్రంప్
2.0

# అగ్రరాజ్య పీఠంపై మళ్లీ ట్రంప్

## అధ్యక్ష ఎన్నికల్లో జయభేరి.. స్వింగ్ మొత్తం ట్రంప్ వైపే..




- జార్జియాలో అనుకూల పవనాలు..
- వలసల వాదనకు బలమైన మద్దతు..
- యుద్ధ వ్యతిరేకి కావడం..ఓటర్లను ఆకర్షించిన అంశం
- ట్రంప్ గెలుపులో కీలకాంశంగా మారిన ఆర్థిక వ్యవస్థ
- గ్రామీణ ప్రాంతాల ఓటర్ల నుంచి బలమైన మద్దతు

అగ్రరాజ్యం అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. అమెరికాలోని పత్రికలు జరిపిన సర్వేలన్నీ ఆయనకు వ్యతిరేకమని తేల్చినా.. ప్రజలు మాత్రం అండగా నిలిచారు. కొంత విరామంతో ఒక అభ్యర్థి అమెరికా అధ్యక్ష స్థానంపై తిరిగి కూర్చోవడం 131 ఏళ్ల తర్వాత ఇదే. అంతేకాదు.. ఎన్నికలకు ముందు కోర్టు కేసులు ఇబ్బంది పెట్టినా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా చివరి వరకూ పోరాడారు. 2016 నాటి ఫలితాలకు భిన్నంగా ఈసారి పాపులర్ ఓటు కూడా ట్రంప్‌నకే లభించింది. ఆయనకు దాదాపు 51 శాతానికి పైగా ఓట్లు లభించగా.. హారిస్ 47 శాతం వద్దే ఆగిపోయారు.

4


2

## కలిసిపనిచేద్దాం

- భారత్-యూఎస్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేద్దాం
- ప్రపంచ శాంతి, సుస్థిరత్వం, శ్రేయస్సు కోసం పాటుపడదాం
- కంగ్రాట్స్ మై ఫ్రెండ్
- ట్రంప్‌నకు మోదీ అభినందనలు

యుద్ధాలను ప్రారంభించను..
## వాటిని ఆపుతాను

ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ప్రసంగించిన డోనాల్డ్ ట్రంప్

2

టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్‌నాయుడు
## ప్రమాణ స్వీకారం

- 16మంది పాలకమండలి సభ్యులతో ప్రమాణం చేయించిన ఈవో
- తిరుమలలో అన్యమత ప్రచారంపై కఠిన చర్యలు: నూతన ఛైర్మన్


2

రియల్ గ్లోబల్ సైబర్ సిటీగా
## హైదరాబాద్

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నాం
- ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం పనిచేస్తోంది
- హాక్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

2


నాణ్యమైన విద్య అందించడమే
# ప్రభుత్వ లక్ష్యం

అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత మా ప్రభుత్వంపై ఉంది



- సామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం కులగణన సర్వే
- నిరుద్యోగుల కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు
- ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నాం
- వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు
- వ్యసనాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయి
- గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా డయల్ 100కు ఫోన్ చేసి చెప్పాలి: సీఎం రేవంత్‌రెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** రెండో విడత ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఈనెల 14న మంజూరు చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. అదే రోజున 15వేల మందితో కార్యక్రమం చేపట్టనున్నట్లు సీఎం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ప్రతీ నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పనులను వచ్చే మిగతా2లో...

ఎల్ఎంవీ లైసెన్స్‌తో కమర్షియల్
## వాహనాలు నడపొచ్చు

- మరో లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం లేదు
- 7500 కిలోల గరిష్ఠ బరువుకు మించని రవాణా వాహనాన్ని ఎల్ఎంవీ పరిధి నుంచి మినహాయించవద్దు
- సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం వెల్లడి


9

‘పీఎం-విద్యాలక్ష్మి’కి కేంద్ర కేబినెట్
## ఆమోదం

- ఏటా 22లక్షల మందికి పైగా ప్రతిభావంతులైన విద్యార్థులకు లబ్ధి
- కేంద్రం హామీతో రూ.7.50 లక్షల వరకు రుణం
- రుణంలో 75 శాతం వరకు బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ
- ఎఫ్‌సీఐలో మూలధన అవసరాలకు రూ.10,700 కోట్ల కేటాయింపు
- కేబినెట్ నిర్ణయాలను వెల్లడించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్


2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 128 | ₹ 150 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 218 | ₹ 248 |

## హైడ్రా గురించి బ్యాంకర్లకు ఆందోళన అవసరం లేదు

- అన్ని అంశాలను పరిశీలించి నిర్మాణాలకు అనుమతులు ఇస్తాం
- ఎస్‌హెచ్‌జీలకు పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వాలి
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**విశ్వంభర, హైదరాబాద్:** హైడ్రా గురించి బ్యాంకర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆయన ప్రజాభవన్‌లో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ వంటి ప్రభుత్వ విభాగాలు అన్ని అంశాలను పరిశీలించి నిర్మాణాలకు అనుమతులు ఇస్తాయని తెలిపారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు ఇచ్చిన రికవరీ రేటు 98 శాతానికి పైగా ఉందని, వారికి పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి సూచించారు. బ్యాంకర్లు సామాజిక బాధ్యతతో ఉండాలన్నారు.

కాటమయ్య కిట్లతో
## గీత కార్మికులకు భరోసా

- కాంగ్రెస్ హయాంలో కులవృత్తులకు పెద్దపీట
- బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడం కోసమే కుటుంబ సమగ్ర సర్వే
- కాటమయ్య కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు సురేఖ, రాజనర్సింహ


2


2

నువ్వు ఎప్పుడు జైలుకు
## పోతావో చూస్కో

- హోం మంత్రివా.. డీజీపీవా..ఎవరు అరెస్టు అయితరు.. ఎప్పుడు అయితరు అని చెప్పడానికి..?
- మంత్రి పొంగులేటిపై కేటీఆర్ ఫైర్

## నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

విద్యా సంవత్సరంలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. వైరా, మధిర నియోజకవర్గానికి చెందిన గురుకుల విద్యార్థులు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిసి డైట్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచినందుకు ధన్యవాదాలు తెలిపారు. నాణ్యమైన చదువు అందించడమే తమ లక్ష్యమని.. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం కులగణన సర్వే చేస్తోందని సీఎం చెప్పారు. రాష్ట్రంలో 21వేల మంది టీచర్లకు పదోన్నతులు కల్పించడంతో పాటు.. 11,062 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. చదువుతో పాటు నైపుణ్యం ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయని. అందుకే విద్యార్థి, నిరుద్యోగుల కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు సీఎం వివరించారు. టాటా ఇనిస్టిట్యూట్ సహకారంతో ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామన్నారు. చదువుతో పాటు విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించేలా ప్రయత్నిస్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. వ్యసనాలకు బానిసైతే జీవితాలు నాశనమవుతాయని, గంజాయి, డ్రగ్స్ ఎక్కడ కనిపించినా డయల్ 100కు ఫోన్ చేసి చెప్పాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు బలరాం నాయక్, రామసాయం రఘురాం రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 'పీఎం-విద్యాలక్ష్మి'కి కేంద్ర కేబినెట్ ఆమోదం

**ఢిల్లీ:** విద్యార్థులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. పీఎం-విద్యాలక్ష్మి పథకానికి కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పీఎం-విద్యాలక్ష్మి పథకం ద్వారా దేశవ్యాప్తంగా 860 విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కేంద్రం హామీతో రూ.7.50 లక్షల వరకు రుణం లభించనుంది. రుణంలో 75 శాతం వరకు బ్యాంకులకు కేంద్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వనుంది. క్యాబినెట్ నిర్ణయాలను కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడిస్తూ.. ఎఫ్‌సీఐలో మూలధన అవసరాలకు రూ.10,700 కోట్లను కేటాయించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. పీఎం విద్యాలక్ష్మి పథకం ద్వారా ఏటా 22లక్షల మందికి పైగా ప్రతిభావంతులైన విద్యార్థులకు లబ్ది చేకూరనుంది. ఇది సరళమైన, పారదర్శకమైన స్టూడెంట్ ఫ్రెండ్లీ ప్రక్రియ అని మంత్రి తెలిపారు. రూ.8లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్నవారికి ఈ పథకం వర్తింపజేయనున్నారు. రూ.10లక్షల వరకు రుణాలపై రూ.3శాతం వడ్డీరాయతీ కల్పించనున్నారు. ఏదైనా ప్రభుత్వ స్కాలర్‌షిప్ లబ్దిదారులు ఈ పథకానికి అనర్హులు. విద్యార్థులు పీఎం విద్యాలక్ష్మి వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

## రియల్ గ్లోబల్ సైబర్ సిటీగా 'హైదరాబాద్'

**విశ్వంభర, హైదరాబాద్:** సైబర్ నేరాలను కట్టడి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ద్వారా మంచి ఫలితాలు సాధిస్తున్నట్లు తెలిపారు. హాక్ సమ్మిట్‌లో నిపుణుల సూచనలు సైబర్ సెక్యూరిటీలో కీలకమవుతాయని పేర్కొన్నారు. రియల్ గ్లోబల్ సైబర్ సిటీగా హైదరాబాద్ రూపొందుతోందని చెప్పారు. ప్రజా శ్రేయస్సు కోసం ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తొలుత జ్యోతి వెలిగించి హాక్ 2.0 శిఖరాగ్ర సమావేశాన్ని ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు.. సైబర్ నేరాలపై అవగాహన కోసం చిత్రీకరించిన వీడియోలను విడుదల చేశారు. ఈ సమ్మిట్‌ను ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. అనంతరం నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ ఈ ఏడాది సైబర్ నేరాలు 24% పెరిగాయన్నారు. ఈ మధ్య కాలంలో డిజిటల్ అరెస్టుల పేరిట జరుగుతున్న నేరాలు ఆందోళన కలిగిస్తున్నాయని చెప్పారు. ఇటీవల 28 మంది సైబర్ నేరగాళ్లను రాజస్థాన్‌లో అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరంతా దేశ వ్యాప్తంగా 243 కేసుల్లో నిందితులుగా ఉన్నారని.. తెలంగాణలో కూడా 28 కేసులు నమోదు అయ్యాయన్నారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేయడం సవాల్‌గా మారిందన్నారు. ఈ ఏడాది రూ.35.8 కోట్లను బాధితులకు రికవరీ చేసినట్లు సీపీ ఆనంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, మహారాష్ట్ర అదనపు డీజీ బ్రిజేష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కలిసిపనిచేద్దాం

**ఢిల్లీ:** అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించారు. ఈ సందర్భంగా ట్రంప్‌నకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. కంగ్రాట్స్ మై ఫ్రెండ్ అంటూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ''చరిత్రాత్మక ఎన్నికల విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌నకు హృదయపూర్వక శుభాకాంక్షలు. మీ మునుపటి పదవీకాల విజయాలకు తగ్గట్టుగా.. భారత్-యూఎస్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు కలిసిపనిచేద్దాం. ప్రపంచ శాంతి, సుస్థిరత్వం, శ్రేయస్సు కోసం పాటుపడదాం'' అని ఆ పోస్టులో రాసుకొచ్చారు. అలాగే గతంలో పలు వేదికల్లో ఇద్దరు కలిసి దిగిన చిత్రాలను పంచుకున్నారు.

## యుద్ధాలను ప్రారంభించను.. వాటిని ఆపుతాను



**ఫ్లోరిడా:** యుద్ధాలపై తనకు ఆసక్తి లేదని డోనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. కొత్తగా యుద్ధాలు స్టార్ట్ చేయను అని, వాటిని ఆపుతానని ఆయన అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత మద్దతుదారులను ఉద్దేశిస్తూ ఆయన ప్రసంగం చేశారు. తన రెండవ పరిపాలన.. అమెరికాకు స్వర్ణ యుగాన్ని తీసుకువస్తుందన్నారు. స్వదేశీ విధానాలపై తన విక్టరీ ప్రసంగంలో ట్రంప్ అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఈ దేశానికి బలమైన , శక్తివంతమైన మిలిటరీ కావాలన్నారు. కానీ ఆ సైన్యాన్ని యుద్ధాలకు వాడకూడదన్నారు. తన మొదటి దశలో 2017 నుంచి 2021 వరకు యుద్ధాలు లేవని, అమెరికా ఎటువంటి కొత్త సమస్యల్లో తలదూర్చలేదన్నారు. నాలుగేళ్లు యుద్ధాలు లేవని, కేవలం ఐసిఎస్‌ను ఓడించామని, రికార్డు టైంలో ఐసిస్ పై విక్టరీ సాధించినట్లు చెప్పారు. యుద్ధాలను స్టార్ట్ చేస్తారని తనపై ఆరోపణలు చేశారని, కానీ తానేమీ కొత్త యుద్ధాలను ప్రారంభించడం లేదని, యుద్ధాలను ఆపబోతున్నట్లు ట్రంప్ వెల్లడించారు.ఒకవేళ తాను అధ్యక్షుడిగా ఎన్నికైతే కేవలం 24 గంటల్లోనే రష్యా ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపనున్నట్లు ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే.

# కాటమయ్య కిట్లతో గీత కార్మికులకు భరోసా



**విశ్వంభర, సంగారెడ్డి:** కుల వృత్తులను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, రాష్ట్ర అటవీ దేవాదాయ శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్లో జిల్లా వెనుక బడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని గీత కార్మికులకు కాటమయ్య కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించి, జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ పరిధిలో 60 కాటమయ్య కిట్లను లబ్ది దారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి టీఎస్ ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు లతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జ్ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహించడం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ గీతా కార్మికులు ప్రమాదాల బారిన పడి ఎంతోమంది ప్రాణాలు పోగొట్టుకున్నారని అలాంటిది ఇంకా ముందు జరగకుండా ఉండడం కోసం ప్రభుత్వం వెనుక బడిన తరగతుల శాఖ తరపున గీత కార్మికులకు శిక్షణ అందించడంతోపాటు ఉచితంగా కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఈ కాటమయ్య కిట్లు గీత కార్మికులకు ఆత్మస్థైర్యం ఇస్తాయన్నారు. ప్రమాదాల బారిన పడకుండా కాపాడుతాయి అన్నారు. బీసీలు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా ఎదగడం కోసం తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కుటుంబ సర్వే వల్ల రాష్ట్రంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రజల ఆర్థిక సామాజిక పరిస్థితి ప్రభుత్వానికి తెలుస్తుందని దానికి అనుగుణంగా ప్రభుత్వం వారి సంక్షేమం కోసం బతకాలు చేపట్టి వారి ఆర్థిక సామాజిక రాజకీయ అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయునట్లు తెలిపారు. అత్యంత పురాతన వృత్తి ఆయన గీత కార్మిక వృత్తిని ప్రోత్సహించడం కోసం తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు అన్నారు.గీత వృత్తిలో చెట్లపైనుండి పడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ఎంతోమంది శాశ్వత అంగవైకల్యం పొందారని అలాంటి సంఘటనలు ఇక ముందు పునరావృతం కాకుండా ఉండటం కోసం ఎక్సైజ్, బీసీ సంక్షేమ శాఖ ల తరపున గీత కార్మికులకు శిక్షణ ఇచ్చి కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో వివిధ గ్రామాలకు చెందిన గీత కార్మిక సహకార సంఘాలు గీత కార్మిక సంఘాలు ద్వారా ఈత కళ్ళు, నీరా, తాటికల్లు అమ్ముతూ సుమారు 3500 గీత కార్మిక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని వారి కుటుంబాలను వెలుగుల నింపడం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాలలో గీత కార్మికులు ప్రమాదాల బారిన పడి సుమారు 750 మంది వరకు చనిపోయినట్లు అలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు కాటమయ్యకిట్లు ఉపయోగపడతాయన్నారు. అంతరించిపోతున్న కులవృత్తులను ప్రోత్సహించి ఆధునిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నీరా విక్రయ కేంద్రాలను ప్రభుత్వం ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నిరా విక్రయం కేంద్రాలను ప్రోత్సహించడం ద్వారా గీత కార్మికుల కుటుంబాలలో వెలుగులు నింపడానికి తెలంగాణ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి ,అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి,జిల్లా వెనకబడిన తరగతుల అధికారి జగదీష్, జిల్లా ఎక్సైజ్ సూపరిన్టెండెంట్ నవీన్ చంద్, జిల్లా కల్లు గీత కార్మికుల సంఘం అధ్యక్షులు ఆశన్న గౌడ్, కార్యదర్శి రమేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నువ్వు ఎప్పుడు జైలుకు పోతావో చూస్కో

**విశ్వంభర, హైదరాబాద్ :** వాడు అరెస్టు అయితడు.. వీడు అరెస్టు అయితడు అంటూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందరి జాతకాలు చెబుతున్నాడు.. అసలు నువ్వు ఎప్పుడు జైలుకు వెళ్తావో చూసుకో అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ బుధవారం మీడియాతో మాట్లాడారు వీడు జైలుకు పోతడు.. వాడు జైలుకు పోతడు అని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అందరి జాతకాలు చెబుతున్నాడు. నువ్వు ఎప్పుడు పోతావో చూస్కో.. నువ్వు హోం మంత్రివా.. డీజీపీవా.. నువ్వు ఎవడు.. ఎవరు అరెస్టు అయితరు.. ఎప్పుడు అరెస్టు అయితరు అని చెప్పడానికి..? నువ్వు, నీ ముఖ్యమంత్రి కేక్ కోసుకుని తిన్నట్టు కోసుకొని తినండి. రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి చేయండి. నీ కుటుంబ కంపెనీకి వేల కోట్ల కాంట్రాక్టులు ఇచ్చి దండుకో. కానీ జైలుకు మాత్రం వేరేవాళ్లు వెళ్లాలి. ఇదేనా నీ నీతి.. నీ ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధి..? అని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కేటీఆర్ నిలదీశారు. నీ కంపెనీకి కనీసం ఆఫీస్ ఆఫ్ బెన్ ఫిట్ అని కూడా పట్టించుకోకుండా ఏ విధంగా పనులు కట్టబెడతారు. రేవంత్ రెడ్డి, మేఘా కృష్ణారెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు. అమృత్ టెండర్లను కూడా పొంగులేటి కంపెనీకి ఇచ్చారు. రాఘవ కంపెనీని కూడా గతంలో రేవంత్ రెడ్డి తిట్టాడు. ఇప్పుడు మాత్రం ఆ కంపెనీకి పనులు ఇస్తున్నాడు. మూసీని కూడా టెండర్లు కాకముందే మేఘాకు ఇవ్వాలని అన్ని ఏర్పాట్లు చేసేశారని కేటీఆర్ తెలిపారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో జరిగిన ఈడీ సోదాలపై ఇప్పటి వరకు ఎందుకు బీజేపీ మాట్లాడటం లేదు. అదానీతో మీ సంబంధాలు ఏ విధంగా బలపడుతున్నాయో మాకు తెలుసు. మీ కుంభకోణాలను బయటపెడుతున్నందుకు మమ్మల్ని ఇబ్బంది పెట్టే పని చేస్తారు. అయిన సరే ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉంటాం. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో ఈడీ దాడులపై ఇప్పటి వరకు స్పందించకపోవటం అంటే బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్ అయ్యిందన్నది స్పష్టంగా తెలిసిపోతుంది. ఎవ్వరు, ఎప్పుడు అరెస్ట్ అవుతారో మంత్రి చెబుతాడా..? వీళ్లు ప్రభుత్వం నడుపుతున్నారా...సర్కస్ నడుపుతున్నారా..? అని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ మండిపడ్డారు.

## భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మామునూర్ ఎయిర్‌పోర్టు నిర్మాణం

### మంత్రి కోమటిరెడ్డి

**విశ్వంభర, హైదరాబాద్:** వరంగల్‌లోని మామునూర్ ఎయిర్ పోర్ట్ కోసం భూసేకరణను త్వరితగతిన పూర్తిచేసి.. మూడేళ్లలో విమానాశ్రయాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తాత్కాలిక ఏర్పాట్ల కన్నా భవిష్యత్ అవసరాలను దృష్టిలోపెట్టుకొని ఎయిర్ పోర్ట్ నిర్మాణపనులు పూర్తిచేయాలని సూచించారు. సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో మామునూర్ ఎయిర్ పోర్ట్‌పై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతీ 15 రోజులకోసారి పనుల పురోగతిపై తాను సమీక్ష చేస్తానని మంత్రి తెలిపారు. విమానాశ్రయాన్ని నిర్మించి వదిలేయకుండా విమానాల రాకపోకలపై దృష్టిపెట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఉన్నతాధికారులకు సూచించారు. వరంగల్ ఎయిర్ పోర్ట్‌ను ఉడాన్ పథకంతో అనుసంధానం చేసి ఇతర పెద్ద పట్టణాలతో రాకపోకలకు అనువుగా మార్చాలన్నారు.యునెస్కో సైట్ రామప్ప, భద్రకాళీ, వెయ్యిస్తంభాల దేవాలయం ఇతర కాకతీయ కట్టడాలతోపాటు టెక్స్ టైల్ పార్క్ అవసరాలు, భవిష్యత్ పరిశ్రమలకు అనుగుణంగా ఎయిర్ పోర్ట్‌ను తీర్చిదిద్దాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి స్వయంగా మామునూర్‌కు వచ్చి ఎయిర్ పోర్ట్ స్థితిగతులను పరిశీలిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు.

## గవర్నర్‌తో సీఎం భేటీ

- సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వే తీరును వివరించిన రేవంత్ రెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం భేటీ అయ్యారు.ఈ సందర్భంగా తెలంగాణ వ్యాప్తంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, ఉపాధి, రాజకీయ, కుల సర్వే తీరును ముఖ్యమంత్రి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కు వివరించారు. ఈ సర్వే ప్రక్రియకు సంబంధించిన అన్ని అంశాలను సీఎం వారికీ తెలియజేశారు. 2025 లో దేశ వ్యాప్తంగా చేపట్టబోయే జనగణనలో తెలంగాణ తరహాలో కుల గణనను పరిగణనలోకి తీసుకునే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గవర్నర్‌ను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఈ సందర్భంగా సీఎం చెప్పారు.ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ఎంపీలు పోరిక బలరాం నాయక్ , చామల కిరణ్ కుమార్ రెడ్డి , సలహాదారులు వేం నరేందర్ రెడ్డి , షబ్బీర్ అలీ గారు, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి పాల్గొన్నారు .

## టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు ప్రమాణ స్వీకారం

**విశ్వంభర, తిరుమల:** టీటీడీ ఛైర్మన్‌గా బీఆర్ నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో బీఆర్ నాయుడు, 16 మంది పాలక మండలి సభ్యులతో ఈవో శ్యామలరావు ప్రమాణం చేయించారు. అనంతరం శ్రీవారిని బీఆర్ నాయుడు దర్శించుకున్నారు.

**విశ్వంభర, తిరుమల..**

తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మకర్తల మండలి ఛైర్మన్ గా బి.ఆర్.నాయుడు బుధవారం ఉదయం శ్రీవారి ఆలయంలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా క్షేత్ర సాంప్రదాయం పాటిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి భూ వరహాస్వామిని దర్శించుకున్నారు. తొలుత టీటీడీ ఛైర్మన్‌కు ఆలయ మహాద్వారం వద్ద అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయం లోపలికి వెళ్లిన ఆయన.. భూవరాహ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి ఆలయానికి చేరుకున్నారు. టీటీడీ అధికారులు బి.ఆర్.నాయుడుకు స్వాగతం పలికారు. ఆలయంలో బంగారు వాకిలి వద్ద ఈవో జె. శ్యామలరావు బి.ఆర్.నాయుడు తో ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన శ్రీవారిని దర్శించుకోగా రంగ నాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఈవో ఛైర్మన్ ను శాలువతో సన్మానించి ప్రసాదం, చిత్రపటం, డైరీలు, క్యాలెండర్లు అందించారు.

**సభ్యుల ప్రమాణం..**

అనంతరం ధర్మకర్తల మండలి సభ్యులుగా దేవాదాయశాఖ సెక్రటరీ సత్య నారాయణ, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, జంగా కృష్ణమూర్తి, మల్లెల రాజశేఖర్ గౌడ్, జాస్తి పూర్ణ సాంబశివరావు, ఎం.ఎస్.రాజు, నర్సిరెడ్డి, బూంగునూరు మహేందర్ రెడ్డి, అనుగోలు రంగ శ్రీ, ఆనంద్ సాయి, జానకి దేవి తమ్మిశెట్టి, ఆర్.ఎస్.దర్శన్, ఎం.శాంతారామ్, ఎస్.నరేష్ కుమార్, డాక్టర్ ఆదిత్ దేశాయ్, ప్రమాణ స్వీకారం చేశారు.

**తిరుమలలో అన్యమత ప్రచారంపై కఠిన చర్యలు...**

కలియుగ ప్రత్యక్షదైవం కొలువుదీరిన తిరుమలలో అన్యమత ప్రచారంపై కఠిన చర్యలు తీసుకుంటామని టీటీడీ నూతన ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. టీటీడీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం తొలిసారిగా టీటీడీ అధికారులతో సమీక్షను నిర్వహించారు. శ్రీవారి నిధుల వినియోగంపై విజిలెన్స్ విచారణ జరుగుతుందని పేర్కొన్నారు. శ్రీవారి పవిత్రతను కాపాడేందుకు కృషి చేస్తామని అన్నారు. సమావేశంలో పాలక మండలి నూతన సభ్యులు పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో మహావికాస్ అఘాడిదే విజయం

- కాంగ్రెస్,శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) ఎన్సీపీ కూటమికి 200 పైగా సీట్లు
- ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడమే బీజేపీ అజెండా
- కుల, జన గణనపై ప్రధాని మోదీ పెదవి విప్పరెందుకు?
- దేశ వ్యాప్తంగా కులగణనకు మోదీ మద్దతు ఇవ్వక పోవడంలో అంతర్యామేమిటి?
- హిమాచల్ ప్రదేశ్,కర్నాటక, తెలంగాణా లలో ఇచ్చిన హామీలు అమలు చేశాం
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి




**ముంబయి:** మహారాష్ట్ర శాసనసభకు జరుగుతున్న ఎన్నికల్లో మహా వికాస్ అఘాడి విజయ దుందుభి మోగించనుందని రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్ర లోని మరట్వాడ జిల్లాలకు ఏఐసిసి పరిశీలకుడిగా నియమితులైన ఆయన బుధవారం రోజున జాల్నా ,పూలాంబ్రీ తదితర నియోజకవర్గలలో కాంగ్రెస్ పార్టీ కూటమి అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో జరిగిన బహిరంగ సభలలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దేశంలో ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడమే ధ్యేయంగా పెట్టుకుందని ఆయన దుయ్యబట్టారు. మహారాష్ట్రలో కుడా జరిగింది అదే నని అందుకు రేపటి ఎన్నికల్లో బిజెపి, (షిండే) శివసేన, (అజిత్ పవార్) ఎన్.సి.పి కూటమి మట్టి కొట్టుకపోతుందని ఆయన దుయ్యబట్టారు. ఇటీవల జరిగిన లోకసభ ఎన్నికల్లో మహారాష్ట్రలో వచ్చిన ఫలితాలు ఇందుకు అద్దం పడుతున్నాయన్నారు. రాష్ట్రంలోని 48 లోకసభ స్థానాలకు గాను 31 స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అద్వర్యంలోని మహారాష్ట్ర వికాస అఘాడి సాధించిన విజయపరంపర ఈ ఎన్నికల్లోనూ కొనసాహుతుందన్న విశ్వాసం తమకుందన్నారు. ప్రజాస్వామ్య బద్దంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారని ఆ వ్యతిరేకత బిజెపి, శిండే, అజిత్ పవార్ వెల కూటమి పై గూడు కట్టుకపోయిందన్నారు.ఆ వ్యతిరేఖత ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కూటమికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా కుల జన గణనపై చర్చ జరగడమే కాదు, కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రం తెలంగాణ లో ఇప్పటికే గణన మొదలు పెట్టినా ప్రధాని మోడీ నోరు మెదపక పోవడంలో ఔంతర్యం ఏమిటో తేల్చిచెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు పరచడంతో పాటు అప్పటికప్పుడు ప్రజా ప్రయోజనార్దం హామీలు ఇవ్వక పోయినా అభివృద్ధి, సంక్షేమం లకు పెద్ద పీట వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీ కి ఉందన్నారు.మహారాష్ట్ర ప్రజల కోసం ఏ. ఐ. సి.సి అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిందే తడవుగా అమలు చేస్తామని ఆయన భరోసా నిచ్చారు.హీమాచల్ ప్రదేశ్,కర్ణాటక, తెలంగాణా లలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలులోకి వస్తున్నాయని ఆయన గుర్తుచేశారు.మహారాష్ట్రలో అధికారంలోకి రానున్న కాంగ్రెస్ పార్టీ కూటమి మహిళలకు నెలసరి ఆర్థిక సహాయం కింద 3,000,మహాలక్ష్మి యోజన పథకం అమ్మాయిలకు ఉచిత బస్ ప్రయాణం,రైతులకు 3 లక్షల వరకు ఋణమాఫీ,సాధారణ రుణ చెల్లింపులకు 50,000 వేల బోనస్,25 లక్షల వరకు ఆరోగ్య భీమా,ఉచిత మందులు నిరుద్యోగ యువతకు నెల ఒక్కొంటికి 4,000 రూపాయల హామీని తప్పక అమలు పరుస్తామన్నారు.

# పడిలేచిన కెరటం డొనాల్డ్ ట్రంప్

## ఎప్పుడూ వివాదాలమయం ట్రంప్ తత్వం! ఇదీ డోనల్డ్ ట్రంప్ జీవన ప్రస్థానం..

ఉత్కంఠ వీడింది. పట్టుదల, గెలిచి తీరాలనే కసి కిరీటాన్ని అందుకున్నాయి. గత ఎన్నికల్లో ఓటమిని చవి చూసిన డొనాల్డ్ ట్రంప్ తాజా ఎన్నికల్లో విజయ భావుటా ఎగురవేశారు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 47వ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్‌తో హోరాహోరీగా తలపడి గెలుపు అందుకున్నారు. గత ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత ట్రంప్ ఇంటికే పరిమితమవకుండా మరింత పట్టుదలతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తుపాకీ గుళ్లకు కూడా వెరవకుండా అనుకున్నది సాధించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయ దుందుభి మోగించారు. తన ప్రత్యర్థి కమలా హారిస్ తో జరిగిన ఉత్కంఠ పోరులో మ్యాజిక్ ఫిగర్ (270) దాటేసి 277తో అపూర్వ విజయం సాధించారు. పలు సర్వేలు ఆయనకు వ్యతిరేకంగానే ఫలితాలు వస్తాయని అంచనా వేసినా.. ఎలాంటి నిరుత్సాహానికి గురికాకుండా తనదైన తెంపరితనంతో ప్రచారం చేసిన ట్రంప్.. రెండోసారి అధ్యక్ష పీఠం దక్కించుకొని తన సత్తా చాటారు.పలు సంచలనాలు, వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉండే ట్రంప్ అమెరికా ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించి మరోసారి అధ్యక్ష పీఠం అధిరోహించబోతున్నారు. తొలి నుంచీ ఏటికి ఎదురీదే స్వభావంతో తన మనసులో భావాలను విస్పష్టంగా పైకిచెబుతూ ఒంటిచేత్తో అధ్యక్ష పోరులో నెగ్గిన ట్రంప్ వ్యక్తిగత, రాజకీయ విశేషాలు పాఠకులకోసం..

-పోతుగంటి వెంకటరమణ
బ్యూరో చీఫ్





## 1970ల్లోనే రాజకీయాల్లో చక్రం తిప్పాలని..

రూ.వేల కోట్లకు పడగలెత్తిన దిగ్గజ వ్యాపారవేత్తగానే కాదు.. తెంపరితనం కలిగిన అధ్యక్షుడిగానూ ట్రంప్ అందరికీ సుపరిచితులు. రాజకీయాల్లో చక్రం తిప్పాలనే ఆలోచన 1970లలోనే ట్రంప్ బుర్రను తొలిచింది. రిపబ్లికన్ నేత, మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌కు ఆయన గట్టిమద్దతుదారు. 1987లో తాను రిపబ్లికన్ నేతగా ట్రంపే స్వయంగా ప్రకటించుకున్నారు. 1988లో రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష పోటీదారుగా ట్రంప్‌కు మంచి అవకాశాలున్నాయని పత్రికలు కూడా విశ్లేషించాయి. అయితే, కొన్ని అంతర్గ విభేదాలు, మనస్పర్థలతో ఆయన అప్పుడు పోటీకి దిగలేదు. అయితే 1999లో ఆయన రిఫార్మ్ పార్టీకి మారారు. అందులోనే దాదాపు మూడేళ్లు కొనసాగారు. అప్పుడే ఆయన అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో నిలబడతారని ప్రచారం జరిగింది. అయితే అంతర్గత విభేదాల వల్ల ఆయన పార్టీ వీడిపోయారు. అనంతరం డెమోక్రటిక్ పార్టీలో చేరారు. కానీ అక్కడ కూడా ఆయన్ను కీలక పదవులేమీ వరించలేదు.ఈ క్రమంలో 2008లో ఆయన పార్టీని వీడినట్లు వార్తలు వినిపించాయి. అయితే



2009లో రిపబ్లికన్ అభ్యర్థి జాన్ మెక్ కెయిన్‌కు ఆయన బహిరంగంగా మద్దతు ప్రకటించారు. అప్పుడే, ఆయన రిపబ్లికన్ పార్టీలోకి మళ్లీ అడుగుపెట్టినట్లు స్పష్టమైంది. అయితే డిసెంబరు 2011 డిసెంబరులో తాను స్వతంత్ర అభ్యర్థినని ఆయన ప్రకటించారు. ఐదు నెలల తర్వాత మళ్లీ రిపబ్లికన్ పార్టీ తలుపుతట్టారు. అటు రిపబ్లికన్, ఇటు డెమోక్రటిక్ రెండు పార్టీలకూ ఆయన భూరి విరాళాలు ఇచ్చేవారు. గతంలో పలుసార్లు వివిధ పార్టీల తరపున అధ్యక్ష రేసులో ట్రంప్ దిగుదామనుకున్నారు. 2006, 2014ల్లో న్యూయార్క్ గవర్నర్‌గానూ పోటీ చేద్దామనుకున్నారట.

ట్రంప్ తన తాతగారి సంస్థ ఎలిజబెత్ ట్రంప్ అండ్ సన్స్‌లో వ్యాపార మెలకువలు నేర్చుకున్నారు. చదువు తర్వాత ట్రంప్ తన తండ్రి రియల్ ఎస్టేట్ కంపెనీలో ఉద్యోగం పొందారు. 1968లో తొలిసారి ట్రంప్ తన కుటుంబ వ్యాపారాల్లో చేరారు.చేరిన కొన్నాళ్లకే ఆయన సొంతంగా వ్యాపారంలో ఎదిగారు. అనంతరం తన వ్యాపార దక్షతతో అంచెలంచెలుగా ఎదిగారు. దూకుడు, రిస్క్ చేసే తత్వం వ్యాపారంలో ట్రంప్‌నకు బాగా కలిసి వచ్చాయి. న్యూయార్క్ శివారు ప్రాంతాల్లో ట్రంప్ తండ్రి ఫ్రెడ్‌కు ఒక భవన నిర్మాణ సంస్థ ఉండేది.మన్‌హటన్ వేదికగా ఆయన వ్యాపార సామ్రాజ్యం విస్తరించింది. మూతబడిన ఎన్నో హోటల్స్, క్యాసినోలను ట్రంప్ తెరిచి వృద్ధిలోకి తీసుకొచ్చారు. తన తండ్రి వ్యాపారం చేతుల్లోకి వచ్చిన తర్వాత దానికి `ట్రంప్ ఆర్గనైజేషన్` అని పేరు పెట్టారు. అనేక ఆకాశ హర్మ్యాలు, హోటళ్లు, కాసినోలను నిర్మించడం, పునరుద్ధరించడం చేశారు.అట్లాంటిక్ సిటీ, షికాగో, లాస్ వెగాస్ నుంచి భారత్, తుర్కియే, ఫిలిప్పీన్స్ వరకు ఆయనకు క్యాసినోలు, గోల్ఫ్ కోర్సులు, హోటళ్లు ఉన్నాయి. అలాగే 2004 నుంచి 2015 వరకు `ది అప్రెంటిస్` అనే టెలివిజన్ కార్యక్రమానికి సహ-నిర్మాత, హోస్ట్‌గా వ్యవహరించారు. అంతేకాదు బుల్లితెరపైనా ట్రంప్ తనదైన ముద్రవేశారు. హోమ్ ఎలోన్ - 2: లాస్ట్ ఇన్ న్యూయార్క్, అక్రాస్ ద సీ ఆఫ్ టైమ్, ద లిటిల్ రాస్కల్స్ లాంటి పలు హాలీవుడ్ చిత్రాల్లోనూ మెరిశారు. అదే సమయంలో ఓ దిగ్గజ వ్యాపార వేత్తగానూ అడుగులేశారు. డోనల్డ్ ట్రంప్ విలాసవంతమైన జీవన విధానం న్యూయార్క్ వ్యాపార ప్రపంచంలో ఆయన్ను ప్రత్యేకంగా నిలబెట్టింది.'ది అప్రెంటిస్' అనే టీవీ షో వినోద ప్రపంచంలో ట్రంప్ స్టార్‌డమ్ పెరిగేందుకు సాయపడింది.గొప్ప వ్యాపార దక్షత కలిగిన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు.



## వ్యాపారంలో వడివడిగా..

1946 జూన్ 14న న్యూయార్క్ నగరంలోని క్వీన్స్‌లోని జమైకా హాస్పిటల్‌లో ఫ్రెడ్ ట్రంప్, మేరీ అన్నే మాక్లియోడ్‌లకు నాలుగో సంతానంగా ట్రంప్ జన్మించారు. అయిదుగురు తోబుట్టువుల్లో నాలుగో వ్యక్తి ట్రంప్.ఆయనకు ఫ్రెడ్ జూనియర్, రాబర్ట్ అనే అన్నదమ్ములు.. మేరియన్, ఎలిజబెత్ అనే అక్కలు ఉన్నారు. ట్రంప్ తోబుట్టువుల్లో ప్రస్తుతం ఎలిజబెత్ మాత్రమే బతికున్నారు.ఆయన తండ్రి ఫ్రెడ్రిక్ క్రీస్ట్ ఫ్రెడ్ ట్రంప్‌నకు జర్మనీ మూలాలున్నాయి. తల్లి మేరీ ట్రంప్ స్కాట్లాండ్ వాసి.

## సైనిక అకాడమీలో క్రమశిక్షణతో..

చిన్నప్పటి నుంచీ ట్రంప్ ఏటికి ఎదురేగే మనస్తత్వమే. బాల్యంలో ఆయన చాలా చురుకుగా ఉండేవారు. దీంతో 13ఏళ్ల వయసులోనే ఆయన్ను న్యూయార్క్ సైనిక అకాడమీలో చేర్పించారు. అక్కడే చక్కని క్రమశిక్షణను అలవరుచుకున్నారు. దీంతో ఆయనలో ఆత్మవిశ్వాస స్థాయిలు కూడా పెరిగాయి.సైనిక అకాడమీ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఆయన ఫోర్డామ్ వర్సిటీలో రెండేళ్లపాటు చదువుకున్నారు. అనంతరం పెన్సిల్వేనియా వర్సిటీలోని వార్టన్ స్కూల్ ఆఫ్ ఫైనాన్స్ అండ్ కామర్స్ నుంచి ఆర్థిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు.



## ప్రతికూలతల్ని తట్టుకొని.. మొదటిసారి గెలుపును ముద్దాడి..

ప్రభుత్వ కార్యకలాపాలలో అనుభవం లేకుండా, సైన్యంలో పని చేయకుండా నేరుగా అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ పడ్డారు. ఈ క్రమంలోనే 2016 అధ్యక్ష ఎన్నికల్లో బరిలోకి దిగిన ట్రంప్‌ను ప్రతికూల పవనాలు ఉక్కిరిబిక్కిరి చేసినా తట్టుకొని నిలబడి విజయం సాధించారు. స్థానిక అమెరికన్లను ఆకట్టుకునే నినాదాలతో హోరెత్తించి విజయం సాధించారు. సైనిక లేదా ప్రభుత్వ అనుభవం లేని ఏకైక అమెరికా అధ్యక్షుడిగా నిలిచారు. గెలిచిన తర్వాత చైనా వ్యతిరేక కార్యకలాపాలతో వివాదాల్లో నిలిచారు. అతని అనేక వ్యాఖ్యలను, చర్యలను జాతి వివక్ష, జాత్యహంకార, స్త్రీ ద్వేషపూరితంగా చాలా మంది పరిగణించారు. అమెరికా మిత్రదేశాలతో సంబంధాల విషయానికొస్తే ఆయన పదవీ కాలం కాస్త అస్థిరతతో కొనసాగింది. ట్రంప్ విదేశీ నేతలతో తరచూ బహిరంగంగానే విభేదించేవారు.కీలకమైన వాతావరణ, వాణిజ్య ఒప్పందాలను తన పదవీకాలంలో వెనక్కు తీసుకున్నారు. చైనాతో వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించారు. కరోనా మహమ్మారిని సమర్థంగా ఎదుర్కోలేకపోయారని ఆయన పదవీ కాలం చివరినాళ్లలో తీవ్ర విమర్శలు పాలయ్యారు.తనకు కూడా ఈ వైరస్ సోకడంతో 2020 ఎన్నికల ప్రచారంలో ట్రంప్ తప్పనిసరి పరిస్థితుల్లో బ్రేక్ తీసుకోవాల్సి వచ్చింది.2020 అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ చేతిలో ట్రంప్ ఓడిపోయారు. ఎన్నికల ఫలితాలను అంగీకరించేందుకు ఆయన ఇష్టపడలేదు. ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. జనవరి 6న వాషింగ్టన్‌లో ఆయన మద్దతుదారులను కాంగ్రెస్ వైపు నిరసన ర్యాలీ చేయాలని కోరారు.ఆ ర్యాలీలో అల్లర్లు చెలరేగాయి.ఆ రోజు ఆయన చర్యల కారణంగా క్రిమినల్ కేసులు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో ట్రంప్ మద్దతుదారులు వైట్‌హౌస్‌పై చేసిన దాడి అమెరికా చరిత్రలో మాయని మచ్చగా మిగిలిపోయింది.

## పోర్న్ స్టార్ వివాదం, ప్రచారంలో కాల్పులు

2016 నాటి అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో ఒక పోర్న్‌స్టార్‌కు ట్రంప్ డబ్బులు చెల్లించారని, అయితే ఆ చెల్లింపులను కప్పిపుచ్చేందుకు తన బిజినెస్ లెక్కల్లో తప్పుడు వివరాలు చూపించారని అభియోగాలు నమోదయ్యాయి.ఈ కేసు తీర్పులో ఆయనను మొత్తం 34 ఆరోపణల కింద దోషిగా గుర్తించినట్లు న్యూయార్క్‌లోని మన్‌హటన్ క్రిమినల్ కోర్ట్ ప్రకటించింది.ఆ తర్వాత జూలైలో పెన్సిల్వేనియా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తుండగా.. 20 ఏళ్ల ఓ గన్‌మెన్ ఆయనపై కాల్పులు జరిపారు.పలు అభియోగాలు, కేసులు సైతం ఎదుర్కోవాల్సి వచ్చిన తర్వాత ట్రంప్ రాజకీయ జీవితం ఇక ముగిసిందనుకున్నారు. కానీ, మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేయనున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

## రెండోసారి ప్రచారంలో దూసుకెళ్లిన ట్రంప్..

రెండోసారి రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిగా ముందు వరుసలోకి కూడా వచ్చేశారు.తీవ్రమైన అభియోగాలు ఉన్నప్పటికీ ట్రంప్ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.ఆ తర్వాత కొన్ని రోజుల్లోనే నిర్వహించిన రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌లో, పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్‌ను ధ్రువీకరించారు.ఈసారి కూడా పలు డిబేట్‌లలో ప్రత్యర్థి కమలా హారిస్ ఆయన్ను ఇరకాటంలో పెట్టినా.. ట్రంప్ మాత్రం తనదైన తెంపరి మాటలతో, వ్యక్తిగత వ్యాఖ్యలతో ఆమెను టార్గెట్ చేస్తూ ప్రచారంలో దూసుకెళ్లారు. అమెరికాను తిరిగి గొప్ప దేశంగా మార్చడం, అక్రమ వలసలను నియంత్రించడం, ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడం, యుద్ధాలకు దూరంగా ఉండాలనడం, ఆర్థిక వ్యవస్థ పునర్ నిర్మాణం.. ఇలా అనేక అంశాలపై ప్రజలకు హామీలు ఇచ్చి వారిని ఆకట్టుకొనే ప్రయత్నం చేశారు. గెలుపు కోసం చాలా శ్రమ పడ్డారు. పెన్సిల్వేనియా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తుండగా దుండగులు ఆయనపై కాల్పులు జరిపారు. అయినా ట్రంప్ వెనక్కి తగ్గలేదు. 78 సంవత్సరాల వయసులోనూ ట్రంప్ అకుంఠిత దీక్ష, పట్టుదల, విజయం కోసం చేసిన పోరాటం అనన్య సామాన్యం అనే చెప్పాలి.



కమలా హ్యారిస్ వంటి బలమైన ప్రత్యర్థి ఎదురైనా ఆయన భీకరంగా పోరాడారు. వైవిధ్యంగా, తనకు మాత్రమే సాధ్యమయ్యే రీతిలో ఎన్నికల ప్రచారాన్ని సాగించారు. ఈసారి గెలవాలన్న భారీ లక్ష్యంతో అవిశ్రాంతంగా శ్రమించిన ట్రంప్‌ను విజయం పలకరించింది. అయితే, కమలా హారిస్ పలు కీలక డిబేట్‌లలో వివిధ అంశాలపై ఆయన్ను ఇరకాటంలో నెట్టడంతో డెమోక్రాట్లదే విజయం అనే చర్చ కూడా నడిచింది. కానీ, ట్రంప్‌పై కాల్పులు జరగడంతో పరిస్థితిలో చాలా మార్పు వచ్చిందనే చెప్పాలి. దీనికి తోడు ట్రంప్ ఇచ్చిన హామీలూ చాలా వరకు ప్రభావం చూపడంతో పెన్సిల్వేనియా, విస్కాన్సిన్, నార్త్ కరోలినా వంటి స్వింగ్ రాష్ట్రాల్లోనూ ట్రంప్ కింగ్‌గా నిలిచారు.మరోసారి అమెరికా వైట్‌హౌస్‌లోకి ఎంటర్ కాబోతున్నారు.



## 3 పెళ్లిళ్లు..ఐదుగురు పిల్లలు..

ట్రంప్ మూడుసార్లు పెళ్లి చేసుకున్నారు. ఆయనకు ఐదుగురు పిల్లలు.1977లో తొలిసారి ఇవానా జెల్నికోవాను వివాహమాడారు.ట్రంప్‌కు మొదటి భార్య ఇవానాతో ముగ్గురు పిల్లలున్నారు.డోనల్డ్ జూనియర్, ఇవాంకా, ఎరిక్ వారి సంతానం. అయితే నటి మార్లా మాపుల్స్‌తో ట్రంప్ ఎఫైర్ కారణంగా ఈ జంట విడాకులు తీసుకుంది.1993లో రెండో వివాహం చేసుకున్నారు. ట్రంప్ రెండో భార్య పేరు మార్లా మాపుల్స్. వారికి ఒక కూతురు. పేరు టిఫనీ. వీరు 1999లో విడాకులు తీసుకున్నారు. ట్రంప్ తన మూడో భార్య మెలానియా క్నౌస్‌ను 2005లో పెళ్లి చేసుకున్నారు. అంతకు ఏడేళ్ల ముందు వారు కలుసుకునేటప్పటికి ట్రంప్ వయసు 52 ఏళ్లు కాగా ఆమెకు 28 ఏళ్లు.వీరిద్దరికి బారన్ అనే కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం మూడోభార్య మెలానియాతో జీవిస్తున్నారు.. ముగ్గురు భార్యల ద్వారా ట్రంప్‌నకు మొత్తం ఐదుగురు పిల్లలు ఉన్నారు.

ట్రంప్ మాస్ లీడర్. అమెరికాలోని గ్రామీణ ప్రాంతాలు.. రైతుల్లో బలమైన ఫాలోయింగ్ ఉన్న నేత. కానీ, ప్రచారంలో మాత్రం ఎక్కడా కార్పొరేట్ లుక్‌ను వదిలేయలేదు. సూట్‌లోపల తెల్లటి కాలర్ షర్ట్, టై, తరచూ మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ క్యాప్‌తో ప్రచారంలో అభిమానులను అలరించారు. అంతేకాదు.. ఎవరేమనుకొంటారు అనే సంకోచం లేకుండా నేరుగా తన అభిప్రాయాలను వెల్లడించడం ఆయన స్టైల్. ఆయన ఎన్నికల ప్రచారం కూడా అంతే నాటకీయంగా సాగింది.

**మగ్‌షాట్ విక్రయాలతో..**

2020 ఎన్నికలకు సంబంధించిన వివాదాల్లో ట్రంప్‌పై జార్జియాలో 13 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. వీటి విచారణ సమయంలో ఆయన కొంత సేపు జైల్లో గడపాల్సి వచ్చింది. అప్పుడు నిబంధనల ప్రకారం నేరగాళ్లకు తీసినట్లే మగ్‌షాట్‌ను తీశారు. ఆ రకంగా ఫొటో తీయించుకొన్న తొలి అధ్యక్షుడు ఆయనే.

2024 ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ఆ ఫొటోను మగ్‌పై ప్రచారంలో భాగంగా విక్రయాలకు ఉంచారు. ''వారు నాతో ఎలా ప్రవర్తించారో మీకు గుర్తు చేయాలనుకుంటున్నాను. నన్ను ఫుల్టన్ కౌంటీ జైల్లో హింసించారు. నా మగ్‌షాట్ తీసుకొన్నారు. ఎందుకో తెలుసా..?'' అని ప్రచారం సందర్భంగా పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్‌లో చేపట్టిన ఆ కార్యక్రమం సూపర్‌హిట్. కొన్ని రోజుల్లోనే 4.18 మిలియన్ డాలర్ల విరాళాలు సేకరించారు.

**ఫైట్..ఫైట్..ఫైట్**

ఈ ఏడాది జులైలో పెన్సిల్వేనియాలోని బట్లర్ కౌంటీలో జరిగిన ప్రచార కార్యక్రమంలో ట్రంప్‌పై కాల్పులు జరిగాయి. చెవికి తూటా దెబ్బ తాకిన కొన్ని క్షణాల్లోనే.. ఆ షాక్ నుంచి కోలుకొని గాల్లోకి పిడికిలి బిగించి 'ఫైట్..ఫైట్..ఫైట్' అంటూ ట్రంప్ చేసిన నినాదంతో అమెరికా నివ్వెరబోయింది. రక్తమోడుతున్నా.. ట్రంప్ చూపిన ధైర్యానికి ఫిదా అయిపోయింది. తమ 'కమాండర్ ఇన్ చీఫ్' ఇంత ధైర్యంగా ఉండాలనేలా ప్రజలు ప్రభావితమయ్యారు.

## ప్రచారంలో ట్రంప్ స్టైలే వేరు..

**ప్రపంచ కుబేరుడికే ఇంటర్వ్యూ..**

2020 ఎన్నికలు ముగిసిన తర్వాత చాలా సోషల్ మీడియాలు ట్రంప్‌ను దూరం పెట్టాయి. కానీ, ట్విటర్‌ను మస్క్ కొనుగోలు చేశాక ఎక్స్‌గా మార్చాడు. దానిలోకి ట్రంప్‌ను మళ్లీ ఆహ్వానించాడు. ఈ రకంగా వారి బంధం బలపడింది. దీంతో ఎన్నికల ప్రచార సమయంలో ట్రంప్‌ను మస్క్ ఇంటర్వ్యూ చేశారు. దీనిని ఏకంగా 6 కోట్ల మంది వీక్షించారు. వీటిల్లో వలసలు, ఆర్థిక వ్యవస్థ, అబార్షన్లు వంటి అంశాలపై తన వాదనలను బలంగా వినిపించారు.

**బంగ్లాదేశ్‌లో దాడులపై గళం విప్పి..**

ట్రంప్ ప్రధాన ఓటర్లలో సంప్రదాయ క్రిస్టియన్, హిందూ ఓటర్లు కూడా ఉన్నారు. ఈ సారి హోరాహోరీ పోరు తప్పదని చివర్లో గ్రహించిన ట్రంప్.. హిందూ ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారు. బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడుల విషయంలో కొన్ని నెలలుగా బైడెన్ ప్రభుత్వం మౌనం వహించిన అంశాన్ని తప్పుపట్టారు. వాటిని ఖండించారు.

**చెత్త ట్రక్‌తో విన్యాసాలు**

ఎన్నికల ప్రచారం చివరి దశలో ట్రంప్ మద్దతుదారులు మొత్తం చెత్త అంటూ బైడెన్ ఓ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేవలం రెండే ప్రధాన పార్టీలున్న దేశంలో.. సగం మంది ఓటర్లను ఆయన చెత్తగా పేర్కొన్నట్లైంది. దీంతో 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' అని రాసి ఉన్న చెత్త లారీని ట్రంప్ డ్రైవ్ చేశారు. 'ఈ చెత్త ట్రక్ మీకు నచ్చిందా..? ఇది కమల, బైడెన్ గౌరవార్థం' అని విలేకర్లకు చెప్పారు. వాస్తవానికి బైడెన్ వ్యాఖ్యలకు ఇబ్బంది పడిన కమలా వాటికి దూరంగా జరిగారు. ఒక దశలో ఖండించాల్సి వచ్చింది. కానీ, అప్పటికే నష్టం జరిగిపోయింది.

**మెక్‌డొనాల్డ్స్‌లో ఫ్రైస్ అందించి..**

సగటు అమెరికన్ పౌరుడికి చిరుతిండ్లు ఇష్టం. స్వయంగా ట్రంపే బర్గర్ ప్రియుడు. అందుకే ఓటర్లకు దగ్గరయ్యేందుకు పెన్సిల్వేనియాలో ఓ మెక్‌డొనాల్డ్స్ రెస్టారంట్‌లో పనిచేశారు. అక్కడకు వచ్చిన కస్టమర్లకు ఆయన చక్కగా ఫ్రైస్ ప్యాక్ చేసి ప్రేమగా అందించారు. రిపోర్టర్లతో కూడా చక్కగా మాట్లాడారు. చిన్న ఉద్యోగులను ఆకర్షించడానికి ట్రంప్ చేసిన ఈ ప్రయత్నం ఫలించింది.

# గ్లోబల్ డ్రోన్ డెస్టినేషన్‌గా ఏపీ



**విశ్వంభర, అమరావతి:** డ్రోన్ రంగంలో రూ.వెయ్యి కోట్లకు పైగా పెట్టుబడులు, వందకు పైగా డ్రోన్ పరిశ్రమల స్థాపన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ సంస్థ ఏపీ డ్రోన్ పాలసీ 4.0ను రూపొందించింది. రూ.3వేల కోట్ల ఆదాయ సముపార్జనతోపాటు ఏపీని గ్లోబల్ డ్రోన్ డెస్టినేషన్‌గా అభివృద్ధి చేయడమే దీని ప్రధాన లక్ష్యం. పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్. సురేష్ కుమార్, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె. దినేష్ కుమార్‌లు నిపుణులతో సుదీర్ఘ కసరత్తు చేసి ఈ డ్రోన్ పాలసీని రూపొందించారు.

డ్రోన్ తయారీ, సేవల రంగం ప్రస్తుతం అత్యంత వేగంగా అభివృద్ధి చెందే రంగంగా ఏపీ ప్రభుత్వం గుర్తించింది. ఇందులో భాగంగా ఈ రంగంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని ఈ రంగంలో దేశానికే తలమానికంగా ఏపీని అభివృద్ధి చేయాలని, ప్రపంచ దేశాలు సైతం డ్రోన్ తయారీ, పరిశోధన, అభివృద్ధి రంగంలో ఏపీవైపు చూడాలనే ప్రధాన లక్ష్యాలతో ఈ పాలసీని రూపొందించారు.

**భారీ ప్రోత్సాహకాలు..**

డ్రోన్ తయారీ రంగంలో రాష్టంలో రూ.వెయ్యి కోట్లకు పైగా పెట్టుబడులు సాధించాలని ఈ పాలసీని రూపొందించారు. పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే సంస్థలకు వారి మూలధన పెట్టుబడిపైన రూ.5 కోట్లకు మించకుండా.. 20 శాతం రాయితీ కల్పించే విధంగా రూపొందించారు. డ్రోన్ తయారీ, సేవల రంగంలో రూ.3 వేల కోట్లకుపైగా రాబడి సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

**విద్యుత్తు వినియోగంలోనూ రాయితీ**

డ్రోన్ తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు విద్యుత్ వినియోగంలోనూ రాష్ట్ర ప్రభుత్వం రాయితీని కల్పించనుంది. యూనిట్ విద్యుత్తు ధరలో రూ.1 రాయితీ రూపంలో సంవత్సరానికి రూ.1 లక్షకు మించకుండా ప్రభుత్వం రెండేళ్లపాటు ప్రోత్సాహకం ఇస్తుంది. దీంతోపాటు వంద శాతం ఎస్‌జీఎస్టీ నుంచి మినహాయింపు, భూ బదలాయింపులో స్టాంపు డ్యూటీ పూర్తి మినహాయింపుతోపాటు లీజు ధరల్లో 50శాతం రాయితీ కల్పించనున్నారు. సింగిల్ విండో విధానంలో అనుమతులివ్వనున్నారు.

**డ్రోన్ హబ్‌గా ఓర్వకల్లు..**

కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లును డ్రోన్ హబ్‌గా తయారు చేయనున్నారు. 300 ఎకరాల్లో ఇక్కడ డ్రోన్ తయారీ పరిశ్రమలు నెలకొల్పనున్నారు. రాష్ట్రంలో 25 వేల మందికి డ్రోన్ పైలెట్లుగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం రాష్ట్రంలో 20 రిమోట్ పైలెట్ ట్రైనింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సంస్థల ద్వారా శిక్షణ పొందేవారికి రూ.2 వేల ప్రోత్సాహకం ఇవ్వనున్నారు. డ్రోన్ల రంగంలో 15 వేల మంది ప్రత్యక్షంగా, 25 వేల మంది పరోక్షంగా ఉపాధి పొందేలా చర్యలు చేపట్టనున్నారు.

అంతేకాకుండా డ్రోన్ పరిశోధనలు చేపట్టే విద్యా సంస్థలకు రూ.20 లక్షల పరిశోధన గ్రాంట్‌ను ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. డ్రోన్ సేవలతో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా ఈ పాలసీని రూపొందించారు. ప్రభుత్వంలోని వివిధ శాఖలు, విభాగాలు ప్రజలకు మరింత సులభంగా సేవలను అందజేయడానికి వీలుగా డ్రోన్లను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఇందుకోసం ప్రతిశాఖలోనూ ప్రత్యేకించి ఓ డ్రోన్ ఇన్నోవేషన్ అధికారిని నియమించనున్నారు.

# సునీతా విలియమ్స్ అనారోగ్యానికి గురైందా?



**వాషింగ్టన్:** స్టార్‌లైనర్‌లో తలెత్తిన సమస్యల వల్ల అంతరిక్ష కేంద్రంలో ఉన్న ఇద్దరు నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్ , బుచ్ విల్‌మోర్ భూమికి తిరిగివచ్చేందుకు వచ్చే ఏడాది వరకు ఆగాల్సి వచ్చింది. జూన్ 5న వీరిని తీసుకెళ్లిన స్టార్‌లైనర్ ప్రొపల్షన్ వ్యవస్థలో తీవ్ర సమస్యలు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు నాసా వెల్లడించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఎక్కువ రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో ఉండటం వల్ల సునీత విలియమ్స్ అనారోగ్యానికి గురయినట్లుగా సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

అంతరిక్షంలో ఉన్న వ్యోమగాములకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. అందులో సునీతా విలియమ్స్ బరువు తగ్గినట్లుగా, బుగ్గలు లోపలికి వెళ్లినట్లుగా కనిపిస్తున్నారు. ఆమె పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారని, అందువల్లే బలహీనంగా కనిపిస్తున్నారని అమెరికాకు చెందిన శ్వాసకోశ సంబంధిత వ్యాధుల నిపుణుడు డాక్టర్ వినయ్ గుప్తా ఆందోళన వ్యక్తం చేశారు.

అంతరిక్షంలో ఉన్నవారికి స్పేస్ ఎనీమియా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. స్పేస్‌లో ఉన్నప్పుడు వ్యోమగాముల్లో ఎర్రరక్తకణాలు క్షీణించే స్థితినే స్పేస్ ఎనీమియా అంటారు. 'మైక్రోగ్రావిటీ'కి ఎక్కువ కాలం గురైనప్పుడు ఎర్రరక్తకణాల ఉత్పత్తితో పోలిస్తే అవి క్షీణించే రేటు వేగంగా ఉంటుంది.

ఒక వ్యోమగామి అంతరిక్షంలోకి ప్రవేశించిన వెంటనే శరీరం స్పేస్ ఎనీమియాకు గురవడం మొదలవుతుందని నాసా నివేదిక చెబుతోంది. ఎర్రరక్తకణాలను నాశనం చేయడం ద్వారా మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో శరీరం ఆక్సిజన్ అవసరాలను తగ్గించుకుంటుంది. శరీరంలో సమతుల్యతను కాపాడే క్రమంలో వాటి సంఖ్య తగ్గిపోతూ ఉంటుంది. దాంతో అలసట, నిస్సత్తువ, శారీరక, మానసిక పనితీరు దెబ్బతినడం వంటి లక్షణాలు కనిపించొచ్చు. అలాగే గుండె పనితీరు దెబ్బతినే అవకాశమూ ఉంది.

8 రోజుల మిషన్‌లో భాగంగా సునీత, విల్‌మోర్ జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్‌లో అంతరిక్ష కేంద్రానికి (ISS) వెళ్లిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జూన్ 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగుపయనం కావాల్సిఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. దీంతో వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు వీరు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉండనున్నట్లు తెలుస్తోంది.

# నవంబర్ 18 నుంచి ఉమ్మడి జిల్లాల పర్యటనలు

**- బీసీ కమిషన్ ఛైర్మన్**

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలోని ఉమ్మడి జిల్లాల్లో రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణలు కొనసాగించాలని నిర్ణయించింది. వాయిదా వేసిన ఉమ్మడి జిల్లాల్లో ఈనెల 18 నుంచి 26 వరకు కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు పర్యటించనున్నారు. బీసీ కులాల స్థితిగతులపై అధ్యయనం చేయనున్నట్లు నిరంజన్ తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, మహబూబ్ నగర్, హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో పర్యటించనున్నట్లు తెలిపారు. బీసీ కమిషన్ సభ్యులు అక్టోబరు 28 నుంచి నవంబరు 2వ తేదీ వరకు బహిరంగ విచారణ జరిపింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయడంతో.. కమిషన్ పర్యటనలను వాయిదా వేసుకుంది.

# అమెరికా సెకండ్ లేడీగా తెలుగమ్మాయి..

**ఉషా వాన్స్‌ది ఆంధ్రానే!**

**విశ్వంభర, హైదరాబాద్ :** అమెరికాకు 47వ అధ్యక్షుడిగా రిపబ్లికన్ పార్టీకి చెందిన డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టనున్నారు. ఉపాధ్యక్షుడిగా జేడీ వాన్స్ వ్యవహరించనున్నారు. అంటే ఆంధ్రా అల్లుడు అగ్రరాజ్యానికి ఉపాధ్యక్షుడు కానున్నరన్నమాట. ఆయన భార్య ఉష తెలుగమ్మాయి కావడం ఇందుకు నేపథ్యం. ఆమె అమెరికాకు సెకండ్ లేడీగా వ్యవహరించబోతున్నారన్నమాట. ఒహాయో రాష్ట్ర సెనేటర్‌గా జేడీ వాన్స్‌ను ఉపాధ్య అభ్యర్థిగా ట్రంప్ ఎంపిక చేసుకున్నప్పటి నుంచే ఉష పేరు మార్మోగింది. ఎన్నికల్లో రిపబ్లికన్ల విజయం వేళ ఆమె పేరు మరోసారి తెరపైకి వచ్చింది.



ఉషా చిలుకూరి అమెరికాలో పుట్టి పెరిగిన తెలుగమ్మాయి. ఆమె పూర్వికులది ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రుకి దగ్గర్లోని ఓ కుగ్రామం. తల్లిదండ్రులు రాధాకృష్ణ, లక్ష్మి 1980ల్లోనే అమెరికా వలస వెళ్లారు. వీళ్ల ముగ్గురు సంతానంలో ఉష ఒకరు. తల్లి లక్ష్మి మాలిక్యులర్ బయాలజీ, బయో కెమిస్ట్రీ రంగ నిపుణురాలు. ప్రస్తుతం ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తూనే, శాన్‌డియాగో విశ్వవిద్యాలయంలో కీలకమైన అడ్మినిస్ట్రేటివ్ పదవిలో ఉన్నారు. తండ్రి రాధాకృష్ణ... క్రిష్ చిలుకూరిగా అందరికీ పరిచయం. ఆయన ఏరోస్పేస్ ఇంజినీర్. యునైటెడ్ టెక్నాలజీస్ ఏరోస్పేస్ సిస్టమ్స్ ఏరోడైనమిక్స్ స్పెషలిస్ట్‌గా పనిచేశారు. ఆపై కాలిన్స్ ఏరోస్పేస్‌లో అసోసియేట్ డైరెక్టర్‌గానూ వ్యవహరించారు. కాలిఫోర్నియాలోని శాండియాగో ప్రాంతంలో ఉషా చిలుకూరి పుట్టి పెరిగారు. యేల్ యూనివర్సిటీ నుంచి చరిత్రలో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి తత్వశాస్త్రంలో మాస్టర్స్ పూర్తి చేశారు. న్యాయ సంబంధమైన విభాగాల్లో సుదీర్ఘంగా పనిచేశారు. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు జస్టిస్ జాన్ రాబర్ట్స్, జస్టిస్ బ్రెట్ కెవానా వద్ద విధులు నిర్వర్తించారు. పటిష్ఠమైన విద్యా నేపథ్యమున్న ఆమె.. యేల్ విశ్వవిద్యాలయంలో లా అండ్ టెక్ జర్నల్‌కు మేనేజింగ్ ఎడిటర్‌గా, యేల్ లా జర్నల్‌కు ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ఎడిటర్‌గా పనిచేశారు. నాలుగేళ్లపాటు అదే విశ్వవిద్యాలయంలో ఆమె అనేక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం కేంబ్రిడ్జి యూనివర్సిటీకి గేట్స్ ఫెలోగా వెళ్లారు. అక్కడ ఆమె లెఫ్ట్‌వింగ్, లిబరల్ గ్రూప్స్‌తో కలిసి పనిచేశారు.

**వాన్స్‌తో పరిచయం అలా..**

యేల్ లా స్కూల్‌లోనే ఉషా, జె.డి.వాన్స్ తొలిసారి కలుసుకున్నారు. ఈ క్రమంలోనే ఒకరినొకరు ఇష్టపడ్డారు. 2014లో కెంటకీలో వారు వివాహం చేసుకున్నారు. హిందూ సంప్రదాయంలో వీరి వివాహం జరగడం విశేషం. వీరికి ముగ్గురు సంతానం. భర్త విజయంలో ఉష కీలక పాత్ర పోషించారు. రాజకీయంగా ఆయనకు అనేక అంశాల్లో అండగా నిలబడ్డారు. ఒహాయో సెనేటర్‌గా పోటీ చేస్తున్న సమయంలో ప్రచారంలో ఉష కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తన భర్త ప్రజాకర్షక విధానాలతో ముందుకెళ్తున్నారని వచ్చిన విమర్శలను దీటుగా తిప్పికొట్టారు. తన కెరీర్‌లో అడుగడుగునా వెన్నుతట్టే తన అర్ధాంగి తన మనసును తనకంటే లోతుగా చదవగలదని ఓ పాడ్‌కాస్ట్ షోలో చెప్పుకొచ్చారు వాన్స్. ఇలాంటి వ్యక్తి జీవిత భాగస్వామిగా దొరకడం తన అదృష్టమంటూ తన భార్యను 'శక్తిమంతమైన మహిళ'గానూ కొనియాడారాయన. రిపబ్లికన్ల తరఫున సెకండ్ లేడీగా వ్యవహరించనున్న ఉషా వాన్స్.. 2014లో డెమోక్రాటిక్ పార్టీ కార్యకర్తగా నమోదు చేసుకోవడం గమనార్హం.

# అగ్రరాజ్య పీఠంపై మళ్లీ ట్రంప్..!

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘన విజయం సాధించారు. తాజాగా విస్కాన్సిన్‌లో గెలుపుతో మేజిక్ ఫిగర్ (270)ను దాటి 277 ఎలక్టోరల్ ఓట్లతో జయకేతనం ఎగురవేశారు. కడపటి వార్తలు అందేసరికి ఇంకా మూడు రాష్ట్రాల్లో ట్రంప్ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఆయనకు ఇంకా దాదాపు 30కు పైగా ఎలక్టోరల్ ఓట్లు దక్కే అవకాశం ఉంది.

**స్వింగ్ మొత్తం ట్రంప్ వైపే..**

సంప్రదాయ రిపబ్లికన్ రాష్ట్రాలను నిలబెట్టుకోవడంతో పాటు.. గంపగుత్తగా స్వింగ్ స్టేట్స్ ఏడింటా ట్రంప్ హవా నడిచింది. ముఖ్యంగా అమెరికాలో ద్రవ్యోల్బణం, ఉద్యోగాలు, వేతనాలు, అక్రమ చొరబాట్లు వంటి అంశాలు ఈ ఎన్నికల్లో తిరుగులేని విధంగా ప్రభావాన్ని చూపాయి.

**జార్జియాలో అనుకూల పవనాలు..**

అరబ్, ముస్లింలు అధికంగా ఉన్న జార్జియాలో ఈసారి మొదటి నుంచి కమలా హారిస్ వెనుకంజలోనే ఉన్నారు. గతంలో ఇక్కడ బైడెన్ హవా నడిచింది. కానీ, గాజా యుద్ధం విషయంలో డెమోక్రాట్ల వైఖరిపై వీరు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వీరిని బుజ్జగించేందుకు కమలా హారిస్ ప్రచారం చివరిలో కూడా తాను గాజాలో శాంతిని నెలకొల్పేందుకు వీలైనంతగా యత్నిస్తానని హామీ ఇచ్చారు. అదేమీ పెద్దగా ఫలితం చూపలేదు. మరో వైపు ట్రంప్ తాను అధికారంలోకి వస్తే వారం రోజుల్లో యుద్ధాన్ని ఆపేస్తానని హామీ ఇచ్చారు. దీనికి తోడు ఆయన హయాంలో అఫ్గాన్ యుద్ధాన్ని ఆపడం, మరే కొత్త యుద్ధంలోనూ అమెరికా తలదూర్చకుండా ఉండటం కూడా సానుకూలంగా మారింది.

**వలసల వాదనకు బలమైన మద్దతు..**

ట్రంప్ మద్దతుదారులు వలస అంశానికే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. ఈ విషయాన్ని ఏపీ ఓట్ కాస్ట్ ప్రజాభిప్రాయ సేకరణ కూడా వెల్లడించింది. వాస్తవానికి ఉత్తర అమెరికాలో అక్రమ వలసదారులు పెద్ద సమస్యగా మారారు. ఈ విషయాన్ని ట్రంప్ బలంగా వాడుకొన్నారు. జార్జియాలోని ప్రచారంలో మాట్లాడుతూ ఏకంగా 1798 నాటి ఎలియన్ ఎనిమీస్ యాక్ట్‌ను తాను మళ్లీ తెరపైకి తెస్తానని హామీ ఇచ్చారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్, జర్మనీ, ఇటలీ వాసులను కట్టడి చేయడానికి దీనిని వాడేవారు. దీని ప్రకారం అక్రమ వలసదారులు అమెరికన్లను హత్య చేస్తే .. వారికి మరణదండన విధిస్తారు. మాడిసన్ స్క్వేర్ గార్డెన్ ర్యాలీలో కూడా ఇదే హామీ ఇచ్చారు. అక్రమ వలసల నిరోధంపైనే రిపబ్లికన్లు ఏకంగా 243 మిలియన్ డాలర్లు వెచ్చించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

**యుద్ధ వ్యతిరేకి కావడం..**
**ఓటర్లను ఆకర్షించిన అంశం**

ట్రంప్ విదేశాంగ విధానంలో యుద్ధాలకు పెద్దగా ప్రాధాన్యం లేకపోవడం ఓటర్లను ఆకర్షించిన అంశం. ఇప్పటికే ఉక్రెయిన్, గాజా యుద్ధాల్లో ఆ దేశం పాత్ర ఎక్కువగానే ఉంది. ముఖ్యంగా కీవ్‌ను కాపాడేందుకు బిలియన్ల డాలర్ల సొమ్ము ఇవ్వడం సగటు అమెరికా వాసికి నచ్చలేదు. ట్రంప్ అధికారంలో ఉంటే రష్యాతో సరిగ్గా డీల్ చేసేవారని స్వింగ్ స్టేట్స్‌లో నిర్వహించిన సర్వేల్లో ఓటర్లు అభిప్రాయపడ్డారంటే పరిస్థితి అర్థమవుతుంది. చైనా విషయంలో బైడెన్ అత్యంత బలహీనంగా కనిపించారు. మరోవైపు గతంలో ఏ నిర్ణయాన్ని అయినా రెండో ఆలోచన లేకుండా స్థిరంగా తీసుకోవడం ట్రంప్‌నకు స్ట్రాంగ్ మ్యాన్ ఇమేజ్ తీసుకొచ్చింది.

**ఆర్థిక వ్యవస్థ కూడా ట్రంప్ గెలుపులో బలమైన అంశం**

ట్రంప్‌ను విజయతీరాలకు చేర్చిన బలమైన అంశాల్లో ఆర్థిక వ్యవస్థ నిర్వహణ కూడా ఒకటి. 2020లో బైడెన్ అధికారం చేపట్టాక తీసుకొన్న నిర్ణయాలతో అమెరికా చాలా కాలం ద్రవ్యోల్బణం కారణంగా ధరల పెరుగుదలతో అవస్థపడింది. అప్పట్లో బైడెనామిక్స్ అంటూ డెమోక్రాట్ల విధానాలను హేళన చేసే పరిస్థితి తలెత్తింది. బైడెన్ పాలసీల కారణంగా తాము అవస్థలు పడ్డామని చాలా మంది ఓటర్లు న్యూయార్క్ టైమ్స్‌సియానా కాలేజ్ పోల్‌లో వెల్లడించారు.

**గ్రామీణ ప్రాంతాల్లో పట్టు..**

ట్రంప్‌నకు అమెరికాలోని గ్రామీణ ఓటర్ల నుంచి బలమైన మద్దతు ఉంది. సర్వేలు ఎన్ని చెప్పినా అయోవా వంటి రాష్ట్రాల్లో ఆయనే విజయం సాధించడానికి ఇదే కారణంగా నిలిచింది. ఇక జార్జియా, కెంటకీ, నార్త్ కరోలినాల్లో ఇదే ఆయనకు ఆధిక్యం తీసుకొచ్చింది.

# ట్రంప్ విజయం.. చైనా, రష్యాలు ఏమన్నాయంటే!

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలపై చైనా, రష్యాలు స్పందించాయి. అమెరికా ప్రజల ఎంపికను గౌరవిస్తామని చైనా వెల్లడించింది. అమెరికాతో శాంతియుత సంబంధాలు కొనసాగించడంపై ఆశాభావం వ్యక్తం చేసింది. పరస్పర గౌరవం, సహకార సూత్రాల ఆధారంగా చైనాఅమెరికా సంబంధాలను కొనసాగించే విధానాన్ని కొనసాగిస్తామని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ పేర్కొన్నారు. అయితే, డొనాల్డ్ ట్రంప్ పేరును నేరుగా ప్రస్తావించకుండానే అమెరికా ఎన్నికల ఫలితాలపై స్పందించారు.

ట్రంప్ విజయంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందించనప్పటికీ.. క్రెమ్లిన్ అధికారులు వీటిపై స్పందించారు. డొనాల్డ్ ట్రంప్‌నకు పుతిన్ ధన్యవాదాలు తెలుపడంపై తమకు సమాచారం లేదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. అయితే, అమెరికాను రష్యా విరోధిగా చూస్తుందన్నారు. తమ దేశంపై జరుగుతోన్న యుద్ధంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న దేశం గురించి మాట్లాడుతున్నామని అన్నారు.

ట్రంప్‌నకు రష్యా అధ్యక్షుడు పుతిన్ శుభాకాంక్షలు చెప్పకపోవడం వల్ల సంబంధాలు దెబ్బతింటాయని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. రష్యాఅమెరికా సంబంధాలు ఇప్పటికే చరిత్రలోనే అత్యంత క్షీణ దశలో ఉన్నాయన్నారు. ఈ పరిస్థితులను మార్చడం అమెరికా నూతన నాయకత్వంలోనే ఉందన్నారు. యుద్ధాలకు ముగింపు పలుకుతామంటూ ప్రచారంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ.. ఎన్నికల్లో గెలుపొంది ఓవల్ ఆఫీస్‌లోకి ప్రవేశించిన తర్వాత ఒక్కోసారి ఆ వ్యాఖ్యలు మారే అవకాశం ఉందన్నారు.




''అమెరికా నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి అభివృద్ధి కోసం పని చేయడానికి ఎదురుచూస్తున్నాం. స్వేచ్ఛా విలువలు, ప్రజాస్వామ్యం, సంస్థల రక్షణలో బ్రిటన్ అమెరికా కలిసి ముందుకు సాగుతాయని ఆశిస్తున్నాం''

**- కీర్ స్టార్మర్**

''ట్రంప్ గత పాలనలో ఉన్న రోజులు మళ్లీ తిరిగి రావాలని కోరుకుంటున్నాం. అప్పటిలా ఫ్రాన్స్ అమెరికా సహకారం కొనసాగాలని ఆశిస్తున్నాం. శాంతి, శ్రేయస్సు కోసం కలిసికట్టు కృషి చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం''

**- ఇమ్మాన్యుయేల్ మెక్రాన్**

''ట్రంప్ నాయకత్వంలో మరింత బలమైన అమెరికాను చూడాలనుకుంటున్నాం. అగ్రరాజ్యంతో ద్వైపాక్షిక మద్దతును ఉక్రెయిన్ కోరుకుంటోంది''

**- వ్లాదిమిర్ జెలెన్‌స్కీ**

''అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన ట్రంప్‌కు అభినందనలు. ప్రపంచంలో అస్థిరత పెరుగుతున్న వేళ.. బలమైన నాయకత్వం ఉన్న అమెరికా సహకారం అవసరం''

**- నాటో సెక్రటరీ జనరల్ జేన్స్ స్టోల్టెన్‌బర్గ్**

**12న తెలంగాణ స్థానిక పత్రికల**

# డిమాండ్లపై రాష్ట్రస్థాయి సదస్సు

- అక్రిడిటేషన్లు, ప్రకటనల కేటాయింపులో స్థానిక పత్రికలకు తీరని అన్యాయం
- డబ్ల్యూజేఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్




**విశ్వంభర, కరీంనగర్ :** కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో స్థానిక పత్రికల పట్ల వివక్ష కొనసాగుతోందని బిఎంఎస్ అనుబంధ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ అన్నారు. అక్రిడిటేషన్లు, రేట్ కార్డ్ విషయంలో తెలంగాణ స్థానిక పత్రికల యాజమాన్యాలకు అన్యాయం జరుగుతూ వచ్చిందని ఆరోపించారు. బుధవారం కరీంనగర్ డబ్ల్యూజేఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్వరాష్ట్రం ఏర్పడితే తమకు న్యాయం జరుగుతుందని స్థానిక పత్రికల యాజమాన్యాలు భావించాయని, అయితే గడచిన పదేళ్ల కాలంలో స్థానిక పత్రికల పరిస్థితులు మరింత దిగజారి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ప్రాపకంతో, పైరవీలతో కొందరు మాత్రమే పెద్ద పత్రికల ముసుగులో లబ్ధి పొందారని, విలువలతో నిత్యం పత్రికలు వెలువరిస్తున్న వారికి మాత్రం తీరని అన్యాయం జరిగిందని అన్నారు.

**12 న స్థానిక పత్రికల హక్కుల సాధనకై సదస్సు**

ఈనెల 12వ తేదీన హైదరాబాద్ నాగోల్ లోని శుభం కన్వెన్షన్ హాలులో 'తెలంగాణ స్థానిక పత్రికల యాజమాన్యాలు అక్రి డిటేషన్లు రేటు కార్డు' విషయంలో జరుగుతున్న అన్యాయాలపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో స్థానిక పత్రికల యాజమాన్యాల నుండి సలహాలు, సూచనలు తీసుకొని వాటిని క్రోడీకరించి ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోనున్నట్లు చెప్పారు. స్థానిక పత్రికల యాజమాన్యాలకు గుర్తింపు, గౌరవం దక్కేంతవరకు డబ్ల్యూజేఐ పోరాడుతుందన్నారు. స్థానిక పత్రికలకు జరుగుతున్న అన్యాయాలను సరిదిద్దేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అనునిత్యం ప్రభుత్వంతో ప్రాతినిధ్యం జరుపుతామని స్పష్టం చేశారు. 12వ తేదీన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే తెలంగాణ స్థానిక పత్రికల యాజమాన్యాల సదస్సుకు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో పత్రికలు నిర్వహిస్తున్న ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**రాష్ట్ర కమిటీ లోకి...**

వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, అక్రిడికేషన్ సమస్యల పరిష్కార కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా తాడూరు కరుణాకర్, యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా, అక్రిడిటేషన్ కమిటీ రాష్ట్ర సభ్యునిగా శివనాద్రి ప్రమోద్ కుమార్, రాష్ట్ర జాయింట్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బెజ్జంకి నరేష్‌లను నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

**రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను**

# మెరుగుపరిచేందుకు సమగ్ర సర్వే

**మంత్రి శ్రీధర్‌బాబు**



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో రాజకీయ, విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రారంభించామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సర్వే ఆధారంగా న్యాయపరంగా హక్కును కల్పించనున్నట్లు చెప్పారు. ఈ సర్వేతో రేషన్‌కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులు పోతాయని అపోహలు చెందుతున్నారని, ఏ కార్డులు పోవని సంక్షేమ పథకాలను అభివృద్ధి చేసేందుకే ఈ సర్వే చేస్తున్నామని మంత్రి వివరించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో ఈ సర్వేను మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. సర్వే వివరాల ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తామని మంత్రి తెలిపారు. సర్వేతో రేషన్‌కార్డులు పోతాయని కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. ఈ మూడు రోజులపాటు మొదటి దఫాగా ఇంటింటికి స్టిక్కర్లు అంటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ఇతర అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# హిమాచల్‌ప్రదేశ్ పీసీసీ రద్దు

**- ఖర్గే కీలక నిర్ణయం**



**శిమ్లా:** కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది. హిమాచల్‌ప్రదేశ్‌లో పీసీసీ యూనిట్‌ను రద్దు చేసింది. దీనికి పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదం తెలిపారు. ఈ మేరకు కాంగ్రెస్ అధికారికంగా ప్రకటించింది. ''రాష్ట్రంలోని పీసీసీ యూనిట్‌తో పాటు జిల్లా, బ్లాక్ కమిటీలు రద్దు చేయాలని కాంగ్రెస్ నిర్ణయించింది. దీనికి పార్టీ అధిష్ఠానం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుంది'' అని పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఓ ప్రకటనలో వెల్లడించారు. కాగా.. 2019లోనూ కాంగ్రెస్ ఇలాంటి ప్రయత్నమే చేసింది. ప్రస్తుతం పీసీసీగా చీఫ్‌గా ఉన్న ప్రతిభా సింగ్‌ను ఇటీవల సీడబ్ల్యూసీలోకి తీసుకున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో పీసీసీ విభాగాన్ని రద్దు చేసినప్పటికీ అధ్యక్షుడిగా కుల్‌దీప్ సింగ్ రాథోడ్‌ను నియమించింది. ప్రస్తుతం రద్దు చేయడం కాంగ్రెస్ ప్రణాళికలో భాగమంటూ సంబంధిత వర్గాలు తెలిపాయి.

**అయోధ్యలో డా.గజల్ శ్రీనివాస్ ఆలపించిన**

# 'గేయ రామాయణం' ఆవిష్కరణ

**అయోధ్య:** ప్రఖ్యాత గజల్ గాయకుడు డా.గజల్ శ్రీనివాస్ హిందీ భాషలో స్వరపరచి అలపించిన 'గేయ రామాయణం'ను శ్రీ విదుర్ ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ కుమారానంద గిరి మహారాజ్ అయోధ్యలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామాయణాన్ని డా.గజల్ శ్రీనివాస్ 17 నిమిషాల నిడివిలో గేయ రూపంలో సామాన్య ప్రజలకు అర్థమయ్యేలా రూపొందించడం అభినందనీయమని ప్రశంసించారు. రచించిన కల్నల్ తిలక్ రాజ్ జలంధర్‌ను అభినందించారు. అనంతరం డా.గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఈ గేయ రామాయణం పరమ పవిత్రమైన పుణ్య క్షేత్రం అయోధ్యలో ఆవిష్కరించడం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. ఐదువేల సంవత్సరాల ఘన చరిత్రతో గిరి సంప్రదాయం కలిగిన శ్రీ విదుర ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ కుమారానంద గిరి మహారాజ్ దివ్య హస్తాలతో ఈ గేయ రామాణం లోకార్పణం కావడం ఒక గొప్ప అనుభూతి అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ త్రిపాఠి, అంకిత్ తివారి, బుల్బుల్ పాండే, మెడికొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## యాదవుల సంస్కృతికి ప్రతీక సదర్ ఉత్సవాలు



**విశ్వంభర, నవంబర్ :** పటాన్ చేరు మండలం పెద్ద కంజర్ల గ్రామంలో సదర ఉత్సవాలు మంగళవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనం గా నిర్వహించారు. సదర్ ఉత్సవాల సందర్భంగ ఏర్పాటుచేసిన పులి రాజు నృత్యాలు, దున్నపోతుల విన్యాసాలు విశేషంగా గ్రామ ప్రజలను ఆకట్టుకున్నాయి. ప్రతి సంవత్సరం లాగే దీపావళి తర్వాత జరిగే సదర్ సంబరాలు ఈసారి కూడా ఘనంగా నిర్వహించారు. యాదవుల సంస్కృతికి ప్రత్యేకంగా జరుపుకునే ఈ సదర్ ఉత్సవాలను తిలకించేందుకు యాదవులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్ రెడ్డి, మన్నే గంగయ్య, పిల్లి విఘ్నేష్ మరియు యాదవ సంఘం అధ్యక్షులు మల్లేష్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, మహేష్ యాదవ్, శంకర్ యాదవ్, ప్రవీణ్ యాదవ్, కృష్ణ యాదవ్, సాయి, యాదవ సోదరులు గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్సీ



**విశ్వంభర, షాద్‌నగర్:** షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో నిర్మిస్తున్న భవాని మాత నూతన గుడి నిర్మాణానికి సంబంధించి బుధవారం స్లాబ్ నిర్మాణ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి స్లాబ్ నిర్మాణం కార్యక్రమంలో పాల్గొని గుడి నిర్మాణ కార్యక్రమానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్స్ బచ్చలి నర్సింహా, పిల్లి శారద శేఖర్, యాదగిరి కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్పిటల్ ప్రారంభించిన తల్లోజు ఆచారి



**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా దగ్గర డీఎంకే మల్టీ స్పెషాలిటీ ప్రవేటు ఆసుపత్రిని మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ప్రారంభించారు. అనంతరం పూజ కార్యక్రమం లో పాల్గొని వైద్యశాలను ఏర్పాటు చేసిన డాక్టర్ నిహాల్ నందు ను అభినందించి సామాన్యులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాంభూపాల్ రెడ్డి, దుర్గాప్రసాద్, రాఘవేందర్ గౌడ్, బిజెపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జన్మదినం సందర్భంగా 8న రక్తదాన శిబిరం



**విశ్వంభర, ఆమనగల్లు :** రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ అఫ్ ఆమనగల్ వారి సహకారంతో ఆమనగల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన సందర్భంగా ఈ నెల 8న శ్రీ లక్ష్మీ గార్డెన్ లో బ్లడ్ క్యాంపు నిర్వహిస్తున్నామని మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంగ్లీ రాములు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో టిపిసిసి సభ్యులు ఆయిల్ల శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షులు పసుపుల మానయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రతి గ్రామం నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్ మిత్ర మండలి సభ్యులు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



**విశ్వంభర, మహబూబాబాద్ :** పెద్ద వంగర పాత పోలీస్ స్టేషన్ ను మరొక చోటికి మార్చి క్రొత్త భవనము అయిన పోలీస్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. ఫిర్యాదుదారుల పట్ల మర్యాద పూర్వకముగా మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొర్రుర్ డిఎస్పీ కృష్ణ కిషోర్, తొర్రుర్ సీఐ జగదీష్, పెద్దవంగర ఎస్.ఐ క్రాంతి కిరణ్, తొర్రుర్ ఎస్.ఐ ఉపేందర్, దంతాలపల్లి ఎస్. ఐ రాజు, నర్సింహులపేట ఎస్.ఐ సురేష్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



**విశ్వంభర, వెల్దండ:** సైబర్ జాగృత్త దివాస్ లో భాగంగా వెల్దండ లోని బాలికల ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై సీఐ విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని, ఫోన్లలో బ్యాంక్ అకౌంట్ లో విషయంలో చదువురాని తల్లిదండ్రుల కు చెప్పి వారికి కూడా అవగాహన కలిగించాలని సీఐ విద్యార్థులతో అన్నారు.

# గీతం విద్యార్థికి రూ.60 లక్షల గరిష్ఠ వార్షిక వేతనం

### రూ.51 లక్షల వార్షిక వేతనంతో మైక్రోసాఫ్ట్ కు ఎంపికైన ఇద్దరు గీతం విద్యార్థులు





**విశ్వంభర, సంగారెడ్డి :** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మరోసారి ప్రాంగణ నియామకాలలో మేటిగా నిరూపించుకుంది. ప్రతిష్టాత్మక బహుళజాతి సంస్థల భాగస్వామ్యంతో విశేష విజయాలను ప్రదర్శిస్తూ, 2024–25 విద్యా సంవత్సరానికి ప్రాంగణ నియామకాలలో మరోసారి తన సత్తా చాటింది. ఆకట్టుకునే అత్యధిక గరిష్ఠ వార్షిక వేతనం రూ.60 లక్షలతో ఒక విద్యార్థిని ఎంపిక కాగా, మరో ఇద్దరు రూ.51 లక్షల గరిష్ఠ వార్షిక వేతనానికి ఎంపికయ్యారు. బీటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విద్యార్థిని యర్రం అనూష అట్లాసియన్ లో సాఫ్ట్ వేర్ డెవలపర్ గా గౌరవనీయమైన స్థానాన్ని సంపాదించుకుని, రూ.60 లక్షల వార్షిక వేతనాన్ని పొందనుంది. అంతేగాక, తన తోటి విద్యార్థిని కొర్రపాటి సమీనాతో కలిసి మైక్రోసాఫ్ట్ లో రూ.51 లక్షల వార్షిక వేతనంతో సాఫ్ట్ వేర్ డెవలపర్ గా ఎంపికైంది. ఈ ప్లేస్ మెంట్ సీజన్ లో గీతం విద్యార్థుల విజయం వారి కృషిని మాత్రమే కాకుండా విశ్వవిద్యాలయం యొక్క బలమైన పరిశ్రమ–విద్యా సంబంధ అనుబంధాలను, అధిక నాణ్యత గల విద్యను అందించడంలో నిబద్ధతను కనబరిచింది. కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ మమతా రెడ్డి ప్రస్తుత ప్లేస్ మెంట్ సీజన్ పై స్పందిస్తూ, ఈ ఏడాది మా ప్రాంగణ నియామకాలను అట్లాసియన్, మైక్రోసాఫ్ట్, సిలికాన్ ల్యాబ్స్, పెగా సిస్టమ్స్ వంటి ప్రముఖ బహుళ జాతి కంపెనీలతో ప్రారంభించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

## చౌదరిగూడలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభం



**విశ్వంభర, చౌదరిగూడ :** తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడంతో పాటు, దేశాన్ని తమ వైపు తిప్పుకునే విధంగా ప్రజారంజక పాలన అందించిన బీఆర్ఎస్ పార్టీ పక్షాన్నే తెలంగాణ ప్రజలు ఉంటారని, తెలంగాణ ప్రజలు తమ సొంత ఇంటి పార్టీగా బీఆర్ఎస్ ను ఆదరిస్తారని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. బుధవారం చౌదరిగూడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు హఫీజ్, మండల నాయకులతో కలిసి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొని ప్రజల పక్షాన పని చేసామని, ఆ సంఘటనలను ప్రజలు కానీ, పార్టీ కార్యకర్తలు కానీ మర్చిపోలేదని గుర్తు చేశారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని విషయాన్ని పార్టీ క్యాడర్ గుర్తుంచుకోవాలని, కచ్చితంగా మంచి రోజులు వస్తాయని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల ప్రచారంలో చెప్పిన హామీలన్ని అబద్ధాలు అనే విషయం ఇప్పటికే ప్రజలకు అర్థమైందని, ఆ పార్టీని, ఆ ప్రభుత్వాన్ని మరోమారు నమ్మే స్థితిలో ప్రజలు లేరని విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గ్రహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సైబర్ మోసాలకు గురికావద్దు : ఎస్ఐ



**విశ్వంభర, కేసముద్రం :** ఆదర్శ పాఠశాల కల్వల లో సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మురళీధర్ పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల మీ తల్లిదండ్రులు ఎలా మోసపోతున్నారో వివరించారు. 100 నెంబర్ గురించి బాలిక సంరక్షణ మైనర్ వ్యూహాలు ఫేస్బుక్, వాట్సప్ ,ఇన్స్టాగ్రామ్ విద్యార్థులు వాడవద్దని, డీపీ ఫోటోలు ఎప్పుడు కూడా పెట్టవద్దు అంటూ మార్ఫింగ్ జరిగి చాలా మోసపోతున్నారని అన్నారు. కాబట్టి విద్యార్థి దశ నుండి మంచి అలవాట్లు నేర్చుకొని ఇతరులకు తోడ్పడుగా ఉండాలని ముఖ్యంగా విద్యార్థులు హెయిర్ స్టైల్ మార్చుకోవాలి. త్రిబుల్ రైడింగ్ చేయవద్దు అలా చేసిన మీ తల్లిదండ్రులు జైలుకు వెళ్లే ప్రమాదం ఉంది. పాఠశాల ఆవరణలో మా షీ టీం వారు ఎప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. కాబట్టి మీరు చాలా జాగ్రత్తగా ఉండాలి అని వారికి చక్కటి సూచనలు తెలియజేశారు. అనంతరం ఎస్ఐని కళాశాల ప్రిన్సిపాల్ నవీన్ ఉపాధ్యాయ బృందం శాలువతో సన్మానించారు.

## మొబైల్ ఫోన్ల రికవరీలో జిల్లాకు ద్వితీయ స్థానం

### సైబర్ ల్యాబ్ సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పి రూపేష్



**విశ్వంభర, సంగారెడ్డి :** జిల్లా సిఇఐఆర్ పోర్టల్ ప్రారంభమైన నాటి నుండి సంగారెడ్డి జిల్లాలో 16 వందల మొబైల్ ఫోన్లకు పైగా రికవరీ చేసి, బాధితులకు అందించిన సంగారెడ్డి జిల్లా పోలీస్ సైబర్ ల్యాబ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన అవార్డులలో మల్టీజోన్ -2 లో సంగారెడ్డి జిల్లా ద్వితీయ స్థానంలో నిలిచిందని, డిజిపి డాక్టర్ జితేందర్ ఐపీఎస్ చేతుల మీదుగా సంగారెడ్డి జిల్లా సైబర్ ల్యాబ్ ఇన్స్పెక్టర్ నగేష్ , సంగారెడ్డి జిల్లా తరపున అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ సైబర్ సెల్ పనితీరు బాగుందని 16 వందల మొబైల్ ఫోన్లకు పైగా రికవరీ చేసి బాధితులకు అందించి అండగా నిలిచిందని సైబర్ ల్యాబ్ సేవలు అభినందనీయం అని ఇన్స్పెక్టర్ నగేష్, టెక్నికల్ సపోర్ట్ పర్సన్ రాజలింగం, పోలీస్ స్టేషన్ లెవల్ సిఇఐఆర్ ఆపరేటర్లను జిల్లా ఎస్పి అభినందించారు.

## కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం

**విశ్వంభర, కాటారం :** రౌండ్ టేబుల్ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ తెలంగాణలో సుమారు 60 లక్షల మున్నూరు కాపు జనాభా ఉంది కాబట్టి మన కుల గణన సభ్యులందరూ మున్నూరు కాపు అని రాయాలని మన పేరు ప్రక్కన రావు కానీ, రెడ్డి కానీ ఉంటే మున్నూరు కాపు అని తెలియజేయాలని మున్నూరు కాపు బాంధవులకు అందరికీ తెలియజేస్తూన్నామని అన్నారు. ప్రతి ఒక జిల్లాలో కులగణన మీద రౌండ్ టేబుల్ ప్రెస్ సమావేశాలు 33 జిల్లాల మున్నూరు కాపు సంఘాలు 584 మండలాలు సుమారు 12 వేల గ్రామ సంఘాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు అందరూ కలిసి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించాలని మన మున్నూరు కాపు సభ్యులందరూ నిర్ణయం తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో పలు మున్నూరు కాపు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు.

# ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలి

### కలెక్టర్ పమేలా సత్పతి



**విశ్వంభర, కరీంనగర్ :** సమగ్ర కుటుంబ సర్వేకు ఇండ్లకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇళ్లకు స్టిక్కరింగ్ అంటించే ప్రక్రియను కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ స్థానిక సంస్థలు, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ పరిశీలించారు. తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ గ్రామపంచాయతీలోని ఆరో వార్డులో, చిగురుమామిడి మండలం రేగొండ పంచాయతీ పరిధిలోని పెద్దమ్మపల్లి గ్రామంలోని 13వ వార్డులో.. చిగురుమామిడి మండల కేంద్రంలోని పదోవార్డులో ఇళ్లకు స్టిక్కరింగ్ అంటించే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటింటి సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఎవరికీ సమాచారాన్ని వెల్లడి చేయడం జరగదని ,అందువల్ల ప్రజలు వివరాలు ఇచ్చే విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని ఇచ్చి సహకరించాల్సిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక ,ఆర్థిక, విద్య ,ఉపాధి, రాజకీయ ,కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నదని, అందువలన తప్పు సమాచారం ఇవ్వకుండా సరైన సమాచారాన్ని ఇస్తే భవిష్యత్తులో ఈ సమాచారం ఉపయోగపడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు ఈ కార్యక్రమంలో తిమ్మాపూర్ ఎంపీడీవో టి. విజయ్ కుమార్, తహసీల్దార్ కె. విజయ్ కుమార్, కార్యదర్శి శ్రీవాణి, చిగురుమామిడి ఎంపీడీవో మధుసూదన్, ఆర్ఐ సంతోష్, కార్యదర్శులు అజయ్ కుమార్, రమేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీని విమర్శించే స్థాయి చిరుమర్తికి లేదు



**విశ్వంభర, రామన్నపేట :** భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని విమర్శించే స్థాయి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు లేదని జిల్లా కాంగ్రెస్ నాయకులు, రామన్నపేట మండలం, ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన పూస బాలకిషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంపై పని కట్టుకొని బురద జల్లే ప్రయత్నంలో ప్రతిపక్ష నాయకులు ఉన్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో నకిరేకల్ ప్రజలు చిత్తుగా ఓడించినా, లింగయ్యకు బుద్ధి రాలేదని, ఇష్టానుసారంగా మాట్లాడితే, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని, నోరు అదుపులో పెట్టుకోకపోతే నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తగిన బుద్ధి చెప్తారని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## కుల గణన సర్వే లో జాగ్రత్తలు పాటించండి

### కూర రమేష్, కార్యదర్శి రంగారెడ్డి జిల్లా సమాచార హక్కు వికాస సమితి



**విశ్వంభర, రంగారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకంగా చేపడుతున్న కుల గణన సమగ్ర సర్వే ఎంతో అద్భుతమైన చారిత్రాత్మక నిర్ణయమని రంగారెడ్డి జిల్లా సమాచార హక్కు వికాస సమితి కార్యదర్శి కూర రమేష్ అన్నారు. అయితే కుల గణన సర్వేకు సంబందించిన అధికారులు , వాలంటీర్లు ఇంటింటి కి వచ్చి మీ కుటుంబ సమాచార వివరాలు అడిగినప్పుడు మీ వద్ద ఉన్న విద్యార్హత , ఆధార్ కార్డు లపై ఉన్న కులం , పేరు లను సరైన విధంగా నమోదు చేయించుకోగలరు. కులం , పేరు కు ముందు కానీ, తరవాత కానీ గౌరవ పదాలను కలుపుకుంటూ నమోదు చేయించుకున్నట్లయితే భవిష్యత్తులో ఇబ్బందులు వచ్చే పరిస్థితులు ఉంటాయి. సంక్షేమ పథకాల ఎంపికలో కానీ, ఉద్యోగ ఎంపికలో కానీ , బ్యాంకు ల ఖాతాల నిర్వహణలో కానీ నామిని గా ఉండి వారసత్వ హక్కుల ద్వారా వచ్చే ఆస్తుల విషయంలో కానీ పలు రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. కావున ప్రజలందరూ సరైన పేరు ను, కులం పేరు ను నమోదు చేసుకోవాలని ప్రత్యేకంగా అవగాహన పెంచుటకు సమాచార హక్కు వికాస సమితి ప్రజా చైతన్యం కొరకు తెలియజేస్తున్నామని ఒక ప్రకటనలో తెలిపారు.

## కులగణన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**విశ్వంభర, షాద్ నగర్ :** సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని షాద్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ఫరూఖ్ నగర్ లో ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , మున్సిపల్ చైర్మన్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ వెంకన్న, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ రామారావు, మున్సిపాలిటీ పరిధిలోని కౌన్సిలర్లు, పట్టణ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాం

**విశ్వంభర, నల్గొండ:** నవంబర్ 9న నల్గొండ జిల్లా, మర్రిగూడ పట్టణంలో రైతులకు నిర్వహించబోయే సహజ వ్యవసాయ శిక్షణ కార్యక్రమానికి మీడియా సహకారం కోరడం జరిగిందని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం తెలిపారు. మా తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, జైకిసాన్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా, తెలంగాణ రాష్ట్రంలో సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామని . ఈ ప్రాజెక్టులో భాగంగా, నవంబర్ 9, 2024న నల్గొండ జిల్లా మర్రిగూడ పట్టణంలో భారతి గార్డెన్స్, మండల ప్రధాన కార్యాలయం దగ్గర ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సహజ వ్యవసాయం పై అవగాహన మరియు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. సుమారు 500 మంది రైతులు పాల్గొనే అవకాశం ఉందని . ఈ కార్యక్రమానికి తెలంగాణ వ్యవసాయ సంఘం చైర్మన్ ఎం. కొదండ రెడ్డి , వ్యవసాయ సంఘం సభ్యులు మరకంటి భవాని , మునుగోడు ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి , నల్గొండ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి , తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం యు ఎస్ ఏ అధ్యక్షులు శ్రీనివాస్ మనికొండ, పలువురు ప్రభుత్వ ప్రముఖులు హాజరు కానున్నారు. అని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం తెలియజేసారు.

## ప్రభుత్వ భూములను సర్వే చేయించాలి

### కంటే కేశవ గౌడ్




**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** దమ్మపేట మండలంలో కబ్జాకు గురైన భూములను తక్షణమే పేదలకు పంచాలని ఆధార పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ కంటే కేశవ్ గౌడ్ డిమాండ్ చేశారు. కబ్జా చేసిన భూములను పేదలకు ఇవ్వాలని చేపట్టిన దీక్షలకు బుధవారం ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా కేశవ గౌడ్ మాట్లాడుతూ కొందరు అధికార పార్టీ నేతలు ప్రభుత్వ భూములను దోచుకుని అందిన కాడికి కాజేస్తున్నారని, వెంటనే ఆ భూములను పేదలకు పంచాలని కోరారు. దోచుకున్న భూములను అర్హులైన పేదలకు పంచాలని, లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో కూడా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

## ఇంటింటికి స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని చేపట్టిన మున్సిపల్ పాలకవర్గం



**విశ్వంభర, కొత్తూరు :** ఎలాంటి తప్పులు దొర్లకుండా కుల గణనను పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ చైర్పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలో కుల గణన సర్వేలో భాగంగా ఇంటింటికి స్టిక్కర్ అంటించే కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ కొత్తూరు లోని ఎనిమిదో వార్డులో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం నుంచి 8వ తేదీ వరకు ఇంటింటికి స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. అలాగే తొమ్మిదవ తేదీ నుంచి కులగణన సర్వేను చేస్తామని దీనికోసం ప్రజలంతా సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్స్ మాదారం నరసింహ గౌడ్, బ్యాగరి ప్రసన్న లత యాదయ్య, మాజీ ఎంపిటిసి రాజేందర్ గౌడ్, మొర్ర జనార్దన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బండి శ్రావణ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి




**విశ్వంభర, కొత్తూరు :** మండలంలోని బిజెపి వంద సభ్యత్వాలు పూర్తి చేసిన వారికి సన్మాన కార్యక్రమం బిజెపి మండల అధ్యక్షులు మంగలి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య, పార్లమెంట్ కో కన్వీనర్ అండాపురం నర్సింహా గౌడ్ హాజరు అయ్యారు. కొత్తూరు మండలం లోని వందకు పైగా బిజెపి సభ్యత్వాలు పూర్తి చేసిన నాయకులకు, కార్యకర్తలకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య వారిని శాలువాతో ససన్మానించారు. విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పోలింగ్ బూత్ లలో రెండు వందల సభ్యత్వాలు పూర్తి చేయాలని అన్నారు. ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలు రాష్ట్ర ప్రభుత్వం పై వ్యతిరేకత తో ఉన్నారు. కాబట్టి ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని అన్నారు. పార్టీ లో కష్ట పడ్డ వాళ్లకే పదవులు వస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరూ సర్వేకు సహకరించాలి -ఎంపీడీవో శైలజా రెడ్డి



**విశ్వంభర, మహేశ్వరం :** మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సీపీ సర్వే కి గాను హౌజ్ లిస్టింగ్ చేసారు. ప్రజలందరూ ఈ సర్వేకు సహకరించాలని ఎంపీడీవో శైలజ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ, తుమ్మలూర్ బి టి ఆర్ గ్రామ పంచాయితీ లో సర్వే ను తనిఖీ చేపట్టారు.

## గోవులకు వరిగడ్డి దానం



**విశ్వంభర, షాద్‌నగర్ :** మున్సిపాలిటీ పరిధిలో సోలిపూర్ శ్రీ చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీకృష్ణ గోశాలలో గోవులకు కోసం దాత శ్రీ లక్ష్మి స్టీల్ అండ్ సిమెంట్ మార్కెటింగ్, చెట్టినాడు, దాల్మియా సిమెంటు డీలర్ శివకుమార్ ఒక ట్రాక్టర్ లోడు వరిగడ్డి దానం చేసారు. గోరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా శివకుమార్ ను 6వ వార్డు కౌన్సిలర్ లతాశ్రీ శ్రీశైలం గౌడ్ వారిని అభినందించారు.

## సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న కేవీఎన్ రెడ్డి



**విశ్వంభర, వంగూరు:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వంగూరు మండల కేంద్రంలో ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ కేవీఎన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పండిత్ రావ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, మండల నాయకులు, గ్రామ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## రెండవ ఏఎన్ఎంలను రెగ్యూలర్ చేయాలి




**విశ్వంభర, భూపాలపల్లి :** తెలంగాణ రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్ నందు గత 17 సంవత్సరాలుగా రెండో ఏఎన్ఎం గా పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేయాలని రెండవ ఏఎన్ఎంలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 17వ తేదీన శంషాబాద్ లో జరగబోయే తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎల్ఎం లో యూనియన్ ( ఏఐటీయూసీ) ప్రథమ మహాసభల గోడ పత్రికను వారు ఈ సందర్భంగా విడుదల చేశారు. గోడపత్రికలను పిహెచ్సికి అతికించిన అనంతరం వారు మాట్లాడుతూ గత 17 సంవత్సరాల నుండి కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏ ప్రభుత్వము తమను కనికరించలేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికిని తమ జీవితాల్లో మాత్రం ఎటు వంటి మార్పు రాలేదన్నారు. 33 రికార్డులతో పాటు అన్ని ఆన్లైన్ పనులు చేయాల్సి వస్తుందని చాలామంది రిటైర్మెంట్ అయ్యారని మరి కొంతమంది రిటైర్మెంట్ కి దగ్గరలో ఉన్నారన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో వచ్చినవారు చివరికి ఆ కాంట్రాక్ట్ ఉద్యోగి గానే పదవి విమరణనో లేక మరణం తోనే ముగుస్తుందనీ వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రెండవ ఏఎన్ఎం సంఘం (ఏఐటీయూసీ ) పిఎస్సీ నాయకులు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సర్వేను పరిశీలించిన ఇంచార్జి ఎంపిఓ లోకేశ్వర్ రెడ్డి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో భాగంగా బుధవారం రోజు రాయపల్లి లింగరాజుపల్లి పల్లెర్ల కూరెళ్ళ తుక్కాపురం ఆత్మకూరు గ్రామ పంచాయతీలలో ఇన్చార్జ్ ఎంపీఓ ఏల్మినేటీ లోకేశ్వర్ రెడ్డి సందర్శించారు. అనంతరం వారు ఏన్యూమరేటర్లకు జవాబు దారీతనంతో సమగ్రమైన సమాచారాన్ని సేకరించాలని అన్నారు. వీరివెంటా ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏన్యూమరేటర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

# అవార్డుకు నామినేషన్లకు ఆహ్వానం

### కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**విశ్వంభర, మహబూబాబాద్ :** ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, ఓటు హక్కు వినియోగించుకోవడం పై 2024 సంవత్సరంలో ఓటర్లకు అవగాహన పెంపొందించి చైతన్య పరచడానికి కృషి చేసిన ఉత్తమ ప్రచారానికి సంబంధించి, భారత ఎన్నికల సంఘం మీడియా అవార్డులను ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మీడియా హౌస్ ల నుండి 2024 సం.నకు ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్స్‌ను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.ప్రచార నాణ్యత, ఖచ్చితత్వం, ప్రజా పరిజ్ఞానం, ఓటర్లకు సరైన సమాచారాన్ని అందించడం, ప్రత్యేక కథనాలు, చర్చలు వంటి అంశాల ఆధారంగా ఈ అవార్డులను నిర్ణయిస్తారని, ప్రతి విభాగంలో పాల్గొనే సంస్థలు తమ ప్రచారం యొక్క సారాంశం, ప్రచురణ లేదా ప్రసారం యొక్క వార్త ఇతర సంబంధిత ప్రచార కార్యకలాపాలతో సహా నిజ ప్రతులను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 10,2024 లోగా తమ సిఫార్సును రాజేష్ కుమార్ సింగ్, అండర్ సెక్రటరీ (కమ్యూనికేషన్), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోక రోడ్, న్యూ ఢిల్లీ...110001 చిరునామాకు పంపాలని పేర్కొన్నారు. ఈమెయిల్‌లో media-division@eci.gov.in కు పంపవచ్చని, హిందీ లేదా ఇంగ్లీష్ కాకుండా ఇతర భాషలలో ఉన్నట్లైతే ఆంగ్ల అనువాదాన్ని కూడా జతపరచాలని తెలిపారు. ప్రతి ఎంట్రీ కి సంస్థ పేరు, చిరునామా, టెలిఫోన్, ఫ్యాక్స్ నంబర్లు, ఈమెయిల్ , తదితర పూర్తి వివరాలతో 10 డిసెంబర్ 2024 లోగా పంపాలని పేర్కొన్నారు. ప్రతి ఎంట్రీని ప్రచారం నాణ్యత, సరికొత్త ప్రచార పద్ధతులు, ప్రజలపై సాధించిన ప్రభావం వంటి అంశాల ఆధారంగా ఆమోదిస్తారని తెలిపారు.

# బీసీ కులగణన దేశానికే ఆదర్శం

### మంత్రి కొండా సురేఖ



**విశ్వంభర, సంగారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే-బీసీ కులగణన దేశానికే ఆదర్శమని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు మండలం చిట్కుల్ గ్రామంలో మొదలైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందుగా చిట్కుల్లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఈ సర్వే తో కులాల వారిగా బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత పెరుగుతుందన్నారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా బీసీ రిజర్వేషన్లను పెంచడానికి బీసీ కులగణన దోహదపడుతుందన్నారు. బీసీ కులగణనతో బీసీలకు రాజకీయంగా అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, డీఫీఓ శ్రీధర్ రావు, పటాన్ చెరు తహసిల్దార్ రంగారావు, ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో హరి శంకర్ గౌడ్, చిట్కుల్ ఈఓ కవితతో పాటు జిల్లా, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ వివిధ మండల, బ్లాక్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించాలి

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**విశ్వంభర, వికారాబాద్:** జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలను సత్వరమే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 2024-25 సీజన్ కు సంబంధించిన వరి కొనుగోలుపై బుధవారం జిల్లా కలెక్టర్ తన ఛాంబర్ లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,జిల్లా వ్యాప్తంగా వరిని కొనుగోలు చేసేందుకు వీలుగా 126 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రైతులు పండించిన ధాన్యం గ్రేడ్- ఏ రకానికి 2320 రూపాయలు, సాధారణ రకానికి 2300 రూపాయలు అదే విధంగా సన్న రకం ధాన్యానికి అదనంగా 500 రూపాయలు చెల్లించుటకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. 126 వరి కొనుగోలు కేంద్రాలకు గాను 34 ఐకెపి, 61 పిఎసిఎస్, 31 డీసీఎంఎస్ ఏజెన్సీల ద్వారా 108 కేంద్రాల్లో దొడ్డు రకం వరి ధాన్యం, 18 కేంద్రాల్లో సన్న రకం వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు నిర్ణయించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్ రెడ్డి లు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**విశ్వంభర, వరంగల్ :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని వంగాపహాడ్ గ్రామంలో ఫ్యాక్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు. అలాగే రైతులకు ఎవరు ఇబ్బంది కలిగించిన నా డయల్ యువర్ ఎమ్మెల్యే నెంబర్ 8096107107 కి కాల్ చేసి మీ సమస్య చెప్తే తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే నాగరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కిసాన్ శాల అధ్యక్షుడు పింగిలి వెంకట్రావు నరసింహారెడ్డి, ఆత్మకూర్ ఏఎంసి వైస్ చైర్మన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగేళ్లపల్లి తిరుపతి, మండలాధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ మెరుగు రాజేష్ మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన సింగిలాల్, స్థానిక డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, అనిల్ రెడ్డి, సముద్రాల మధు, తో పాటు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా మండల గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్దిదారులకు అందజేసిన ఎమ్మెల్యే



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి, గణపురం, భూపాలపల్లి మండలాల్లో బుధవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు విస్తృతంగా పర్యటించారు. మొగుళ్లపల్లి(64), గణపురం(72), భూపాలపల్లి(39) మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన మొత్తం 175 మంది కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్దిదారులకు రూ.1,75,20,300 విలువైన చెక్కులను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. మూడు చోట్ల చెక్కుల పంపిణీ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఎంతో అండగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పథకం ప్రజాప్రభుత్వంలో నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నట్లుతెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకంతో రాష్ట్రంలోని ఎంతో మంది పేద, నిరుపేద కుటుంబాలకు ఆడపిల్లల పెళ్లిళ్లకు భారం తగ్గిందని గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సులల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించినట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమాలల్లో ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మార్వో, ఎంపీడీవోలు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## రికవరీలో సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ తెలంగాణలో అగ్రస్థానం

### డీజీపీ చేతుల మీదుగా అవార్డ్ అందుకున్న సరూర్ నగర్ ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్ :** మొబైల్ ఫోన్ మిస్సింగ్ కంప్లైంట్స్ పై సత్వర చర్యలు చేపట్టి, రికవరి చేయడం లో తెలంగాణ పోలీస్ శాఖలో రాచకొండ పరిధిలోని సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ మొదటి స్థానంలో నిలిచింది. మొదటి స్థానంలో నిలవడంతో తెలంగాణ డీజీపీ జితేందర్ చేతుల మీదుగా సరూర్ నగర్ ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి కి అవార్డును అందచేసి అభినందించారు. ఏప్రిల్ 20, 2023 నుండి నవంబర్ 3, 2024 వరకు 50,788 మొబైల్ ఫోన్స్ రికవరీ చేసినట్లు ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి తెలిపారు. ఒక్క రోజులో యావరేజ్ గా 91 మొబైల్ ఫోన్స్ రికవరీ చేస్తున్న తెలంగాణ పోలీస్లు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐడీ డీజీపీ శికా గోయల్ , లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మహేష్ భగవత్ ఉన్నారు.

## పుస్తక పఠనంతోనే ప్రపంచ విజ్ఞానం సాధ్యం

### వరంగల్ ఎం.పి డా. కడియం కావ్య



**విశ్వంభర, హనుమకొండ :** జీవితాన్ని తీర్చిదిద్దేది పుస్తకమే, సమాజ మార్పులోనూ ముఖ్యపాత్ర పోషిస్తుంది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా.. పుస్తక పఠనంతో వచ్చే జ్ఞానం శాశ్వతం అని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. జాతీయ పుస్తక వారోత్సవాలు, బాలల దినోత్సవం సందర్భంగా హనుమకొండ అశోకా కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన నవచేతన పుస్తక ప్రదర్శనను ఎంపి డాక్టర్ కడియం కావ్య దంపతులు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పుస్తక పఠనంతోనే ప్రపంచ విజ్ఞానం సాధ్యంఅవుతుందని అన్నారు. పుస్తకాలు విజ్ఞాన నేస్తాలని, సాంకేతికత ఎంతగా పెరిగినా పుస్తకాలకు ఉన్న ప్రాధాన్యత తగ్గలేదని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను,ఉపాధ్యాయులు తమ విద్యార్థులను పుస్తకాలు చదివేలా ప్రోత్సాహించాలని, పుస్తక పఠనం పెరగడం ద్వారా మెరుగైన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని చెప్పారు. పుస్తక ప్రియులు, విద్యార్థులు, విద్యాసంస్థలు, గ్రంథాలయాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కులగణనతో అన్ని వర్గాలకు సమన్యాయం : కేఎల్ఆర్



**విశ్వంభర, మహేశ్వరం :** సమగ్ర సర్వే ద్వారా పేదలకు అందాల్సిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ వస్తాయని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం నుంచి కులగణనను అధికార యంత్రాంగం ప్రారంభించిందన్నారు. ఈనెల 30 నాటికి పూర్తి అవుతుందని కేఎల్ఆర్ అన్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయాల్లో వెనుకబాటు లేకుండా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కులగణనపై దిశానిర్దేశం చేశారని అందువల్ల ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కుటుంబ సర్వేకు చర్యలు చేపట్టినట్లు కిచ్చెన్న తెలిపారు. స్టికర్స్ వేసిన ఇళ్లకు ముందుగానే సమాచారం ఇచ్చి ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లు వస్తారని అందువల్ల పూర్తి సమాచారంతో రెడీగా ఉండాలని కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సూచించారు. కులగణన పూర్తి చేశాక జనాభా దామాషా ప్రకారం లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ఏ వర్గం నష్టపోకుండా ఉండేందుకే ఈ సమగ్ర సర్వే ఉపయోగపడుతుందన్నారు.

## మృతుల కుటుంబాలకు అండగా శ్రీనివాస్ యాదవ్, ఉప్పల వెంకటేష్




**విశ్వంభర, తలకొండపల్లి :** కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన వట్టేల సత్యమ్మ, వెంకటపూర్ గ్రామానికి చెందిన బసమోని దుర్గయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్, జడ్పీ కో ఆప్షన్ మూజీబూర్ రహేమాన్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తనవంతుగా మృతుల కుటుంబాలకు చెరో 6 వేల రూపాయలు మొత్తం12వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు ఈ కార్యక్రమంలో మస్క వెంకటయ్య, వెంకటయ్య గౌడ్, యాదయ్య, జంగయ్య, పరంధాములు, శ్రీశైలం, రవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కులగణన సర్వే పక్రియను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం అనుముల రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బీసీ కులగణన సర్వే పక్రియను యాదగిరిగుట్ట పట్టణంలోని బీసీ కాలనిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బుధవారం రోజు ప్రారంభించారు. సామాజిక,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల, సమగ్ర ఇంటింటికి కుటుంబనికి సంబంధించిన సర్వేను ఈ పక్రియ లో నిర్వహిస్తారని ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, మార్కెట్ కమిటీ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్,తదితరులు పాల్గొన్నారు.

## పి.ఎ.సిఎస్ నూతన భవనాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకు నూతన భవనాన్ని బుధవారం రోజు తెలంగాణ ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, పచ్చిమట్ల మదార్ గౌడ్, తాజా మాజీ ఎంపిపి తండ మంగమ్మ శ్రీశైలం గౌడ్, మండల కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ముద్దసానీ సిద్ధులు గౌడ్,పిఎసిఎస్ సీఈఓ యాస కిరణ్ రెడ్డి,పిఎసిఎస్ డైరెక్టర్లు నోముల వెంకట్ రెడ్డి తదితరులు, మండల నాయకులు, పిఎసిఎస్ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

## కొండాపురంలో బి.జె.పి సభ్యత్వాల సేకరణ



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూర్ మండలం కొండాపురం గ్రామంలో బూత్ నెంబర్ 234 లో సభ్యత్వాల సేకరణ కార్యక్రమం చేపట్టారు . ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పన్నాల చంద్రశేఖర్ రెడ్డి, ఆత్మకూరు(ఎం) మండల శాఖ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్, భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జోరుక ఎల్లేష్ ముదిరాజ్, జనతా పార్టీ కిసాన్ మోర్చా మాజీ మండల ప్రధాన కార్యదర్శి మంచాల కుమార్, బీజేవైఎం నాయకులు కోల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## తొర్ర యాదమ్మ మృతదేహానికి నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు తొర్ర విష్ణు తల్లి యాదమ్మ అనారోగ్యంతో మరణించింది. వారి పార్థివదేహంపై మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## భూపాలపల్లి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా అశోక్ కుమార్



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ గా బుధవారం పదవి బాధ్యతలు చేపట్టిన అశోక్ కుమార్ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ను కలిసి మొక్కను అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ ఖాజా మోహినుద్దీన్, సిబ్బంది అదనపు కలెక్టర్ కు మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## సభ్యత్వ నమోదుకు ప్రజల నుండి విశేష స్పందన



**విశ్వంభర, ఎల్బీనగర్ :** బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, ఆర్.కె.పురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి అన్నారు. బుధవారము ఆర్కే పురం డివిజన్లో బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి బిబిఆర్ వేణు, బిజెపి గీతా సెల్ కో కన్వీనర్ కిరణ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలు ముందుకొచ్చి స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ట ఉపేందర్ రెడ్డి, బుక్క రమేష్, ముంత రాములు, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, జనార్ధన్ ,సైదయ్య ,రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే



**విశ్వంభర, హనుమకొండ జిల్లా:** హసన్పర్తి మండల పరిధిలోని జయగిరి గ్రామం నందు మణికంఠ గ్రామైక్య సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని సూచించారు.

## ముచ్చర్లలో శ్రీరామలింగేశ్వర సమేత చౌడేశ్వరీ మాత విగ్రహ పునః ప్రతిష్ట



**విశ్వంభర, ముచ్చర్ల :** గ్రామంలో దేవాంగ సంక్షేమ సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శ్రీ రామలింగేశ్వర సమేత చౌడేశ్వరీ మాత విగ్రహ పునః ప్రతిష్టా కార్యక్రమాన్ని బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బిల్ల శ్రీధర్ మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ చేనేత కార్మికుల కుల దైవమైన చౌడేశ్వరీ మాత విగ్రహన్ని మా ముచ్చర్ల గ్రామంలో పునః ప్రతిష్టా చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు బుధవారం నుండి మొదలై శుక్రవారం యంత్ర విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేకం,అన్నదాన కార్యక్రమంతో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ లింగేశ్వర సమేత చౌడేశ్వరీ మాత ఆలయ అభివృద్ధి కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పొలాస శివ కుమార్, గౌరవ అధ్యక్షుడు అరె వీరయ్య,ఉపాధ్యక్షుడు కొండుక ప్రదీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి అరె రాజేందర్,సహాయ కార్యదర్శి అరె సంపత్ కుమార్,కోశాధికారి పొలాస రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారులు సమన్వయంతో పనిచేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** జిల్లాలో నూరు శాతం సాచ్యురేషన్ మోడ్ లో అంతర్జాల సేవలు అందించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. బుధవారం అంతర్జాల నెట్ సేవలపై బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్ టెల్ తదితర సర్వీస్ ప్రొవైడర్లు తో సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల వరకు ఇంటర్నెట్ సేవలు విస్తరించడం అత్యంత కీలకమని, ఈ లక్ష్యాన్ని సాధించేందుకు సర్వీస్ ప్రొవైడర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు అన్ని ఆన్‌లైన్ సేవలు సులభంగా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ విధానాలు ప్రతి వ్యక్తికి చేరేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. పలిమేల, మహాదేవపూర్, మహా ముత్తారం మండలాల్లో నెట్ వర్క్ సమస్య ఉందని టవర్లు ఏర్పాటుకు అటవీశాఖ అనుమతులు జారికి చర్యలు తీసుకుంటామని జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సిపిఓ బాబురావు, బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్ టెల్ సర్వీస్ ప్రొవైడర్లు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** సర్వే సిబ్బందికి ప్రజలు సహకరించాలని, తప్పుడు సమాచారం ఇవ్వొద్దని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం గణపురం మండలం 3వ వార్డు, భూపాలపల్లి మండలం కృష్ణ కాలనిలో సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ , కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా హౌస్ లిస్టింగ్ సర్వే ప్రక్రియను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్క కుటుంబాన్ని వదల కుండా వివరాలు సేకరణ చేయాలని సూచించారు. కుటుంబ వివరాలు చెబితే ఏదో జరుగుతుందనే అపోహ వద్దని వివరాలు గోప్యతగా ఉంచుతామని అన్నారు. బుధ గురువారాల్లో రెండు రోజుల పాటు గ్రామ పంచాయతి, మున్సిపాలిటీలో సమగ్ర ఇంటింటి కుటుంబ జాభితా సర్వే చేయనున్నట్లు తెలిపారు. సర్వే నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, ఒక్క ఇంటిని కూడా వదల కుండా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులను నియమించామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆర్డిఓ, నియోజకవర్గ నోడల్ అధికారి, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, శ్రీనివాస్, ఎంపిడిఓ భాస్కర్, సూపర్ వైజర్ ఉష, ఎన్యూమరేటర్ సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ. లక్షతో పాటు తులం బంగారం వెంటనే ఇవ్వాలి

## ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి



**విశ్వంభర, ఎల్బీ నగర్ :** కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ లకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో 100 రోజుల్లో అమలు చేస్తానని హామీ ఇచ్చి ప్రజల్ని మోసం చేసిందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారము సరూర్నగర్ తాసిల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం సబిత ఇంద్ర రెడ్డి మాట్లాడుతూ 6 గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తానని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ తీసుకొచ్చిన కెసిఆర్ కిట్టు న్యూట్రిషన్ కిట్టు ఆపకుండా ఇవ్వాలని కోరారు. అనంతరం టిఆర్ఎస్ ప్రభుత్వంలో సరూర్నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్మించిన నూతన భవనాన్ని పరిశీలించారు.

# ప్రజలు సర్వే అధికారులకు సహకరించాలి

## -జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**విశ్వంభర, వికారాబాద్ :** జిల్లాలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే కు ఇండ్లకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం ప్రారంభమైన సామాజిక ,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ను వికారాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డ్ నెంబర్ 26 ఇష్కాన్ బాది కాలనీలో , వికారాబాద్ మండలం గొట్టిముక్కుల గ్రామం లో సమగ్ర కుటుంబ సర్వే ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. , ఒక ఇంటిలో ఎంత మంది కుటుంబ సభ్యులు, ఎన్ని కుటుంబాలు ఉన్నాయని వివరాలు అడిగి తెలుసు కున్నారు.ఇంటి సర్వే సందర్భంగా సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచడం జరుగుతుందని, సర్వే కోసం వచ్చిన ఎన్యుమరేటర్లకు సరైన సమాచారాన్ని ఇచ్చి సహకరించాల్సిందిగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక ,ఆర్థిక, విద్య ,ఉపాధి, రాజకీయ ,కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు చాలా ప్రాధాన్యత ఇస్తున్నదని, అందువలన తప్పు సమాచారం ఇవ్వకుండా సరైన సమాచారాన్ని ఇస్తే భవిష్యత్తులో ఈ సమాచారం ఉపయోగపడేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు .ఇంటింటి సర్వే కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందని అన్నారు. జిల్లాలోని అందరు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు సమగ్ర సర్వే విషయంపై విస్తృతంగా టామ్ టామ్ వేయించాలని ఆదేశాలు జారీ చేశారు. సమగ్ర సర్వేకు వివరాలు ఇచ్చేందుకు ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. ఆకస్మికతనిఖీల ద్వారా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఏం పి డి ఓ, తహసీల్దార్,ఎన్యుమరేటర్లు తదితరులు ఉన్నారు.

# మూసీ బాధితులకు మద్దతుగా సంతకాల సేకరణ



**విశ్వంభర, బషీర్ బాగ్:** మూసీని అత్యంత కలుషితమైన నదులలో ఒకటిగా మార్చిన ఫార్మా మాఫియాను కూల్చి, అనంతరం పునరావాసం కల్పించి పేదల ఇళ్ళు కూల్చాలని సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. హైదరాబాద్ శివార్లలోని ఫార్మా కంపెనీలు పరిశ్రమల వ్యర్థాలను యథేచ్ఛగా మూసి నదిలోకి వదులుతున్నా రాష్ట్ర ప్రభుత్వం వాటిని నియంత్రించే చర్యలు తీసుకోకుండా మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ ఎలా చేపడుతారని, ప్రజల జీవన ప్రమాణాలను ఎలా కాపాడుతారని అయన ప్రశ్నించారు. మూసీ బాధితులకు న్యాయం చేయాలనీ డిమాండ్ చేస్తూ వారికీ మద్దతుగా లిబర్టీ చౌరస్తాలో బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ నిర్వహించిన సామూహిక సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తన సంతకం చేసి పాశం యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నది కాలుష్యం నుండి ప్రజలను రక్షించడానికి ముందుగా ప్రభుత్వం చర్యలు చేపట్టి, నది ప్రక్షాళన, నీటిని మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు, నది ఒడ్డున నివసించే వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం అధ్యయనం చేసి వారికీ పునరావాసం, జీవనోపాధి కల్పించి ప్రక్షాళన చేపట్టాలని అన్నారు. అనంతరం డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ మూసీ నది పునరుజ్జీవనం కోసం నదీతీర జనాభాకు హాని కలిగించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం దుర్మార్గమన్నారు. డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్), పునరావాస పాలసీ లేకుండానే ఎందుకు ప్రాజెక్టును వేగవంతం చేసి పేదల ఇళ్ల కూల్చివేతలు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

## రామన్నపేటలో బీజేపి సభ్యత్వ నమోదు



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు రాపోలు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధ మల్ల ఆనంద్ గౌడ్ విచ్చేసి, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేశారని, రైతుబంధు ఇవ్వకుండా రైతులను మోసం చేశారని, నిరుద్యోగబృతి ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. దేశంలో ప్రజలందరూ నరేంద్ర మోడీకి మద్దతుగా సభ్యత్వ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్య, ఓ.బి.సి మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారపు రమేష్ ముదిరాజ్, బిజెపి మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య, జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ గౌడ్, నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకన్న, నార్కట్పల్లి మండల అధ్యక్షులు కొరివి శంకర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు అక్కెనపల్లి సైదులు, మండల ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ, శనగొండ మల్లికార్జునాచారి, కరెంకొండ సంతోష్, బొడిగె సురేష్, బొడిగ వినోద్, కూరెళ్ళ ఉపేంద్రచారి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వే బృందాలకు సహకరించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ , కులగణన సంబంధించి భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలో కుటుంబంల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైనది. దీనికిగాను ఎన్యుమరేటర్లుగా పంచాయతీ కార్యదర్శిలను, సిఆర్పిలను, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను, 71 మందిని నియమించడం జరిగినది అని మాదాపూర్ ఎమ్మార్వో ప్రహ్లాద్ రాథోడ్ తెలిపారు. ప్రతి 15 బ్లాక్ లకు ఒకరిని సూపర్వైజింగ్ ఆఫీసర్లుగా భూపాలపల్లి జిల్లా కలెక్టర్ నియమించినట్లు ఆయన తెలిపారు. మూడు రోజుల పాటు గ్రామములలో కుటుంబంలో గుర్తింపు అనంతరం సర్వే ప్రారంభించబడుతుంది అన్నారు.

## ఇంటింటి కులగణన సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, ఘట్కేసర్:** ఘట్కేసర్ పోచారం మున్సిపాలిటీ పరిధిలోని ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభించిన, మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యుడు చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు సుధీర్ రెడ్డి, ఈ సంధర్భంగా మేడ్చల్ నియోజకవర్గం శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి మాట్లాడుతూ స్వతంత్రం వచ్చినప్పటి నుండి ఓట్లు వేసేది బిసిలు, పరిపాలించింది ఓసిలని అన్నారు. అందుకే ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు న్యాయం చేసే విధంగా కార్యక్రమం చేపట్టిందన్నారు. మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ బీసీ కమిషనర్ ప్రభుత్వంపై పిటిషన్ వేసిన రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లకుండా వెంటనే క్యాబినెట్లో చర్చించి బీసీలకు న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ కులగనన కార్యక్రమం చేపట్టిందని అన్నారు.

## ఓటర్ అవగాహనపై చైతన్య సదస్సు




**విశ్వంభర, నల్గొండ జిల్లా :** మీనా ఇంజనీరింగ్ కళాశాలలో ఓటర్ అవగాహన (చైతన్య ) సదస్సును ఎస్విఈఈపి , నోడల్ అధికారి , మిర్యాలగూడ డిఎల్పీవో రాఘవరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి మాట్లాడుతూ యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని ఓటు రూపంలో దానిని సక్రమంగా వినియోగించుకొని సుపరిపాలన అందజేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకోవాలని కోరారు. కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవడంతో పాటు మీ పరిసరాలలో ఉన్న వ్యక్తులను కూడా చైతన్యవంతం చేయవలసిన బాధ్యత అంబాసిడర్స్ పై ఉందని, అందుకోసం భారత ఎన్నికల సంఘం పౌరులకు కల్పించిన వివిధ రకాలైన యాపులను వినియోగించుకొని ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యత అంబాసిడర్స్ గా యువతపై ఉందని అన్నారు.

## శివ మారుతి ఆలయంలో అయ్యప్ప మాలధారణ



**విశ్వంభర, షాద్ నగర్ :** పట్టణంలోని శ్రీ శివ మారుతి అయ్యప్ప గీతా మందిరంలో బుధవారం గిరీష్ సతీషన్ నాయర్ గురు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ కార్యక్రమంచేపట్టారు. అధిక సంఖ్యలో స్వామి భక్తులు మాల ధారణ చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున భక్త బృందం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు లష్కర్ ఆంజనేయులు, ఆలయ ప్రధాన కార్యదర్శి రేటికల్ నందీశ్వర్ స్వామి, గొల్ల రామరాజ్ యాదవ్ స్వామి, బాల్ రెడ్డి గురు స్వామి, పలపట్ల సతీష్ స్వామి, సిద్ధల శ్రీనాథ్, పొగాకు సురేష్ స్వామి,సంగమేశ్వర స్వామి,మణి స్వామి,అరుణ్ స్వామి,చెలకల హరి స్వామి,రమణ స్వామి, ప్రవీణ్ స్వామి,నిరంజన్ స్వామి, ఆలయ అర్చకులు రవి శర్మ సంతోష్ సునీల్ మేనేజర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ జిల్లా భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ జన్మదినం సందర్భంగా భూపాలపల్లి శాసనసభ్యులు సత్యనారాయణ రావు కలెక్టర్ కు మొక్కను గుర్తుగా ఇచ్చి శాలువాతో సత్కరించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇంటింటి సర్వే పై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**విశ్వంభర, మహబూబాబాద్ :** బుధవారం నుండి ప్రారంభమైన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మహబూబాబాద్ పట్టణం లోని సోమ్లాతండా, 26 వార్డు ఆదర్శనగర్, జమండ్లపల్లి అంబేద్కర్ నగర్, మహబూబాబాద్ మండలం పర్వతగిరి, కంబాలపల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రణాళిక ప్రకారం సిబ్బందిని నియమించడం జరిగిందని, ఈరోజు నుండి మూడు రోజులు కుటుంబాలు, ఇంటి నెంబర్లు, గ్రామం, వార్డు, కుటుంబాల సంఖ్య, ఇంటింటి స్టిక్కరింగ్ చేసి ప్రాథమిక సమాచారం సేకరిస్తారని, అనంతరం పూర్తి సర్వే 9 తారీకు నుండి కొనసాగుతుందని ఈ సర్వే కోసం (1884) మంది ఎన్యుమరేటర్లను నియమించి వారిపై (186) మంది సర్వే సూపర్వైజర్ లను నియమించడం జరిగిందన్నారు. సర్వే యొక్క రోజువారి నివేదికలను సమర్పించాలని సూపర్వైజర్లను నోడల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.పర్వతగిరి గ్రామ కార్యదర్శి పార్వతి, 26వ వార్డు, ఆదర్శ్ నగర్ ఆర్పి సరిత లను సర్వే ఎలా చేస్తున్నారు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## ఖోఖో క్రీడల పోటీలను ప్రారంభించిన ఆశాదీప్ రెడ్డి



**విశ్వంభర, కల్వకుర్తి :** కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు కాయితి ఆశాదీప్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కోకో క్రీడలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అండర్ 17 బాల బాలికలకు సంబంధించిన కోకో పోటీలను ఆశాదీప్ రెడ్డి నిర్వహిస్తున్నారు. క్రీడల ప్రారంభానికి హాజరైన ఆయనకు క్రీడాకారులు ఘన స్వాగతం తెలిపారు. సందర్భంగా ఆయన క్రీడలు మానసిక శారీరక అభివృద్ధికి దోహదం చేస్తాయని తెలిపారు

## మృతుల కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



**విశ్వంభర, కడ్తాల్ :** కడ్తాల్ మండల కేంద్రంలో అశోక్, ఎక్వాయి పల్లి గ్రామపంచాయితీలో ఏదుల అలివేలు మంగళవారం మరణించారు. విషయం తెలుసుకున్న రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ మృతుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మృతదేహాలకు నివాళు లర్పించారు. తదుపరి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక్కో కుటుంబానికి 5000 రూపాయలు చొప్పున రెండు కుటుంబాలకు పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు అధ్యక్షుడు జోగు వీరయ్య, మాజీ ఎంపిటిసి లచ్చి రామ్ నాయక్ డైరెక్టర్ లాయక్ అలీ నాయకులు చందోజి బిక్షపతి వెంకటేష్, లక్ష్మణ్ సుమన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు

## భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి




**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం :** కూలి దొరకక పస్తులు ఉంటున్న భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి పట్టణంలో వెంటనే ఇసుక ర్యాంపుని ఏర్పాటు చేసి భవననిర్మాణ కార్మికులకు పని చూపించాలని సిఐటియు పట్టణ కన్వీనర్ ఎంబి నరసారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయం లో సిఐటి నాయకులు నకరికంటి నాగరాజు అధ్యక్షతన జరిగిన పట్టణ జనరల్ బాడీ సమావేశం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎంబి నర్సారెడ్డి ,పాల్గొని కార్మికుల ను ఉద్దేశించి మాట్లాడుతూ భద్రాచలం పట్టణం మీద ఏ ప్రభుత్వాలు మారిన ఎవరికీ కూడా ఎటువంటి ప్రేమ లేని పరిస్థితుల్లో అభివృద్ధికి నోచుకోవటం లేదు సుమారు 5000 మంది భవన నిర్మాణ కార్మికులు భద్రాచల పట్టణంలో నివాసం ఉంటున్నారు వారికి ఏ విధమైన ఉపాధి లేక అనేక రాష్ట్రాలకి, పట్టణాలకు, వలసలు పోతున్నారు.

## అక్రమ డిప్యూటేషన్‌పై లోకాయుక్తలో ఫిర్యాదు



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండలం నెల్వలపల్లి గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల నుండి టీచర్ అక్రమ డిప్యూటేషన్ సర్దుబాటుపై తెలంగాణ లోకాయుక్తలో ఫిర్యాదు చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. ఎటువంటి ఉత్తర్వులు లేకుండా టీచర్ ను పోలేపల్లి రాంనగర్ పాఠశాలకు ఎలా పంపుతారని పలుమార్లు అధికార్లను అడిగినా స్పందన లేదని, మండల స్థాయి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికార్లు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ధ్వజమెత్తారు. జిల్లా విద్యా శాఖాధికారి పై , అక్రమ పని సర్దుబాటుపై వెళ్లిన టీచర్ పై ఉత్తర్వులు లేకుండా టీచర్ ను జాయిన్ చేసుకున్న పోలేపల్లి రాంనగర్ పాఠశాల హెడ్మాస్టర్ పై ఫిర్యాదు చేసినట్టుగా గ్రామస్తులు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందే అని చెప్పారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో గొడ్డటి మధు, పాలగోని వినోద్, గజ్జల వెంకట్ రెడ్డి, నల్లగాసు వెంకటయ్య, తుల్ల రామకృష్ణ, నక్క లక్ష్మయ్య, మాడెం శ్రీను ఉన్నారు.

## మానవాళికి చదువు, విజ్ఞానం ఎంతో ముఖ్యం: డా. పెండెం కృష్ణ కుమార్



**విశ్వంభర, ఎల్బీనగర్ :** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నాలుగు సార్లు పొందిన విభిన్న పాత్రాభి ,నయ కళాకారులు, సమాజ సేవకులు, రచయిత డా. పెండెం కృష్ణ కుమార్ సింగిరెడ్డిపాలెం పెన్ పహాడ్ మండలం)లోని ప్రాథమిక పరిషత్ ఉన్నత పాఠశాలకు అనేక దేశ నాయకుల చిత్రపటాలు, మెడికల్ కిట్టు, వాటర్ క్యాన్ , ఆట వస్తువులు ,గోడ గడియారం, విటమిన్ సి టాబ్లెట్లు, క్లాత్ బాగ్స్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి. నరేందర్ మాట్లాడుతూ దాత పెండెం కృష్ణ కుమార్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల క్రీడా సామాగ్రిని , దేశభక్తిని పెంపొందించడానికి దేశ నాయకుల పటాలను, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి శాస్త్రవేత్తల పటాలను, పర్యావరణ పరిరక్షణ అలవర్చడానికి క్లాత్ బ్యాగులను అందించి పాఠశాలను సందర్శించడం మంచి విషయాలను చెప్పి విద్యార్థులలో ఎంతో స్ఫూర్తిని నింపిందని తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజం కొరకు వారి కృషి ఎంతో ప్రశంసదాయకమని, వందలాది పాఠశాలల్లో చేసిన సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. 333 పాత్రలలో హిస్టారికల్, మైథాలజికల్, సోషల్, ఫ్రీడమ్ ఫైటర్స్, స్త్రీ, పురుష అన్ని రకముల పాత్రలలో నటించిన డా. పెండెం కృష్ణ కుమార్ అభినందనీయులు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు నల్ల శ్రీనివాసులు, సరిత, ప్రమీల పాల్గొన్నారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి బంగారు పూత ఆభరణాలు సమర్పించిన భక్తులు



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** విజయ నగరం చెందిన సత్యనారాయణమూర్తి రత్నశ్రీ దంపతులు ప్రత్యేకంగా తయారు చేయించిన రాగితో బంగారు పూత ఆభరణాలను ఆలయంలో సంప్రోక్షణ హోమాలు జరిపించి ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎల్ రమాదేవికి అందజేశారు. బుధవారం సందర్భంగా నిత్య కళ్యాణం మూర్తులకు అభిషేకం నిర్వహించిన అర్చకులు అనంతరం భక్తులు సమర్పించిన ఈ ఆభరణాలను స్వామివారికి అలంకరించారు.

# వెంకటేశ్వర స్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** రేగొండ మండలం లోని బుగులోని వెంకటేశ్వర స్వామి జాతర ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగనున్నందున వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జాతర నిర్వహణపై బుధవారం ఐడిఓసి కార్యాలయంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమయం చాలా తక్కువ ఉందని 14 తేదీన జాతర ప్రారంభం అవుతుందని రానున్న వారం రోజుల్లో అప్పగించిన పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బుగులోని వెంకటేశ్వర స్వామి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు.

ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుంచి జరుగుతున్న పెద్ద జాతరని, పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చేరుకునే అన్ని రహదారుల్లో మరమ్మతులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. వచ్చే భక్తులకు సురక్షిత మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దేవాలయ పరిసరాలల్లో పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని తెలిపారు. పారిశుద్య కార్యక్రమాలు నిర్వహణకు ప్రత్యేక పారి శుద్య సిబ్బందిని నియమించాలని నిరంతరం పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలని డిపిఓకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి వసంత, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిపిఓ నారాయణ రావు, జిల్లా వైద్యాధికారి డా.మధుసూదన్, డిఎస్పీ సంపత్ రావు, అగ్నిమాపక అధికారి శ్రీనివాస్, దేవాలయ ఈఓ శ్రీనివాస్, దేవాలయ చైర్మన్ రుంటాల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సార్ దయ చూపండి..!

- వృద్ధ కళాకారులకు కష్టాలు
- 5 నెలలుగా అందని పెన్షన్
- ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామీణ కళాకారులు



**విశ్వంభర, చండూర్ :** గ్రామీణ కళాకారులకు ఐదు నెలల నుండి పెండింగ్లో ఉన్న పెన్షన్ డబ్బులను వెంటనే విడు దల చేయాలని గ్రామీణ కళాకారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం సార్ దయ చూపండి అంటూ వృద్ధ కళాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామీణ కళాకారుల సంఘం అధ్యక్షుడు ఏలే సత్తయ్య మాట్లాడుతూ గత ఐదు నెలలుగా పెన్షన్ డబ్బులు పడకపోవడంతో చాలా తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు. ఎలాంటి పనులు చేయలేక ఆరోగ్యాలు సహకరించకపోవడం వలన వచ్చే పెన్షన్ ద్వారా కుటుంబ పోషణ , మెడిసిన్ తెచ్చుకుంటు న్నామని అన్నారు. గత కొన్ని నెలలుగా పెన్షన్ ఇవ్వకపోవడం వల్ల పరిస్థితులు బాగోలేవని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామీణ కళాకారులకు నెలకు ఆరు వేలు ఇస్తామని చెప్పి మాట తప్పడమే కాకుండా ఉన్న పెన్షన్ కూడ నెల నెలకు ఇవ్వడం లేదని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ లో ఉన్న పెన్షన్ డబ్బులను విడుదల చేయాలనీ , గ్రామీణ కళాకారులకు నెలకు ఆరు వేల పెన్షన్ పొందే విధంగా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ కళాకారులు ప్రధాన కార్యదర్శి బావండ్ల కొండయ్య, గుర్రం యల్లయ్య, రాపోలు రమేష తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర శస్త్రచికిత్స శిబిరం

- ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరం విజయవంతం
- స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం
- ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్




**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మారుతి నర్సింగ్ కాలేజ్, లయన్స్ క్లబ్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో ఎన్ఆర వాసవి అసోసియేషన్ యుఎస్ఏ, పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్ వారి సహకారంతో నేడు మారుతి నర్సింగ్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత నేత్ర శస్త్ర చికిత్స శిబిరం విజయవంతంగా నిర్వహించబడినది. ఈ శిబిరంను శ్రీ బి.రాహుల్ ఐఏఎస్, ప్రాజెక్టు ఆఫీసర్- ఐటీడీఏ భద్రాచలం వారు ప్రారంభించినారు. ఈ కార్యక్రమం అంధత్వ నివారణ కొరకు గిరిజన ప్రాంతంలో నిర్వహించబడుట అభినందనీయమని, స్వచ్ఛంద సంస్థల సేవలను కొనియాడారు. అంధత్వ నివారణ కొరకు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ అన్ని చర్యలు చేపడుతుందని, ఈ కార్యక్రమానికి కావలసిన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిధులుగా బి.రవిబాబు డీసీహెచ్ఎస్, డా. యం. రామకృష్ణ, సూరిండెంట్ ఆఫ్ భద్రాచలం ఏరియా హాస్పిటల్, శ్రీ యస్. వెంకటపుల్లయ్య, మోటార్ వెహికిల్ ఇన్స్ స్పెక్టర్ భద్రాచలం, డా. ఆర్. నారాయణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కె.దామోదర్రావు ఆర్.డి.వో. భద్రాచలం వారు పాల్గొని కంటి ఆపరేషన్లకు ఎంపికైన మొదటి బ్యాచ్ 40 మందిని పుష్పగిరి కంటి ఆసుపత్రి సికింద్రాబాద్ కు తీసుకువెళ్తున్న వాహనమును జెండా ఊపి ప్రారంభించినారు. ఈ కార్యక్రమంలో భాగంగా డా.ఎస్.ఎల్. కాంతారావు ప్రోగ్రాం చైర్మన్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమం, అంధత్వ నివారణ కొరకు రీజితేష్ వి.పాటిల్ జిల్లా కలెక్టర్ పూర్తి సహకారంతో ఈ కార్యక్రమంను నిర్వహించి విజయవంతం చేసినట్లు వారికి ధన్యవాదాలు తెలిపినారు. ఈ శిబిరంలో 1120 మందికి పరీక్షలు నిర్వహించి, 602 మందిని 15 బ్యాచ్ లుగా కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి చూపు తక్కువ ఉన్న 320 మందికి కంటి అద్దాలు ఇచ్చేందుకు ఎంపిక చేసినారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించినట్లు, అలాగే శిబిరానికి వచ్చిన అందరికీ మధుమేహం, బీపీ పరీక్షలు నిర్వహించినట్లు. డా.ఎస్.ఎల్.కాంతారావు తెలిపారు. ఎస్ఆర వాసవి అసోసియేషన్ అధ్యక్షులు పందిరి శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ ఎలెక్ట్ రమేష్ బాపనపల్లి, కార్యవర్గ సభ్యులు శ్రీరామ్ రంగారావు వారు కార్యక్రమము విజయవంతం కావలెనని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.ఎస్.ఎల్.కాంతారావు, లయన్.జి.రాజారెడ్డి, లయన్ వై. సూర్యనారాయణ, చారుగుళ్ళ శ్రీనివాస్, బి.సుబ్బరాజు, ఎస్ఎన్వి రామారావు, డా.వి.కామేశ్వరరావు, లయన్ బి. వెంకటరెడ్డి, డా. ఆర్. చైతన్య, జి.సంజీవరావు, పుష్పగిరి కంటి ఆసుపత్రి రాజేష్, బి.రమణారెడ్డి, గోళ్ళ భూపతిరావు, కురిచేటి శ్రీనివాస్, దేసు వెంకట సుబ్బారావు, పల్లంటి దేశప్పు, ఆరుద్ర సత్యనారాయణ, తిరుపతిరావు, డా. భాను ప్రసాద్, సిహెచ్ రామలింగేశ్వరరావు, ఉమా శంకర్ నాయుడు, డా. స్వామి, లయన్ బి.రంగారెడ్డి, మారుతి కళాశాల సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి మాదిగలను మభ్యపెడుతున్నారు : మందకృష్ణ మాదిగ



**విశ్వంభర, మహేశ్వరం, తుక్కుగూడ :** సీఎం రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా మాదిగలను మభ్య పెడుతున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని కళాశ్రీ గార్డెన్ లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాదిగల ధర్మ యుద్ధం మహాసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ. సీఎం రేవంత్ రెడ్డి మాటలకు చేతలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. రేవంత్ రెడ్డి వర్గీకరణ చేయకుండానే ఉద్యోగులను భర్తీ చేస్తూ మాదిగలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాడు. ఎస్సీ వర్గీకరణలు అమలు చేయకపోతే రేవంత్ రెడ్డి సర్కార్ తో యుద్ధం కొనసాగుతుందని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి మోసపు మాటలను చెప్తున్నారని పంజాబ్, హర్యానా, తమిళనాడు రాష్ట్రాలు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తుంటే రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తునన్నారు . మాదిగల పైన చిత్తశుద్ధి నిజాయితీ ఉంటే అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని అమలు పరచాలన్నారు . రేవంత్ రెడ్డి మోసంపై ధర్మ యుద్ధానికి మాదిగలు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ నాయకులకు పిలుపునిచ్చారు. డిసెంబర్ 21న హైదరాబాద్ ధర్మ యుద్ధ మహా ప్రదర్శన చేపట్టి రేవంత్ రెడ్డి సర్కార్ తో తాడోపేడో తెచ్చుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు రావు గళ్ళ బాబు మాదిగ , ఎమ్మార్పీఎస్ జాతీయ కళా మండల అధ్యక్షుడు మద్దిలేటి మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు రామచంద్ర మాదిగ, శివకుమార్ మాదిగ, ప్రణయ్ మాదిగ, మల్లికార్జున మాదిగ, ఆనంద్ మాదిగ, ప్రశాంత్ మాదిగ, సిద్ధులు మాదిగ, బోర్ర రవి మాదిగ, భాను మాదిగ, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# నలుగురు వైర్ల దొంగల అరెస్ట్



**విశ్వంభర, షాద్ నగర్:** షాద్ నగర్ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 20 జనవరి 2024 వ తేదీన సర్వే నెంబర్ 67, ఆర్క టెంపులర్స్, నాగులపల్లి శివారులో గల వెంచర్లో వైర్ల దొంగతనం జరిగిందని జీడిమెట్ల శ్రీరామ్ నగర్ కాలనీకి చెందిన నడింపల్లి మాధవ వర్మ షాద్ నగర్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ ప్రారంభించిన పోలీసులు బుధవారం నలుగురు దొంగలను పట్టుకొని అరెస్టు చేసి 12 లక్షల 50 వేల నగదును, నాలుగు సెల్ ఫోన్ లను, అశోక్ లేలాండ్ మినీ ఫోర్ వీలర్ ట్రక్కును, మహీంద్రా మినీ ఫోర్ వీలర్ ట్రక్కును స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. అలాగే ఈ నలుగురు నిందితులు షాద్ నగర్ చుట్టుపక్కల గల వెంచర్లలో మధ్య రాత్రి వేళలో ఎవరూ లేని సమయంలో కరెంటు స్తంభాలకు ఉండే అల్యూమినియం మరియు ఎలక్ట్రిక్ వైర్లను, ఇనుప సామాన్లను దొంగిలించి అమ్ముకుంటున్నారని తెలిపారు. నలుగురు నాలుగు రంగాలలో నిష్ణాతులు నలుగురు నిందితులో మొదటి వాడైన కట్టా శ్రీనివాస్ ప్లాన్ మరియు స్కెచ్ వేయడంలో నిష్ణాతుడని, రెండవ మూడవ నిందితులైన కాకునూరి శ్రీకాంత్, బానోతు రాజులు వాహనాలు కలిగి ఉండి డ్రైవింగ్ లో నిష్ణాతులని, నాలుగో నిందితుడైన దిల్వార్ కరెంటు స్తంభాలు ఎక్కి వైర్లను తెంపడంలో నిష్ణాతుడని తెలిపారు. నేరములు జరిగిన స్థలములు ఈ నలుగురు నిందితులు షాద్ నగర్ చుట్టుపక్కల వెంచర్ల లోనే కాకుండా, తలకొండపల్లి, కడ్తాల్ నందిగామ జడ్చర్ల టౌన్ కందుకూరు మంచాల గ్రామాల్లో కూడా దొంగతనాలు చేసారు. అక్కడ కూడా వారిపై కేసు నమోదు జరిగినట్టు తెలిపారు. కమిషన్ ఆఫ్ పోలీస్ సైబరాబాద్ వారి పర్యవేక్షణలో శంషాబాద్ అడిషనల్ డీసీపీ షాద్ నగర్ ఏసీపీ పర్యవేక్షణలో సీసీఎస్ సీఐ శంషాబాద్ పవన్, ఎస్సై అవినాష్, పోలీస్ కానిస్టేబుల్స్ మహేందర్ కుమార్ నవీన్ సంజీవ, షాద్ నగర్ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ విజయకుమార్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, కేసు విచారణ అధికారి శ్రీ శరత్ కుమార్, పట్టణ పోలీస్ సిబ్బంది అయిన మోహన్ కరుణాకర్ జాకీర్ రాజు, రఫీలు చాకచక్యంగా తమ నైపుణ్యంతో నిందితులను పట్టుకోవడం జరిగిందని శంషాబాద్, షాద్ నగర్ పోలీస్ సిబ్బందిని అభినందిస్తూ వారికి తగిన రివార్డులు పై అధికారుల ద్వారా ఇప్పించడం జరుగుతుందని పట్టణ ఏసీపీ తెలిపారు.

## బీసీ నాయకులు, విద్యార్థులు భారీ ర్యాలీ



**విశ్వంభర,పరిగి :** పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి హనుమంతు, రాష్ట్ర కన్వీనర్ లాల్ కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టిన సందర్భంగా సావిత్రి జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి బీసీ నాయకులు, విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు .అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హనుమంతు ముదిరాజ్,లాల్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణలో ఎన్నికల సందర్భంగా రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ లో ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగనన చేపట్టడం చాలా సంతోషకరమని విద్యార్థులకు కొన్ని సంవత్సరాలనుంచి బీసీ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచక రియంబర్స్మెంట్ ఇవ్వకుండా బి ఆర్ ఎస్ మోసం చేసిందని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని చార్జీలు పెంచడం చాలా హర్షనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వెంకటయ్య, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ డిసిసి ఉపాధ్యక్షులు అశోక్, కాంగ్రెస్ నాయకులు నరసింహులు, మాణిక్యం, గణేష్, వెంకటయ్య, నరసింహులు బీసీ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం ఆగదు



**విశ్వంభర, రామన్నపేట :** మూడోసారి దేశంలోకి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజల్లో మత వైషమ్యాలు ప్రేరేపిస్తుందని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, పల్లివాడ గ్రామంలో సిపిఎం ఎనిమిదవ గ్రామశాఖ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, దేశాన్ని ఆదాని అంబానీలకు దోచిపెడుతూ కార్మిక, ప్రజా వ్యతిరేక చట్టాలు చేస్తూ, ప్రజా వ్యవస్థను విధ్వంసం చేస్తుందని, యువతకు ఉపాధి కల్పిస్తామని, నల్లధనాన్ని తీసుకొస్తామని, మాయమాటలు చెప్పి ప్రజలను మోసగించిందని అన్నారు. రాష్ట్రంలో 6 గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో విఫలమైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై సంఘటిత ఉద్యమాలు చేయాలని తెలియజేశారు. అనంతరం సిపిఎం గ్రామ శాఖను ఎన్నుకోవడం జరిగింది. నూతన గ్రామ శాఖ కమిటీలో, గ్రామశాఖ కార్యదర్శిగా పావిరాల మత్స్యగిరి, సహాయ కార్యదర్శిగా గట్టు ఉపేందర్ ను ఎన్నుకున్నారు.

## కుటుంబ సమగ్ర కులగణన సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి



**విశ్వంభర, ఆమనగల్లు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా ఎన్యూమరేటర్లు వివరాలు నమోదు చేయాలని మున్సిపల్ కమిషనర్ వసంత ఎంపీడీవో కుసుమ మాధురి తెలియజేశారు.బుధవారం మున్సిపాలిటీ లోని వార్డుల్లో సర్వే జరుగుతున్న తీరును కమిషనర్ ఎంపీడీవో పరిశీలించారు. స్వయంగా సర్వే జరుగుతున్న ప్రాంతానికి వెళ్లి ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ప్రతి బ్లాక్ లో సర్వే మొదలు పెట్టాలని, సర్వే గురించి గ్రామాల్లో టామ్ టామ్ వేయించాలన్నారు. ఎన్యూమరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి ఇంటికీ స్టికర్లు వేయాలని సూచించారు. సర్వేలో భాగంగా ఇళ్లకు వేస్తున్న నంబర్లను సరిగా వేయాలన్నారు. టీచర్లను పాఠశాల సమయం అయిపోయిన తర్వాతే సర్వేలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాంపాల్ నాయక్, కౌన్సిలర్లు, లక్ష్మణ్, కృష్ణా యాదవ్, ఎన్యుమరేర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలి



**విశ్వంభర, భూపాలపల్లి :** రైతుల నుంచి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో దాన్యం కొనుగోలుపై పౌర సరఫరాలు, పౌర సరఫరాల సంస్థ, సహకార, మార్కెటింగ్, డిఆర్డీఏ శాఖల అధికారులతో ప్రొక్యూర్ మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొడ్డు, సన్న రకం ధాన్యం గుర్తించాలని తెలిపారు. సన్నరకం ధాన్యానికి మాత్రమే రైతులకు బోనస్ దక్కేలా చూడాలని తెలిపారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల వద్ద నుంచి మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొనుగోలు చేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక తయారుతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ధాన్యం కేటాయించిన మిల్లర్లు దిగుమతి లో జాప్యం జరుగకుండా హమాలీలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. మార్కెటింగ్ అధికారికి మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ బాండ్స్ ఇవ్వాలని పేర్కొన్నారు.

## వైస్ ఛాన్సలర్‌కి ఘన సన్మానం



**విశ్వంభర, ఎల్బీనగర్:** పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ను వెల్దండ నిత్యానందరావు ను ఎస్ ఆర్ ఆర్ ట్రస్ట్ ఛైర్మన్ ఎస్ రామ్ చంద్రరావు ఆధ్వర్యంలో బుధవారము ఘనంగా సన్మానించారు. రామచంద్రరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వైశాల్ సరిగ పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా తమ ట్రస్ట్ తరపున సన్మానించడం జరిగిందన్నారు. తమ ట్రస్ట్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని భవిష్యత్తులో కూడా సమాజానికి, పేద ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేస్తూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, అల్లంపల్లి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ కూరెళ్ళను సన్మానించిన యాదాద్రి డీఈఓ సత్యనారాయణ



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో డాక్టర్ ఆచార్య కూరెళ్ళ విఠలాచార్య నిర్వస్తున్న గ్రంథాలయాన్ని సందర్శించి, అనంతరం వారిని యాదాద్రి భువనగిరి డీఈఓ సత్యనారాయణ సన్మానించారు. డి.సి.ఈ.బి పాండు నాయక్, రామన్నపేట విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, జెడ్పిహెచ్ఎస్ వెల్లంకి ప్రధాన ఉపాధ్యాయులు సురేందర్ రెడ్డి. తన గ్రంథాలయాన్ని సందర్శించిన అధికారులను పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ళ విఠలాచార్య సన్మానించారు. ఈ కార్యక్రమంలో నర్మద గ్రంథ పాలకుడు (లైబ్రేరియన్) తాటిపాముల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో కొనసాగుతున్న వాయు కాలుష్యం.. 358గా ఏక్యూఐ నమోదు



**ఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతోంది. రోజురోజుకూ కాలుష్యం తీవ్రమవుతోంది. కాలుష్యం కారణంగా ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరో వైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యయునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. దేశ రాజధాని నగరంలో బుధవారం ఉదయం 8 గంటల సమయంలో గాలి నాణ్యత సూచి 358గా నమోదైంది.అలీపూర్‌లో ఏక్యూఐ 372గా, బావన ప్రాంతంలో 412, ద్వారకా సెక్టార్ 8లో 355, ముంద్కాలో 419, నజాఫ్‌గఢ్ ప్రాంతంలో 354, న్యూ మోతి భాగ్‌లో 381, రోహిణిలో 401, పంజాబి బాగ్‌లో 388, ఆర్కేపురంలో 373గా ఏక్యూఐ నమోదైంది. ఆయా ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ అధ్వాన స్థితిలో ఉన్నట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ పేర్కొంది.

కాలుష్యం నేపథ్యంలో విజిబులిటీ సైతం తగ్గింది. పలు ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్మేసింది. వివేక్ విహార్, ఆనంద్ విహార్, ఇండియా గేట్ తదితర ప్రాంతాల్లో 500 మీటర్ల వరకు దృశ్యమానత తగ్గింది. పెరుగుతున్న కాలుష్యంతో ప్రజల కళ్లల్లో మంటలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులుపడుతున్నారు. ఈ క్రమంలో వైద్య నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు. గర్భిణులు, చిన్నపిల్లలు,వృద్ధులు, శ్వాసకోశవ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచిస్తున్నారు.

ఇంట్లోనే ఉండి యోగా, ప్రాణాయామం చేయాలని సూచిస్తున్నారు. ఢిల్లీలో వాయుకాలుష్యం పెరుగుతోందని దిల్లీ ప్రభుత్వ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్ రాయ్ పేర్కొన్నారు. కాలుష్యాన్ని తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. కాలుష్య స్థాయిని తగ్గించేందుకు సంబంధిత ఏజెన్సీలన్నీ చురుగ్గా పని చేస్తున్నాయని.. కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో శీతాకాల కార్యాచరణ ప్రణాళిక కింద వివిధ శాఖలు, ఏజెన్సీలు చేస్తున్న పనులను మంగళవారం సమీక్షించనున్నట్లు గోపాల్ రాయ్ పేర్కొన్నారు. ఇందులో అవసరాన్ని బట్టి తగిన చర్యలు తీసుకునేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నారు.

గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు. అయితే, గత కొంతకాలంగా ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకరంగా మారుతోన్న విషయం తెలిసిందే. పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగలపెట్టడానికి తోడు.. మంచు రాజధానిని కమ్మేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. కాలుష్య నియంత్రణకు పాలకులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం ఉండటం లేదు. రోజురోజుకూ గాలి నాణ్యత క్షీణిస్తోంది. ఈ కారణంగా నగర వాసులు తీవ్ర అనారోగ్య సమసల్యకు గురికావాల్సి వస్తోంది.

# ట్రంప్, హారిస్ ఎవరు గెలిచినా ఆ దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం : జై శంకర్



**ఢిల్లీ:** అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించిన ఫలితాలు వెలువడుతున్నాయి. డొనాల్డ్ ట్రంప్ విజయం దాదాపు ఖరారైంది. ఈ నేపథ్యంలో భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. తదుపరి అధ్యక్షులుగా ఎవరు ఎన్నికైనా వారి సొంత ప్రయోజనాల కోసమే పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ విదేశాంగ మంత్రులతో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన ఈమేరకు వ్యాఖ్యానించారు. 'అభ్యర్థుల అభిప్రాయాలు ప్రజల ప్రాధాన్యతలకు విరుద్ధంగా ఉంటాయి. ఇది ఒబామా నుంచి మొదలయ్యింది. అమెరికా అంతరాజతీయ నిబంధనలకు కట్టుబడి ఉంటుంది. ట్రంప్ ఆ విషయంలో మరింత స్పష్టంగా, భావవ్యక్తీకరణతో ఉండవచ్చు. కానీ, వాస్తవమేమిటంటే అమెరికా పరిపాలన భావజాలాన్ని జాతీయంగా చూడటమే చాలా ముఖ్యం' అని జైశంకర్ పేర్కొన్నారు. అదేవిధంగా ప్రస్తుతం అమెరికా నుంచి అందుతున్న దాతృత్వం కొనసాగే అవకాశాలు తగ్గుతాయని వెల్లడించారు. అందుకు ప్రపంచం సిద్ధం కావాలన్నారు.ఇదిలా ఉండగా..తమ దేశాలు కోరుకున్న విధంగా ప్రపంచవాతావరణంలో మార్పు తెచ్చేందుకు ముందుకు రావాలని ఈ సందర్భంగా ముగ్గురు విదేశాంగ మంత్రులు పిలుపునిచ్చారు.

# వర్జీనియాలో సుహాస్ సుబ్రహ్మణ్యం విజయం



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. భారత సంతతికి చెందిన సుహాస్ సుబ్రహ్మణ్యం హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో విజయం సాధించారు. వర్జీనియా 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి ఆయన డెమోక్రటిక్ పార్టీ తరఫున గెలుపొందారు. గతంలో అమెరికా మాజీ అధ్యక్షుడు ఒబామా హయాంలో టెక్ పాలసీ అడ్వైజర్‌గా సుబ్రహ్మణ్యం పనిచేశారు. 2020లో రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. వర్జీనియా సెనెట్‌కు ఎన్నికయ్యారు .ఇక భారత సంతతికి చెందిన మరో నేత రాజా కృష్ణమూర్తి హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో విజయం సాధించారు. ఇల్లినోయీ 8వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి ఆయన డెమోక్రటిక్ పార్టీ తరఫున పోటీ చేసి గెలుపొందారు. రిపబ్లికన్ పార్టీకి చెందిన ప్రత్యర్థి మార్క్ రిక్‌ను దాదాపు 30 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడించారు. 2016లో తొలి సారిఆయన అక్కడినుంచిప్రతినిధుల సభకు వెళ్లారు. సెలక్ట్ కమిటీ ఆన్ చైనీస్ కమ్యూనిస్టు పార్టీలో సభ్యుడిగా పని చేశారు.

# హింసను ప్రేరేపించే వ్యక్తులకు అక్కడ స్థానం లేదు: జస్టిన్ ట్రూడో



**కెనడా:** భారత్–కెనడా మధ్య దౌత్య సంబంధాలు తీవ్రఒత్తిడినిఎదుర్కొంటోన్న తరుణంలో అక్కడి హిందూ ఆలయంపై దాడి జరిగింది. దీనిపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. పార్లమెంట్‌లో మాట్లాడుతూ.. ఈ ఘటన గురించి జస్టిన్ ట్రూడో స్పందించారు."దేశవ్యాప్తంగా దక్షిణాసియా కమ్యూనిటీల్లో మనం చూసిన హింసాత్మక ఘటన గురించి ఓ విషయం స్పష్టం చేయదల్చుకున్నాను. కెనడాలో హిందూ, సిక్కు సమాజంలో హింసను ప్రేరేపించే, విభజనను సృష్టించే వ్యక్తులకు తావుఉండదు" అని వెల్లడించారు.అయితే బ్రాంప్టన్‌లోని హిందూ ఆలయంపై జరిగిన దాడి గురించి మాత్రం ప్రస్తావించలేదు. ఈ దాడి గురించి ఇంతకుముందు కూడా ట్రూడో స్పందించారు. తమ దేశంలో అన్ని మతాలను పాటించేవారి హక్కులనుకాపాడతామని పేర్కొన్నారు.మరోవైపు కెనడా ఎంపీ చంద్ర ఆర్య స్పందిస్తూ.. కెనడాలో ఎంత తీవ్రస్థాయిలో హింసాత్మక తీవ్రవాదం పెరిగిపోయిందో ఈ ఘటన చెబుతోందన్నారు.కెనడా హిందువులు ముం దుకొచ్చి తమ హక్కులను కాపాడుకోవా లన్నారు.

# ఎల్ఎంవీ లైసెన్స్‌తో కమర్షియల్ వాహనాలు నడపొచ్చు: సుప్రీంకోర్టు



**ఢిల్లీ:** లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ వివాదంపై సుప్రీంకోర్టు ఓ కీలక తీర్పు వెలువరించింది. ఎల్ఎంవీ లైసెన్స్ ఉన్నవారు రవాణా వాహనాన్ని కూడా నడపొచ్చని.. దానికి మరో లైసెన్స్ తీసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టంచేసింది. వ్యాపారం చేసుకొనే వ్యక్తులు, ఆటోలు, క్యాబ్‌లు నడిపేవారు ఎల్ఎంవీ లైసెన్స్‌తో 7,500 కిలోల కంటే తక్కువ బరువున్న కమర్షియల్ వాహనాలను నడపొచ్చని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం వెల్లడించింది.

2017 ముకుంద్ దేవాంగన్ వర్సెస్ ఓరియెంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కేసులో త్రిసభ్య ధర్మాసనం 7500 కిలోల గరిష్ఠ బరువుకు మించని రవాణా వాహనాన్ని తేలికపాటి వాహనం(ఎల్ఎంవీ) పరిధి నుంచి మినహాయించవద్దని తీర్పునిచ్చింది. అయితే దానికి అనుమతిస్తే ఎల్ఎంవీ లైసెన్స్ ఉన్న వ్యక్తి బస్సు, ట్రక్కు లేదా రోడ్ రోలర్‌ను కూడా నడపడానికి వీలు కల్పిస్తుందని, దీనివల్ల పౌరుల జీవితాలు ప్రమాదంలో పడతాయని పేర్కొంది. నష్టపరిహారం చెల్లించడానికి బీమా కంపెనీలపై భారం పెరిగే అవకాశం ఉందని భావించిన ఇన్సూరెన్స్ కంపెనీలు త్రిసభ్య ధర్మాసనం తీర్పును సవాలు చేస్తూ సుప్రీంలో 75 పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై తాజాగా దర్యాప్తు చేసిన జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పునే పూర్తిగా సమర్థిస్తూ ఇన్సూరెన్స్ కంపెనీలు వేసిన పిటిషన్లను కొట్టేసింది. మోటారు వాహనాల చట్టం కింద పేర్కొన్న అదనపు శిక్షణ, అర్హత ప్రమాణాలు 7,500 కిలోల కంటే తక్కువ బరువును రవాణా చేసే వాహనాలను నడపాలనుకొనే వ్యక్తులకు వర్తిస్తాయని పేర్కొంది. అంత కంటే ఎక్కువ బరువున్న వాహనాలు ఈ పరిధిలోకి రావని స్పష్టం చేసింది. ఇది డ్రైవర్ల జీవనోపాధికి సంబంధించిన సమస్య కాబట్టి చట్టానికి సవరణలు తీసుకువచ్చి.. వారికి ఒక మార్గాన్ని చూపాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ సవరణలు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్‌టిహెచ్) వద్ద పెండింగ్‌లో ఉన్నాయని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి న్యాయస్థానానికి తెలియజేశారు. సరైన సమయంలో వాటిని నోటిఫై చేస్తామన్నారు.

# వరుసగా 20వ సారి గెలిచిన నాన్సీ పెలోసీ



**వాషింగ్టన్:** అమెరికా ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్నాయి. ఈనేపథ్యంలో హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌లో డెమోక్రటిక్ అభ్యర్థి నాన్సీ పెలోసీ విజయం సాధించారు. కాలిఫోర్నియాలోని 12వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌కు ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే, తాజా ఫలితాలతో కాలిఫోర్నియా నుంచి వరుసగా 20 సార్లు గెలిచిన మహిళగా నాన్సీ నిలిచారు. 1987లో తొలిసారిగా కాలిఫోర్నియాలో జరిగిన ప్రత్యేక ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. ఆ తర్వాత అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికైన తొలి మహిళా స్పీకర్‌గా చరిత్ర సృష్టించారు. 2007- 2011 వరకు, ఆ తర్వాత 2019- 2023 వరకు హౌస్ స్పీకర్‌గా వ్యవహరించారు. మరో వైపు అమెరికా కాంగ్రెస్ చరిత్రలో డెమోక్రటిక్ పార్టీ నుంచి ఎక్కువ కాలం పనిచేసిన నాయకురాలుగా నిలిచారు. మరోవైపు ట్రంప్ హయాంలో ఆయనకు, నాన్సీకి మధ్య తీవ్రమైన విభేదాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే ట్రంప్‌పై అభిశంసన తీర్మానం వంటి ముఖ్యమైన ప్రక్రియల్లో డెమోక్రటిక్ పార్టీకి నాయకత్వం వహించారు.

# అమెరికా కాంగ్రెస్‌కు తొలి ట్రాన్స్‌జెండర్



వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందంజలో ఉన్నారు. మరికొద్ది సేపటిలో విజయం ఎవరిని వరిస్తుందో తెలియనుంది. ఈ నేపథ్యంలో డెలవేర్‌లోని ఎట్ లార్జ్ హౌస్ డిస్ట్రిక్ట్ నుంచి డెమోక్రటిక్ అభ్యర్థిగా పోటీ చేసిన సారా మెక్‌బ్రైడ్ విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్‌కు ఎన్నికైన తొలి ట్రాన్స్‌జెండర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు.రిపబ్లికన్ పార్టీ నుంచి జాన్ వేలెన్ 3తో, సారా మెక్‌బ్రైడ్ పోటీపడ్డారు. సారాకు 95శాతం ఓట్లు పోలవగా.. వేలెన్‌కు 57.9 శాతం ఓట్లు పోలయ్యాయి. తాను కాంగ్రెస్‌లో చరిత్ర సృష్టించడానికి పోటీ పడలేదని డెలవేర్‌లో మార్పు కోసమే పోటీ చేసినట్లు సారా పేర్కొన్నారు. సారా మెక్ బ్రైడ్ ఎల్‌జీబీటీక్యూ జాతీయ కార్యకర్తగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల సమయంలో దాదాపు 3 మిలియన్లకుపైగా ప్రచార విరాళాలు సేకరించారు. 2016లో డెమోక్రటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో ఒక ప్రధాన పార్టీ నిర్వహించిన సమావేశంలో ప్రసంగించిన మొదటి ట్రాన్స్‌జెండర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. 2020లో డెలవేర్‌లో తొలి ట్రాన్స్ స్టేట్ సెనెటర్‌గా వ్యవహరించారు. 2010 నుంచి డెలవేరియన్ ఓటర్లు డెమోక్రట్‌లకే మద్దతిస్తున్నారు. ఈనేపథ్యంలో తాజా ఎన్నికల్లో సారా మైక్‌బ్రైడ్ విజయం సాధించారు.

# ఆర్టికల్ 370 పునరుద్ధరణపై చర్చలు జరపాలి

## జమ్ముకశ్మీర్ అసెంబ్లీలో తీర్మానం



**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం చర్చలు జరుపాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సభ్యులు ఆమోదించారు. 2019 ఆగస్ట్ 5న జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అలాగే ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది.

కాగా, కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ప్రత్యేక హోదాను పునరుద్ధరించే తీర్మానాన్ని జమ్ముకశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టారు. 'జమ్ముకశ్మీర్ ప్రజల గుర్తింపు, సంస్కృతి, హక్కులను కాపాడే ప్రత్యేక హోదా, రాజ్యాంగ హామీ ప్రాముఖ్యతను ఈ శాసనసభ పునరుద్ఘాటిస్తుంది. ఏకపక్ష తొలగింపుపై ఆందోళన వ్యక్తం చేసింది. జాతీయ ఐక్యత, జమ్ముకశ్మీర్ ప్రజల ఆకాంక్షలు రెండింటినీ కాపాడాలి. ఆర్టికల్ 370 పునరుద్ధరణ కోసం ఎన్నికైన ప్రజా ప్రతినిధులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి' అని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. మరోవైపు బీజేపీ ఎమ్మెల్యేలు, సభలో ప్రతిపక్ష నేత సునీల్ శర్మ ఈ తీర్మానాన్ని వ్యతిరేకించారు. 'దేశంలోని అతిపెద్ద ప్రజాస్వామ్య దేవాలయం (పార్లమెంట్) ఈ చట్టాన్ని ఆమోదించింది' అని ఆయన అన్నారు. ఈ తీర్మానం ప్రతులను బీజేపీ సభ్యులు చించారు. పేపర్ ముక్కలను వెల్‌లోకి విసిరారు. లంగేట్ ఎమ్మెల్యే షేక్ ఖుర్షీద్ వెల్ లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా మార్షల్స్ అడ్డుకున్నారు.అయితే, ఈ గందరగోళం మధ్య స్పీకర్ అబ్దుల్ రహీమ్ రాథర్ ఈ తీర్మానంపై ఓటింగ్ నిర్వహించారు. అసెంబ్లీలోని మెజారిటీ సభ్యులు దీనికి మద్దతిచ్చారు. దీంతో ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది. గందరగోళం కొనసాగడంతో 15 నిమిషాల పాటు సభ వాయిదా పడింది.

# అరుదైన వ్యాధితో బాధపడుతున్న బాలుడికి రూ.16 కోట్ల ఇంజెక్షన్



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మేదినీపూర్‌కు చెందిన ఓ మధ్యతరగతి కుటుంబంలో దిన్ ముహమ్మద్ జన్మించాడు. చిన్నారికి ఆరు నెలల వయసు ఉన్నప్పుడు చేతులు, కాళ్లు కదిలించడానికి కష్టపడుతున్నట్లు కుటుంబసభ్యులు గుర్తించారు. తల ఎత్తడం, పాకడం వంటివి కూడా చేయలేకపోవడంతో స్థానిక శిశువైద్యుడి దగ్గరకు తీసుకెళ్లారు. ఆయన సిఫారసు మేరకు కోల్‌కతాలోని పీర్‌లెస్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షల్లో బాలుడికి స్పైనల్ మస్క్యులర్ ఆట్రోఫీ అనే అరుదైన వ్యాధి ఉన్నట్లుగా వైద్యులు నిర్ధరించారు. క్రౌడ్ ఫండింగ్ ద్వారా వారి కోసం నిధులు సేకరించేందుకు కృషి చేస్తుండగా దాతలు, కేంద్ర ప్రభుత్వ సహకారంతో చిన్నారికి రూ.16 కోట్ల ఇంజెక్షన్ లభించినట్లు వైద్యులు పేర్కొన్నారు. పీర్‌లెస్ ఆసుపత్రి వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పు భారతదేశంలో ఇప్పటివరకు ముగ్గురు చిన్నారులు మాత్రమే ఈ చికిత్స పొందారు. వీరిలో ఇద్దరు కోల్‌కతాలోని పీర్‌లెస్ ఆసుపత్రిలో, మరొకరు కోల్‌కతాలోని ఎన్‌ఆర్‌ఎస్ ఆసుపత్రిలో చికిత్స పొందారని పేర్కొన్నారు. కొందరు చిన్నారుల్లో ఈ వ్యాధి పుట్టినప్పుడే బయటపడుతుందని.. వారికి రెండేళ్లు పూర్తవకముందే చికిత్స చేస్తే ప్రభావం మెరుగ్గా ఉంటుందని వైద్యులు తెలిపారు. 7 నుంచి 15 నెలల మధ్య వయసున్న ముగ్గురు పిల్లలు ప్రస్తుతం ఈ చికిత్సను పొందేందుకు వరుసలో ఉన్నారని, క్రౌడ్ ఫండింగ్ ద్వారా వారి కోసం నిధులు సేకరించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.

### వ్యాధి లక్షణాలు..

స్పైనల్ మస్కులర్ అట్రోపి-2(ఎస్ఎంఏ)గా వ్యవహరించే ఈ వ్యాధి వల్ల మెదడు కండరాలు క్షీణిస్తాయి. చిన్నప్పుడే బయట పడుతుంది. ఇందులో టైప్ 1, 2 ప్రమాదకరమని వైద్యులు చెబుతున్నారు. మాట్లాడకపోవడం.. నడవక పోవడం.. పడుకొని లేవలేకపోవడం..ఆహారం మింగలేకపోవడం ప్రధాన లక్షణాలు.

### ఇంజెక్షన్ ఖరీదు రూ.కోట్లలోనే..

ఈ వ్యాధి నుంచి కాపాడాలంటే జోల్‌జెన్‌స్మా అనే ఇంజక్షన్ ఇవ్వాలి. అమెరికా లేదా స్విట్జర్లాండ్ నుంచి తెప్పించాలి. పన్నులతో కలిపి ఖరీదు రూ.22 కోట్లు అవుతుంది. మానవీయ కోణంలో దీనిపై ఉన్న ఎక్సైజ్ సుంకం, జీఎస్టీ కలిపి రూ.6 కోట్లను కేంద్రం ఎత్తేసింది. అయినా కొనడం కష్టం కావడంతో కొందరు క్రౌడ్ ఫండింగ్‌తో నిధులు సేకరిస్తుంటారు. గతంలోనూ హైదరాబాద్‌కు చెందిన ఓ చిన్నారికి ఈ వ్యాధి సోకడంతో ఇంపాక్ట్‌గురు అనే ఆన్‌లైన్ క్రౌడ్ ఫండింగ్ సంస్థ ద్వారా పిలుపు ఇవ్వగా ప్రపంచవ్యాప్తంగా పలువురు ఉదారత చాటి రూ.16 కోట్లపైనే విరాళాలు అందించారు. అమెరికా నుంచి ఇంజెక్షన్ తెప్పించి బాలుణ్ని కాపాడారు.

# ఎలాన్ మస్క్ మోసం చేశాడంటూ దావా..!



**వాషింగ్టన్:** స్వింగ్ రాష్ట్రాల్లో ఓటర్లను ఆకట్టుకోవడం కోసం ఎలాన్ మస్క్ ప్రవేశపెట్టిన ప్రైజమనీ విషయంలో వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈక్రమంలో ముందుగానే నిర్ణయిం చిన వ్యక్తులకే ప్రైజ్‌మనీ ఇస్తున్నారని ఓ మహిళ మస్క్‌పై దావా వేశారు. టెక్సాస్ ఫెడరల్ కోర్టులో ఆరిజోనా నివాసి జాక్వెలిన్ మెక్‌అఫెర్టీ ఈమేరకు దావా వేశారు.అందులో లాటరీ ద్వారా ఎంపిక చేసిన వ్యక్తులకు కాకుండా ముందుగానే నిర్ణయించిన వారికి ప్రైజ్‌మనీ ఇస్తున్నారని జాక్వెలిన్ ఆరోపించారు. అదేవిధంగా ఆయా వ్యక్తుల వ్యక్తిగత వివరాలు సేకరించడం, తన సోషల్ మీడియాకు వ్యూయర్‌షిప్ పెంచుకోవడంతో మస్క్, ఆయన మద్దతుదారులకు లాభం చేకూరిందని ఆమె పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై మస్క్ తరఫు న్యాయవాదులు స్పందించలేదు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌నకు ఎలాన్ మస్క్ మద్దతు తెలిపిన విషయం తెలిసిందే. ఈక్రమంలో స్వింగ్ రాష్ట్రాల్లో ఓటర్లను ఆకట్టుకోవడం కోసం వాక్ స్వాతంత్ర్యం, తుపాకీ కలిగి ఉండే హక్కుకు మద్దతుగా సంతకం చేసిన తటస్థ ఓటరుకు 100 డాలర్లు ప్రైజ్‌మనీ ఇస్తానని ప్రకటించారు. మరో తటస్థ ఓటరును సిఫార్సు చేస్తే 47డాలర్లు ఇస్తా మని వెల్లడించారు. ఇలా సంతకాలు చేసిన వారిలోంచి లాటరీ ద్వారా ఎంపిక చేసి ప్రైజ్ మనీ అందిస్తామని పేర్కొన్నారు. ఇది ఓటర్లను ప్రలోభపెట్టడమే అని డెమోక్రట్లు ఆరోపించారు. ఓటర్లకు డబ్బులతో గాలం వేస్తున్నారంటూ ఫిర్యాదు చేయగా..ఆయనకు అమెరికా జాతీయఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ప్రైజ్‌మనీ విజేతలను యాదృచ్ఛికంగా ఎంపిక చేయలేదని, గ్రహీతలు ఎవరనేది ముందుగానే తెలుస్తుందని మస్క్ తరఫు న్యాయవాదులు కోర్టు లో తెలి పారు. అయితే, విజేతలు లక్కీడిప్ ద్వారా ఎంపికవుతారని మస్క్ గతంలో పేర్కొనడం గమనార్హం.

# నెలరోజుల్లో పోలీసు వ్యవస్థను గాడిన పెడదాం: చంద్రబాబు

**విశ్వంభర,అమరావతి:** నెల రోజుల్లో పోలీసు వ్యవస్థనుగాడిన పెడదామని సీఎం చంద్రబాబు మంత్రులతో అన్నారు. మంత్రివర్గ సమావేశం ముగిసిన తర్వాత రాజకీయ అంశాలపై అమాత్యులతో చంద్రబాబు చర్చించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ చేస్తున్న సోషల్ మీడియా ప్రచారంపైనా సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రభుత్వాన్ని కించపరిచే పోస్టులపై ఉదాసీనత తగదని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మొదటిగా ప్రస్తావించినట్లు తెలిసింది. అసభ్య, అవాస్తవ పోస్టులపై ఫిర్యాదులు వస్తున్నా, కొందరు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పవన్ కల్యాణ్ అన్నట్లు సమాచారం.జగన్ ప్రభుత్వంలో క్రియాశీలంగా వ్యవహరించిన కొందరు అధికారులే ఇప్పుడు కీలక పదవుల్లో ఉన్నారనే అంశం చర్చకు వచ్చింది.

కొంతమంది అధికారుల తీరువల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని మంత్రులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పలు జిల్లాల ఎస్పీలు మంత్రుల ఫోన్లకు సరిగా స్పందించడం లేదని తెలిసింది. కింది స్థాయిలో డీఎస్పీ, సీఐలపై నెపం నెట్టి.. తప్పించుకుంటున్నారని మంత్రులు చంద్రబాబుకు తెలిపారు.ఈ సమయంలో కలగజేసుకున్న పవన్ కల్యాణ్.. తానూ అందుకే తీవ్రంగా స్పందించాల్సి వచ్చిందన్నారు. గత ప్రభుత్వం నుంచే పోలీసులు ఇలా తయారయ్యారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై ఎప్పటికప్పుడు మాట్లాడుకుంటూ నెల రోజుల్లో వ్యవస్థను గాడిన పెడదామని సీఎం స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో అసత్య పోస్టులను ఇకపై ఉపేక్షించేది లేదన్నారు.



# వర్రా రవీంద్రారెడ్డిని వదిలేసిన పోలీసులు.. సీఎం, డీజీపీ ఆగ్రహం



**విశ్వంభర, కడప:** వైఎస్సార్ జిల్లా పులివెందులకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు వదిలేయడంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. కడప తాలూకా పోలీసులు బుధవారం తెల్లవారుజామున రవీంద్రారెడ్డికి 41-ఏ నోటీసు ఇచ్చి విడిచిపెట్టారు. దీనిపై సీఎం చంద్రబాబు, డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కడపలోని ఎస్పీ కార్యాలయానికి కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ చేరుకుని ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో సమావేశమయ్యారు. వర్రా రవీంద్రారెడ్డి కేసుపై ఆయన ఆరా తీశారు.వైసీపీ అధికారంలో ఉండగా వర్రా రవీంద్రారెడ్డి అడ్డూ అదుపూ లేకుండా మితిమీరి ప్రవర్తించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, వంగలపూడి అనితపై అసభ్యకరమైన పోస్టులు పెట్టారు. ఆయనపై మంగళగిరి, హైదరాబాద్‌లో పలు కేసులున్నాయి. ఈ క్రమంలో మంగళవారం పులివెందులలో అదుపులోకి తీసుకున్న పోలీసులు.. కడపకు తీసుకొచ్చి రహస్యంగా విచారించారు. అనంతరం బుధవారం 41-ఏ నోటీసు ఇచ్చి పిలిచినప్పుడు విచారణకు హాజరుకావాలంటూ వదిలిపెట్టారు. మరో కేసులో అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు మళ్లీ వెళ్లగా వర్రా రవీంద్రారెడ్డి తప్పించుకున్నారు. ఆయన్ను పట్టుకునేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. రవీంద్ర ఆచూకీ కోసం బుధవారం కుటుంబసభ్యులను అదుపులోకి తీసుకుని చింతకొమ్మదిన్నె పీఎస్‌లో విచారిస్తున్నారు.

# ఇండో-యూఎస్ సంబంధాలు మరింత బలోపేతమవ్వాలి: చంద్రబాబు

అమరావతి: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్‌నకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. తమ దేశాన్ని ముందుకు నడిపించే ప్రక్రియలో విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. ట్రంప్ మొదటి పదవీ కాలంలో ఇండో-యూఎస్ సంబంధాలు గణనీయంగా బలోపేతమయ్యాయని చంద్రబాబు గుర్తు చేశారు. ప్రధాని మోదీ, ట్రంప్ నాయకత్వంలో రెండు దేశాల సంబంధాలను మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. రెండు దేశాలు పరస్పర సహకారాన్ని పెంపొందింప జేసుకుంటాయని విశ్వసిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు.

### బాలకృష్ణ శుభాకాంక్షలు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అన్‌స్టాపబుల్ విజయం అందుకున్న రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొన్న వారందర్నీ బాలకృష్ణ అభినందించారు.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇంటిపై ఐటీ దాడులు



విశ్వంభర, భీమవరం: వైసీపీ నేత, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఇల్లు, కార్యాలయంపై ఆదాయపన్ను శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఇంటితో పాటు కృష్ణా జిల్లా నాగాయలంకలోని కార్యాలయం, ఇతర వ్యాపార సముదాయాలపై ఏక కాలంతో సోదాలు జరుగుతున్నాయి. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారులు వివిధ పత్రాలు తనిఖీ చేస్తున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

# విజయనగరం స్థానిక సంస్థల వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా చిన అప్పల నాయుడు



**విశ్వంభర, అమరావతి :** ఏపీలో త్వరలో జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో అధికార కూటమి, విపక్ష పార్టీలు తలమునకలవుతున్నాయి. వైసీపీ తరుపున విజయనగరం స్థానిక సంస్థల అభ్యర్థిగా చిన అప్పల నాయుడును పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది.పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో చిన అప్పల నాయుడు పేరును ఖరారు చేశారు. టీడీపీ ఆవిర్భావం సమయంలో ఎన్‌టీ రామారావు పిలుపుమేరకు టీడీపీలో చేరిన చిన అప్పలనాయుడు బొబ్బిలి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా మూడుసార్లు గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ప్రొటెం స్పీకర్‌గా 175 మంది ఎమ్మెల్యేలచే ఆయన ప్రమాణం చేయించారు.విజయనగరం జిల్లాల్లో స్థానిక సంస్థలకు 753 మంది ప్రతినిధులకుగాను వైసీపీకి 592 మంది ప్రతినిధులున్నారు. ఈ స్థానాన్ని కూడా వైసీపీ ఖాతాలో పడే విధంగా వైసీపీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని వైఎస్ జగన్ సూచించారు.

# ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ బిల్లుకు ఏపీ క్యాబినెట్ ఆమోదం



**విశ్వంభర, అమరావతి:** రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రిచంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం జరిగింది. ఇందులో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ ముసాయిదా బిల్లుకు ఏపీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీ జీఎస్టీ 2024 చట్టసవరణ,2014-18మధ్య నీరు,చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ఆమోదం చెప్పింది.ఎక్సైజ్ చట్టసవరణ ముసాయిదా కు, కుప్పం ఏరియా డెవలప్‌మెంట్అథారిటీ లక్ష్యాలసాధనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

### మరిన్ని క్యాబినెట్ నిర్ణయాలు..

పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ఆమోదం
సీఆర్డీఏ పరిధిని 8,352 చదరపు కిలోమీటర్లకు పెంచుతూ ఆమోదం
సీఆర్డీఏ పరిధిలోకి పల్నాడు, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి 154 గ్రామాలు
11 మండలాల్లోని 154 గ్రామాలను తిరిగి సీఆర్డీఏ పరిధిలోకి తెస్తూ ఆమోదం
జ్యుడీషియల్ అధికారుల ఉద్యోగ విరమణ వయసు 61కి పెంచుతూ ఆమోదం
2024 నవంబర్ 1 నుంచి అమల్లోకి వచ్చేలా చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

# వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు ఎదురుదెబ్బ



విశ్వంభర, అమరావతి: వైసీపీకు చెందిన మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. మరియమ్మ అనే మహిళ హత్య కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. తుళ్లూరు మండలం వెలగపూడిలో 2020 డిసెంబర్‌లో రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. రాళ్లు రువ్వుకున్న ఘటనలో వెలగపూడికి చెందిన మరియమ్మ మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అప్పట్లో తుళ్లూరు ఠాణాలో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నందిగం సురేశ్‌ను పోలీసులు 78వ నిందితుడిగా చేర్చారు.బెయిలు మంజూరుచేయాలని చేసిన అభ్యర్థనను గుంటూరు కోర్టు తోసి పుచ్చడంతోఆయన హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. సురేశ్ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

# కడప ఎస్పీ ఆకస్మిక బదిలీ

## వైసీపీ కార్యకర్తను వదిలి పెట్టడంపై ప్రభుత్వం సీరియస్



**విశ్వంభర, అమరావతి :** ఏపీలోని కడప జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేయడం సంచలనం కలిగించింది . కడప జిల్లా పులివెందులకు చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని వదలి వేయడం పట్ల ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.ఈ విషయంపై స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డీజీపీ ద్వారకా తిరుమలరావు కూడా జిల్లా పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ కడప ఎస్పీ కార్యాలయానికి చేరుకుని ఎస్పీ హర్షవర్ధన్‌తో సమావేశమై వర్రా రవీంద్రారెడ్డి కేసు గురించి అడిగి తెలుసుకున్నారు.వైసీపీ అధికారంలోకి ఉండగా రవీంద్రారెడ్డి విచ్చలవిడిగా చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్, వంగలపూడి అనితపై అసభ్యకర పోస్టులు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ సందర్భంగా అతడిపై మంగళగిరి, హైదరాబాద్ పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసుల విచారణకు రవీంద్రారెడ్డిని కడప పోలీసులు అదుపులోకి తీసుకని 41-ఏ నోటీసు ఇచ్చి వదిలిపెట్టారు.

# ఏపీలో మెగా డీఎస్సీ ప్రకటన వాయిదా



**విశ్వంభర,అమరావతి:** మెగా డీఎస్సీ ప్రకటన వాయిదా పడింది. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం బుధవారం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉండగా.. పలు అనివార్య కారణాలతో అధికారులు వాయిదా వేశారు. మరో నాలుగైదు రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# రైల్వే ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలి

**విశ్వంభర, నిడదవోలు:** రైల్వే శాఖలో రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచనలను విరమించుకొని ఖాళీగా ఉన్న 2.98 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం నిడదవోలు రైల్వేస్టేషన్ మాష్టార్ జి.సత్యనారాయణకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కో- కన్వీనర్ గారపాటి ప్రసన్న కృష్ణ మాట్లాడుతూ.. ప్రపంచంలో ఎక్కడా లేనంత యువశక్తి దేశంలో ఉన్నప్పటికీ ఉపాధి కల్పనలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు. దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 9.8 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మద్దెల చెరువు సూరి హత్య కేసు నిందితుడు భాను కిరణ్‌కు బెయిల్



విశ్వంభర, అమరావతి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్దెల చెరువు సూరి హత్య కేసులో ప్రధాన నిందితుడైన భాను కిరణ్?కు బెయిల్ మంజూరైంది. సీఐడీ ఆర్మ్స్ యాక్ట్ కేసుల్లో భాను కిరణ్‌కు బెయిల్ లభించింది. అయితే బెయిల్ లభించిన కూడా భాను కిరణ్ జైలులోనే ఉండనున్నాడు. మద్దెల చెరువు సూరి హత్య కేసులో భాను కిరణ్‌కు న్యాయస్థానం జీవిత ఖైదు విధించిన విషయం తెలిసిందే. దీంతో బెయిల్ లభించిన కూడా జీవిత ఖైదు కింద జైలు జీవితం గడపనున్నాడు భాను కిరణ్.ప్రస్తుతం భాను కిరణ్ చంచల్‌గూడ జైలులో కారగార శిక్ష అనుభవిస్తున్నాడు. 12 ఏండ్లుగా ఇదే జైలులో ఉంటున్న భాను కిరణ్ తన జీవిత ఖైదు కేసుపై క్షమాభిక్ష కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. అయితే దీనిపై విచారణ జరిపిన సుప్రీం కోర్టు స్థానిక కోర్టులో తేల్చుకోమని స్పష్టం చేసింది. కాగా ఈ పిటిషన్‌కు సంబంధించి ఈ నెల 11న (నవంబర్ 11, 2024) విచారణకు రానుంది.టీడీపీ ఎమ్మెల్యే పరిటాల రవి హత్య కేసులో ప్రధాన నిందితుడు మద్దెలచెరువు సూరి. తన కుటుంబంలో ఉన్న అందరిని హత్య చేశాడు అన్న కోపంతో పరిటాల రవి చంపాలని నిర్ణయించుకున్నాడు సూరి. ఈ క్రమంలోనే 2005లో పరిటాల రవిని కాల్చి చంపాడు. ఇక పరిటాల రవిని హత్య చేసిన కేసులో జైలు జీవితం గడిపి బెయిల్ మీద బయటకు వచ్చిన సూరిని 2011 జనవరి 4న భాను కిరణ్ కాల్చి చంపాడు. అనంతపురం ఫ్యాక్షన్ పేరు చెప్పగానే ముందుగా గుర్తొచ్చే పేర్లు పరిటాల రవి, మద్దెలచెరువు సూరి, మొద్దు శీను, ఓం ప్రకాశ్, భాను కిరణ్. దీనిపైనే ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ 2010లో రక్త చరిత్ర అనే సినిమా కూడా తీశాడు.

# సరస్వతీ భూముల్లో పవన్ పర్యటిస్తే.. వైసీపీ నేతలకు వణుకెందుకు?

**విశ్వంభర,గుంటూరు:** పల్నాడు జిల్లా సరస్వతీ భూముల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటిస్తే వైసీపీ నేతలు ఎందుకు మండిపడుతున్నారని జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. గుంటూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. పవర్ ప్లాంట్ పెడతానని, ఈ ప్రాంత వాసులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని చెప్పి రైతులను భయపెట్టి మరీ భూములను తీసుకున్నరన్నారు. ఇప్పటివరకూ అక్కడ ఎలాంటి పనులు చేయకుండా వదిలేశారని మండిపడ్డారు. దీనిపై పూర్తి నివేదిక తీసుకొని పవన్ పర్యటనకు వచ్చారని తెలిపారు. ఈ పర్యటనతో వైసీపీ మేధావులుగా చెప్పుకొనే అంబటి రాంబాబు, కాసు మహేష్‌రెడ్డిలు ఇష్టానుసారం మాట్లాడటం సిగ్గుచేటని ఆగ్రహంవ్యక్తంచేశారు. కూటమి ప్రభుత్వంలోని సభ్యుల అభిమతం ఒక్కటేనని.. అది ప్రజాక్షేమమేనన్నారు. కులాలు, మతాల పేరుతో వైకాపా పాలన సాగించిందని, కూటమి ప్రభుత్వం నిజాయతీతో పాలన చేయడమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు.

# విబేధాలు వస్తే తల్లికి కొడుకు కాకుండా పోతాడా.. జగన్‌కు అండగా వీడియో రిలీజ్ చేసిన విజయమ్మ



**విశ్వంభర, అమరావతిః** వైఎస్ జగన్, షర్మిల మధ్య ఆస్తి తగాదాలు ఏపీలో సంచలనం సృష్టిస్తున్నాయి. ఇదే అదునుగా జగన్‌పై టీడీపీ రకరకాల వదంతులను ప్రచారం చేస్తుంది. సొంత తల్లినే చంపించేందుకు జగన్ చూశారని కూడా ఆరోపించింది. దాన్ని బహిరంగ లేఖ ద్వారా వైఎస్ విజయమ్మ ఖండించింది. అయినప్పటికీఅది ఫేక్ లెటర్ అంటూ జగన్‌పై టీడీపీ వ్యక్తిత్వ హననానికి పాల్పడింది. ఈ నేపథ్యంలో వైఎస్ విజయమ్మ డైరెక్ట్‌గా స్పందించారు. తన కుమారుడు, వైఎస్ జగన్‌ను సమర్థిస్తూ ఈసారి ఏకంగా వీడియోనే రిలీజ్ చేశారు.ఏపీలో రాజకీయాలు వ్యక్తిగత విమర్శల నుంచి కుటుంబ వ్యవహారాలను బయటపెట్టి వారి వ్యక్తిగత హననం చేసే వరకు వచ్చాయని వైఎస్ విజయమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ జగన్, షర్మిల మధ్య ఉన్న ఆస్తి విభేదాలను అడ్డుపెట్టుకుని కొందరు తమ క్యారెక్టర్‌ను దిగజార్చాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఎవరి కుటుంబంలోనైనా భిన్నాభిప్రాయాలు సహజమేనని అన్నారు. కానీ వాటిని అడ్డుపెట్టుకుని ఇలాంటి దుష్ప్రచారం చేయడం బాధ కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి కోసం తమను అడ్డుపెట్టుకుని ఇంత నీచానికి దిగజారుతారా అని మండిపడ్డారు.ఏదైనా విబేధాలు వస్తే తల్లికి కొడుకు కాకుండా పోతాడా? అన్నకు చెల్లి కాకుండా పోతుందా అని వైఎస్ విజయమ్మ ప్రశ్నించారు. ఎప్పుడో జరిగిన కారు ప్రమాదాన్ని కూడా రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం సరికాదని హితవు పలికారు. రాజకీయాల్లో ఇంతటి దిగజారుడుతనాన్ని చూస్తుంటే అసహ్యం వేస్తుందని తెలిపారు. ఇకపై తమ పరువుకు సంబంధించిన విషయాలపై తప్పుడు ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. రాజకీయంగా పోరాడాలంటే జగన్‌తో డైరెక్ట్‌గా పోరాడాలని అన్నారు.

# రెండు నెలల్లో రహదారులు మరమ్మతులు పూర్తి: ఎమ్మెల్యే

**విశ్వంభర,ఎమ్మిగనూరు:** నందవరం మండల పరిధిలో ముగతి గ్రామంలో రహదారి నిర్మాణ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క గుంత కూడా పూడ్చిన దాఖలు లేవని, గుంతల లేని ఆంధ్రప్రదేశ్ గా నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా సీఎం చంద్రబాబు నాయుడు గుంతల రోడ్ల నిర్మాణానికి రూ.200 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న గౌడ్, భార్గవ్ పాల్గొన్నారు.

# కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సుకు ఎంపీ పురందేశ్వరి




**విశ్వంభర, అమరావతిః** ఆస్ట్రేలియాలో జరుగుతున్న 67వ కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి హాజరయ్యారు. ఈ సదస్సులో చర్చిస్తున్న అంశాలపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) సదస్సు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ పార్లమెంటరీ దేశాల ప్రతినిధులతో కలిసి జరుపుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సదస్సులో అర్థవంతమైన చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. మహిళా సాధికారికత కోసం మన ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశంలో చేపడుతున్న సానుకూల, కచ్చితమైన అంశాలను సవివరంగా వివరించడానికి ఈ సదస్సు ద్వారా మంచి అవకాశం దొరికిందని ఆమె పేర్కొన్నారు. 8వ తేదీ వరకు కాన్ఫరెన్స్ లో పాల్గొని, 11న స్వదేశానికి తిరిగి రానున్నారు.

# భారత్- అమెరికా సంబంధాలు ఎలా ఉండబోతున్నాయి..?

**ఢిల్లీ :** అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించారు. త్వరలో ఆయన అధ్యక్షుడిగా ప్రమాణం చేయనున్నారు. ఈ నేపథ్యంలో భారత్ అమెరికా సంబంధాలు ఎలా ఉంటాయనే అంశం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

అమెరికా విదేశాంగ విధానాన్ని పునరుద్ధరించడంపై దృష్టి పెట్టినట్లు ట్రంప్ వెల్లడించారు. తొలిసారి ఆయన అధ్యక్షుడిగా వ్యవహరించిన సమయంలో.. దేశ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పారిస్ వాతావరణ ఒప్పందాలు, ఇరాన్ అణు ఒప్పందంతో సహా కీలక అంతర్జాతీయ ఒప్పందాల్లో కొన్నింటి నుంచి నిష్క్రమించడం లేదా మరికొన్నింటిని పరిష్కరించారు. ట్రంప్ మళ్లీ అధికారాన్ని కైవసం చేసుకున్న నేపథ్యంలో భారత్ సహా ఇతర దేశాలతో అమెరికా చేసుకున్న ఒప్పందాలపై ప్రభావం పడే అవకాశం ఉన్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వీటిలో వాణిజ్యం, వలసలు, సైనిక సహకారం, దౌత్యం ప్రధానమైనవి.



వాణిజ్యం..

ముఖ్యంగా భారత్ అమెరికా సంబంధాలను ప్రభావితం చేసే ప్రధాన అంశం వాణిజ్యం. తమ దేశం నుంచి విదేశాలకు వెళ్లే ఉత్పత్తులపై అత్యధిక సుంకాలను విధిస్తున్నారని ట్రంప్ ఇటీవల ఆరోపించారు. తాము కూడా ఆయా దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలు విధిస్తామన్నారు. ఇందుకు భారత్ కూడా మినహాయింపు కాకపోవచ్చు. ఓ సందర్భంలో ట్రంప్ మాట్లాడుతూ భారత్ తమకు మిత్ర దేశమని, మోదీ గొప్ప నాయకుడంటూ కొనియాడారు. అదే సమయంలో పన్నుల అంశాన్ని ప్రస్తావించారు. దీనిని బట్టి ట్రంప్ వైఖరి అర్థమవుతోంది.

హెచ్ 1బి వీసాల అంశం

భారత్ నుంచి అమెరికాకు STEM రంగాల్లో ఉద్యోగాల కోసం వేలమంది హెచ్ 1బి వీసాలపై వెళుతుంటారు. ప్రత్యేకించి భారత ఐటీ కంపెనీలు ఎక్కువ సంఖ్యలో వీరిని పంపిస్తుంటాయి. గతంలో ఈ విధానాన్ని ట్రంప్ వ్యతిరేకించారు. తాజాగా ఈ అంశంలో ట్రంప్ ఏ నిర్ణయం తీసుకుంటారన్న ఆసక్తిగా మారింది. అయితే గతంలో ఆయన హయాములోనే అమెరికా వేతనాలతో సరి సమానంగా హెచ్ 1బి వీసాదారులకు ఇవ్వాలన్న ప్రతిపాదన రావడం గమనార్హం.

సైనిక సహకారం..

భారత్‌కు అమెరికా ప్రధాన వ్యూహాత్మక భాగస్వామి. ఎన్నో ఏళ్లు ఇరుదేశాల మధ్య కీలక సైనిక రక్షణ ఒప్పందాలు కొనసాగుతున్నాయి. బైడెన్ హయాంలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL), అమెరికాకు చెందిన జనరల్ ఎలక్ట్రిక్ ఏరోస్పేస్ (GEA) మధ్య కీలక ఒప్పందం కుదిరింది. దీంతో పాటు క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ (iCET) ఒప్పందం జరిగింది. అధ్యక్ష పదవిలో ఎవరున్నా.. అమెరికా భారత్ లక్ష్యం ఇండో పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని ఎదుర్కోవడం. ఈ విషయంలో ఇరుదేశాల మధ్య సహకారం కొనసాగే అవకాశం ఉండొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంలో క్వాడ్ కూటమి సహకారం లభించే అవకాశం ఉంది. మరోవైపు.. ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్న పాకిస్థాన్‌ను భారత్ ఆయా సందర్భాల్లో ఎండగడుతూనే ఉంది. ఉగ్రవాదానికి వ్యతిరేకం అయిన ట్రంప్ నుంచి భారత్‌కు సహకారం లభించే అవకాశం ఉండొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

# అధ్యక్షుడిగా ట్రంప్.. కేసులను ఎలా ఎదుర్కోనున్నారు?

వాషింగ్టన్‌: యావత్ ప్రపంచం ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జయకేతనం ఎగరవేసిన డొనాల్డ్ ట్రంప్.. రెండోసారి అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకున్నారు. అయితే, గత ఎన్నికల తర్వాత వరుసగా అనేక కేసులను ఎదుర్కొన్న ఆయన.. ఓ కేసులో అరెస్టయ్యారు. న్యాయస్థానం కూడా దోషిగా తేల్చింది. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడిగా మరోసారి బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమైన వేళ.. తనపై నమోదైన పలు క్రిమినల్, సివిల్ కేసులను ఏవిధంగా ఎదుర్కొంటారనే విషయం చర్చనీయాంశమైంది. హష్ మనీ కేసులో ట్రంప్ దోషిగా తేలగా.. ఈ కేసుకు సంబంధించి న్యూయార్క్‌లోని న్యాయస్థానం నవంబర్ 26న శిక్ష ఖరారు చేయాల్సి ఉంది. దేశాధ్యక్షుడిగా ఎన్నికైన తరుణంలో దీనిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే, ఈ కేసును వాయిదా వేయాలని ట్రంప్ తరఫు న్యాయవాదులు న్యాయమూర్తిని కోరే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



వాషింగ్టన్ డీసీ, ఫ్లోరిడాల్లో నమోదైన రెండు క్రిమినల్ కేసులు ట్రంప్ విజయంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, వీటి విచారణను కొంతకాలం వాయిదా వేయగలిగితే.. ఆ తర్వాత స్పెషల్ కౌన్సిల్ జాక్ స్మిత్‌పై వేటు వేయవచ్చని ట్రంప్ వర్గం ఆలోచన. స్మిత్‌ను తొలగించే ఆలోచన ఉందని, తద్వారా తనపై నమోదైన కేసులకు ముగింపు పలకాలని భావిస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ కూడా అనేకసార్లు బహిరంగంగానే చెప్పారు. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టడానికి మరింత సమయం ఉన్నందున (జనవరి 20).. ఆ లోపు ఎటువంటి పరిణామాలు చోటుచేసుకుంటాయనే విషయం ఆసక్తిగా మారింది.






# అగ్రరాజ్య అధ్యక్షుడికి సకల సదుపాయాలు..

## వేతనం, ఇతర సౌకర్యాలు ఇలా..

**వాషింగ్టన్ :** అగ్రరాజ్యం అమెరికాకు తదుపరి అధ్యక్షుడు ఎవరవుతారా అని ప్రపంచ దేశాలన్నీ ఎదురుచూశాయి. బహుశా ఏ దేశాధ్యక్ష ఎన్నికకూ ఇంతటి ఆసక్తి ఉండదూ అంటే అతిశయోక్తి కాదు. మరి అలాంటి దేశానికి అధ్యక్షుడిగా ఎన్నికైన వారికి సదుపాయాలూ అదే స్థాయిలో ఉంటాయి. సకల సౌకర్యాలతో కూడిన శ్వేత సౌధం, వేతనం, 24/7 ఈగ కూడా వాలకుండా చూసుకునే భద్రతా సిబ్బంది ఉంటారు. మరి తదుపరి అధ్యక్షుడు కాబోతున్న ట్రంప్‌నకు ఏమేం సదుపాయాలు అందబోతున్నాయో చూద్దామా?



4 లక్షల డాలర్ల వేతనం..

అమెరికా అధ్యక్షుడికి వార్షికంగా 4 లక్షల డాలర్ల వేతనం అందుతుంది. అంటే భారతీయ కరెన్సీ ప్రకారం రూ.3.3 కోట్లు అన్నమాట. ఈ మొత్తాన్ని అమెరికా కాంగ్రెస్ 2001లో నిర్ణయించింది. అప్పటి నుంచి ఈ మొత్తంలో ఎలాంటి మార్పూ లేదు. సింగపూర్ ప్రధాని అందుకునే 16 లక్షల డాలర్లలో ఇది నాలుగో వంతు మాత్రమే! అమెరికా అధ్యక్షుడిగా రిటైరయ్యాక వార్షికంగా 2 లక్షల డాలర్లు లభిస్తుంది. 1 లక్ష డాలర్లు అలవెన్సు రూపంలో లభిస్తుంది.

అమెరికా అధ్యక్షుడికి వేతనంతో వ్యక్తిగత, అధికారిక ఖర్చుల కోసం ఏటా వేతనంతో పాటు 50 వేల డాలర్లు పన్ను రహిత వేతనం అందుతుంది. ప్రయాణ ఖర్చుల కోసం మరో లక్ష డాలర్లు, వినోదం కోసం మరో 19 వేల డాలర్లు అందుతుంది. ఈ మొత్తాలన్నీ కలిపితే ఏటా అధ్యక్షుడికి లభించేది 5.69 లక్షల డాలర్ల పైమాటే. అధ్యక్షుడిగా శ్వేతసౌధంలోకి అడుగుపెట్టడానికి ముందు డెకరేట్ చేయడానికి మరో లక్ష డాలర్లు కూడా చెల్లిస్తారు.

అమెరికా అధ్యక్షుడు అనగానే గుర్తొచ్చేది వైట్‌హౌస్. ఇది అధికారిక నివాసం. అందుకే అమెరికా అధ్యక్షుడిని శ్వేతసౌధానికి అధిపతి అని కూడా అంటారు. ఆరు అంతస్తుల ఈ భవనాన్ని 1800లో నిర్మించారు. కాలక్రమేణా హంగులు జోడించుకుంటూ వచ్చారు. 55 వేల చదరపు అడుగుల కలిగిన ఈ భవంతిలో 132 గదులు, 35 బాత్‌రూమ్‌లు ఉన్నాయి. ఇందులోనే టెన్నిస్ కోర్ట్, జాగింగ్ ట్రాక్, మూవీ థియేటర్, స్విమ్మింగ్ పూల్ వంటివి ఉంటాయి. అధ్యక్షుడికి విందు కోసం నిత్యం ఐదుగురు చెఫ్‌లు పనిచేస్తుంటారు.

శ్వేత సౌధం కాకుండా.. బ్లెయిర్ హౌస్ అనే అతిథి గృహం ఉంటుంది. ఇది శ్వేతసౌధం కంటే పెద్దగా 70వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంటుంది. ఇందులో 119 గదులు, అతిథుల కోసం 20 బెడ్‌రూములు, 35 బాత్‌రూమ్‌లు, 4 డైనింగ్ హాల్స్, జిమ్, సెలూన్ వంటివి ఉన్నాయి.

ఇవి కాకుండా క్యాంప్ డేవిడ్ అనే పర్వత విడిది కేంద్రం కూడా ఉంటుంది. మేరీల్యాండ్ రాష్ట్రంలో 128 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ నుంచి ప్రతి అధ్యక్షుడు దీన్ని వినియోగిస్తున్నారు. దౌత్యపరమైన చర్చల కోసం ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఇజ్రాయెల్, ఈజిప్టుల మధ్య ఒప్పందం ఇక్కడే జరిగింది. అందుకే ఆ ఒప్పందాన్ని క్యాంప్ డేవిడ్ ఒప్పందంగా పరిగణిస్తారు.

అమెరికా అధ్యక్షుడు ప్రయాణించడానికి ఉన్న ప్రత్యేక విమానం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానం. ఇందులో సకల సౌకర్యాలూ ఉంటాయి. గాల్లో ఉండగానే ఇంధనాన్ని నింపుకొనే సామర్థ్యం దీని సొంతం. ఓ విధంగా ఎగిరే శ్వేతసౌధంగా దీన్ని పిలుస్తారు.

అధ్యక్షుడికి సేవలందించడానికి మెరైన్ వన్ పేరుతో హెలికాప్టర్ ఉంటుంది. ఇది గంటకు 241 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. భారీ పేలుళ్లను తట్టుకొనేలా దీనికి బాలిస్టిక్ ఆర్మర్ ఉంది. క్షిపణి హెచ్చరిక వ్యవస్థతో పాటు.. క్షిపణి రక్షణ వ్యవస్థ ఉంది. మూడు ఇంజిన్లలో ఒకటి విఫలమైనా ఎగరగలదు. ఒకేలాంటివి ఐదు హెలికాప్టర్లు ఉంటాయి. ఎందులో అధ్యక్షుడు ఉన్నాడో శత్రువులకు తెలియకుండా చేయడం కోసం వీటిని వాడతారు.

ప్రపంచంలోనే అత్యంత భద్రమైన కారును అమెరికా అధ్యక్షుడి ప్రయాణానికి వినియోగిస్తారు. దీన్ని 'బీస్ట్'గా వ్యవహరిస్తారు. అధునాతన ఫీచర్లతో, భారీ భద్రతా ప్రమాణాలతో ఈ కారును తయారుచేశారు. అధ్యక్షుడు ఏ దేశానికి వెళ్లినా బీస్ట్ అక్కడ అడుగుపెట్టాల్సిందే. అమెరికా అధ్యక్షుడితో పాటు వారి కుటుంబ సభ్యులకు 24/7 సీక్రెట్ సర్వీస్ భద్రత ఉంటుంది.

# శతాబ్దాలైనా మహిళలకు దక్కని అమెరికా పీఠం

## పోరాడి ఓడిన హిల్లరీ, కమల

**వాషింగ్టన్ :** అమెరికా .. మహిళా అధినేతకు దూరంగానే ఉంటోంది. 248 ఏళ్ల ఆ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇప్పటి వరకూ 'వుమెన్ ప్రెసిడెంట్' పాలన లేదు. ఈ అగ్ర పీఠం కోసం కొందరు మహిళలు పోటీ పడినప్పటికీ.. విజయ తీరాలకు చేరుకోలేకపోయారు. తాజాగా భారత సంతతి వ్యక్తి కమలా హారిస్ కూడా డొనాల్డ్ ట్రంప్‌నకు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ ఓవల్ ఆఫీస్‌కు దూరంగానే ఉండిపోయారు.

సింగపూర్, ఫిన్లాండ్ సహా అనేక దేశాల్లో మహిళలే సారథులుగా ఉండి దేశాన్ని నడిపిస్తున్నారు. కానీ, అమెరికాలో మాత్రం మహిళలు ఓటు హక్కు పొందేందుకే అనేక ఏళ్లు వేచిచూడాల్సి వచ్చింది. 1920లో అమెరికా మహిళలకు ఓటు హక్కు లభించినప్పటికీ.. అది కొందరికే పరిమితమైంది. ఏళ్ల పోరాటం అనంతరం చివరకు 1960ల్లో అన్ని వర్గాల మహిళలకు అమెరికాలో ఓటు హక్కు దక్కింది. ఈ క్రమంలో రాజకీయ చైతన్యం పొందిన వారు.. చట్టసభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ అధ్యక్ష పీఠానికి మాత్రం దగ్గర కాలేకపోతున్నారు.



పోరాడి ఓడిన హిల్లరీ, కమల..

గతంలో మార్గరేట్ చేస్ స్మిత్, షెల్లీ చిసమ్ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడ్డారు. ఇక హిల్లరీ క్లింటన్, కమలా హారిస్ ఎన్నికల వరకూ చేరుకొని ఓటమి చవిచూశారు. 2016లో హిల్లరీ క్లింటన్ అధ్యక్ష పీఠానికి దరిదాపుల్లోకి వచ్చినట్లే వచ్చి ఓడిపోయారు. అప్పటి ఎన్నికల్లో ట్రంప్ కంటే 30 లక్షల ఎక్కువ ఓట్లు సంపాదించారు. కానీ కీలకమైన ఎలక్టోరల్ కాలేజీలో మాత్రం ఆయన కంటే వెనుకబడిపోయారు. తాజాగా కమలా హారిస్‌కు ట్రంప్‌నకు గట్టి పోటీ ఇచ్చారు. అయినప్పటికీ పాపులర్, ఎలక్టోరల్ ఓట్లలో వెనుకబడిపోయిన కమల.. అధ్యక్ష పీఠాన్ని చేజార్చుకున్నారు.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మహిళలు పోటీ చేసేందుకు గతంలో ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. కొందరు అభ్యర్థిత్వానికి పోటీ పడి ఓడిపోగా.. మరి కొందరు మాత్రం అధ్యక్ష బరిలో నిలిచి పరాజయం పొందారు. ఈ క్రమంలో గతంలో అధ్యక్ష పీఠం కోసం ప్రయత్నించిన మహిళా నేతలను పరిశీలిస్తే..

1964లో తొలిసారి మార్గరేట్ చేస్ స్మిత్ అనే మహిళ రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీ పడ్డారు. కానీ అభ్యర్థిత్వమే దక్కలేదు. ఆమే అధ్యక్ష పీఠానికి తొలి పోటీదారు.

1968లో... షెల్లీ చిసమ్ తొలి నల్లజాతి మహిళా సెనెటర్‌గా ఎన్నికయ్యారు. 1972లో ఆమె డెమోక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీలో ఉన్నట్లు ప్రకటించారు. కానీ ఆమెకూ చుక్కెదురే అయింది.

1980లనాటికి అమెరికాలో ఫెమినిజం ఊపందుకుంది. ఫలితంగా 1984లో తొలిసారిగా... డెమోక్రాటిక్ పార్టీ తరఫున గెరాల్డిన్ ఫెరారో... అధ్యక్ష అభ్యర్థిగా నిలిచారు. కానీ ఓడిపోయారు. కానీ మహిళల తరఫున మరో అడుగైతే ముందుకు పడింది.

2008లో.. హిల్లరీ క్లింటన్ డెమోక్రాటిక్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. కానీ పార్టీ అభ్యర్థిత్వం సంపాదించుకోలేకపోయారు. 2016లో పోటీ చేసి ఓటమి చవిచూశారు.

2024లో అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసిన కమలా హారిస్.. చివరకు పరాజయం పాలవడంతో అధ్యక్ష పీఠాన్ని చేరుకోలేకపోయారు.







# ఫిబ్రవరి 7న 'తండేల్' రిలీజ్



యువ సామ్రాట్ నాగ చైతన్య హీరోగా, చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'తండేల్' విడుదలకు సిద్ధమవుతోంది. అల్లు అరవింద్ సమర్పణలో ప్రతిష్టాత్మకమైన గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మిస్తున్న ఈ సినిమా ప్రొడక్షన్ పూర్తి కావస్తుండగా, రిలీజ్ డేట్ ని అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. తండేల్ ఫిబ్రవరి 7, 2025న ప్రేక్షకుల ముందుకు రానుంది. వాలెంటైన్స్ డే కి ముందు సినిమా రిలీజ్ కావడం, సీజన్‌లోని రొమాంటిక్ మూడ్‌ను క్యాపిటలైజ్ చేసుకునే పర్ఫెక్ట్ ఆపర్చునిటీ.

రిలీజ్ డేట్ పోస్టర్ లో లీడ్ పెయిర్ నాగ చైతన్య మరియు, పల్లవి మధ్య కెమిస్ట్రీ అదిరిపోయింది. ఈ పోస్టర్ వారి పాత్రలు మధ్య డీప్ లవ్ ని సూచిస్తుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్‌లకు అద్భుతమైన స్పందన రావడంతో సినిమాపై భారీ బజ్ ఏర్పడింది. బ్లాక్‌బస్టర్ హిట్ 'లవ్ స్టోరీ' తర్వాత నాగ చైతన్య, సాయి పల్లవి జోడిని మరోసారి తెరపై చూడటానికి అభిమానులు ఎంతగానో ఎదురుచుస్తున్నారు.

ఆంధ్ర ప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలోని డి మచ్చిలేశం గ్రామంలో జరిగిన నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో ఈ మూవీని రూపొందిస్తున్నారు. లవ్, యాక్షన్, డ్రామా, అడ్రినలిన్ రష్ మూమెంట్స్ బ్లెండ్ తో ఈ సినిమా అద్భుతంగా వుండబోతోంది. దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ శామ్‌దత్, నేషనల్ అవార్డ్ విన్నర్ నవీన్ నూలి ఎడిటర్. ఆర్ట్ విభాగానికి శ్రీనాగేంద్ర తంగాల నేతృత్వం వహిస్తున్నారు.

రిలీజ్ డేట్ ప్రెస్ మీట్‌లో హీరో నాగ చైతన్య మాట్లాడుతూ.. గీతా ఆర్ట్స్‌లో ఈ స్టోరీ లైన్ గురించి వినగానే నాకు చేయాలని అనిపించింది. ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ చేసినా అది పండగే అవుతుందన్నారు. ఫిబ్రవరి 7 డేట్‌పై నేను చాలా సంతోషంగా వున్నాను అని చెప్పుకొచ్చారు. హీరోయిన్ సాయి పల్లవి మాట్లాడుతూ.. ఈ సినిమా చేసినప్పుడు కంటే ఇప్పుడు చాలా పెద్ద కాన్వాస్ అయింది. గీత ఆర్ట్స్ అల్లు అరవింద్ గారు, బన్నీ వాస్ గారు నాకు ఎలాంటి అవార్డు వచ్చినా, నా సినిమా విజయమైనా ఎంతగానో గౌరవించి, సన్మానిస్తారు. ఒక కూతురులా చూసుకుంటారు అన్నారు.

నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ.. అరవింద్ తనపై మీద చాలా పెద్ద బాధ్యత పెట్టారన్నారు. ఈ సినిమా మొదలు పెట్టినప్పుడు డిసెంబర్ 20న రావాలని టార్గెట్ గా పెట్టుకున్నాం. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. చైతన్య 100% లవ్ సినిమాలో ఫస్ట్ టైం నిర్మాతగా నా పేరు వేసిన వ్యక్తి. ఆయన నాకు ప్రొడ్యూసర్‌గా ట్యాగ్ ఇచ్చారు. దానికి బదులుగా నేను ఒక్కటే ఇవ్వగలను. తండేల్ సినిమాను తీసుకెళ్లి 100 కోట్ల క్లబ్ లో కూర్చోబెడతాం.

నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ.. అందరి సమక్షంలో ఒక వేడుకలా తండేల్ రిలీజ్ డేట్ ని రివిల్ చేస్తున్నాం. సినిమాకి బెస్ట్ రిలీజ్ డేట్ ఏమిటని డైరెక్టర్ చందు ఒకసారి నన్ను అడిగారు. సినిమా పెద్దగా పోటీ లేకుండా ఒంటరిగా రావాలి. మంత్ ఎండ్ కాకుండా మంత్‌లో ఫస్ట్ వీక్ అయితే బాగుంటుంది. అలాగే మన కంటెంట్ ఏమిటో రీచ్ అయ్యేలా, సినిమాని తప్పకుండా చూడాలనే క్యురియాసిటీ కలిగించేలా ప్రమోట్ చేయాలి. ఇవన్నీ 25% మాత్రమే. మిగతా 75% సినిమా బాగుండాలి. బావున్న సినిమా మనదగ్గర వుంది. ఫిబ్రవరి 7 వేస్తే.. 14 ఫిబ్రవరి ఇంపార్టెన్స్ మనకు తెలుసు. అక్కడికి పీక్ లో ఉంటుంది. ఆ డేట్ కి వేద్దామని చెప్పాను' అన్నారు.

# విడుదలకు సిద్ధమైన M4M

## సరికొత్త సంచలనాలకు సిద్ధమైన చిత్రం

## తెలుగుతో పాటు 5 భాషల్లో విడుదల



తెలుగు ఇండస్ట్రీని షేక్ చేసేలా.. సిల్వర్ స్క్రీన్‌పై మునుపెన్నడూ చూడని థ్రిల్లింగ్ సబ్జెక్టుతో రాబోతున్న చిత్రం M4M (Motive For Murder). తెలుగుతో పాటు ఐదు భాషలలో దర్శకనిర్మాత మోహన్ వడ్లపట్ల తెరకెక్కించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్రయూనిట్ ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఒకే ఒక కిల్లర్ క్యారెక్టర్ కనిపిస్తుంది. ఈ రెడ్ కలర్ పోస్టర్ చూస్తుంటే ఈ కిల్లర్ పూర్తిగా డిఫరెంట్‌గా.. నా రూటు వేరు అన్నట్లు ఉంది.

ఈ సందర్భంగా దర్శకనిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ.. కంటెంట్ ఈజ్ ద కింగ్ అనే ప్రిన్సిపల్‌తో M4M మూవీని తెరకెక్కించినట్టు చెప్పారు. సరికొత్త సస్పెన్స్ థ్రిల్లర్ సబ్జెక్టుతో తెరకెక్కించిన ఈ చిత్రం ఇండస్ట్రీలో ఏ ఫెదర్ ఇన్ క్రౌన్ అవ్వబోతోందన్నారు. సస్పెన్స్ థ్రిల్లర్, మర్డర్ మిస్టరీ జోనర్లో ఇదొక కలికితురాయి నిలుస్తుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. త్వరలోనే M4M ను ఐదు భాషలలో వరల్డ్ వైడ్ రిలీజ్ చేయబోతున్నామన్నారు. టాలీవుడ్, బాలీవుడ్‌తో పాటు అమెరికాలోనూ ఈ సినిమా ప్రమోషన్స్ మొదలయ్యాయని చెప్పారు. వసంత్ అందించిన మ్యూజిక్, ఆనంద్ పవన్ చేసిన ఎడిటింగ్, సంతోష్ షానమోని కెమెరా పనితనం.. వంటి తమ టీమ్ వర్క్ హాలీవుడ్ రేంజ్‌లో వచ్చాయని ప్రశంసించారు.

బ్యానర్: మోహన్ మీడియా క్రియేషన్స్, జో శర్మ మెక్‌విన్ గ్రూప్ USA. తారాగణం: జో శర్మ (ప్రధాన నటి) (USA), సంబీత్ ఆచార్య (ప్రధాన నటుడు). సాంకేతిక సిబ్బంది: కథ: మోహన్ వడ్లపట్ల, జో శర్మ, రాహుల్ అడబాల, స్క్రీన్ ప్లే, దర్శకత్వం: మోహన్ వడ్లపట్ల, సంగీతం: వసంత్ ఇసాయిపెట్టై, DOP: సంతోష్ షానమోని, ఎడిటింగ్: పవన్ ఆనంద్, DI: డిజి క్వెస్ట్, VFX: పవన్, సౌండ్ డిజైనర్: సాగర్, దర్శకత్వ శాఖ: రాహుల్ అడబాల, హరి కిషన్, సుభాష్ సిరిపెల్లి.

# 'గేమ్ ఛేంజర్' అందరినీ అలరిస్తుంది

## నిర్మాత దిల్ రాజు




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, స్టార్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా చిత్రం 'గేమ్ చేంజర్'. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో జనవరి 10, 2025న మూవీ గ్రాండ్ రిలీజ్ కానుంది. నవంబర్ 9న లక్నోలో ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేస్తున్నారు. గేమ్ చేంజర్‌ను ఎస్‌వీసీ, ఆదిత్యరామ్ మూవీస్ సంస్థలు తమిళంలో విడుదల చేస్తున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాతలు దిల్‌రాజు, ఆదిత్య రామ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. ''నిర్మాతగా నా 21 ఏళ్ల ప్రయాణంలో 'గేమ్ చేంజర్' 50వ సినిమా. మూడేళ్ల క్రితం శంకర్ ఈ సినిమా స్టోరీ లైన్ నాకు చెప్పగానే ఎగ్జయిట్ అయ్యాను. ఆదిత్యరామ్ నాకు మంచి స్నేహితుడు. ఆయన ఇది వరకే తెలుగు సినిమాలను కూడా నిర్మించారు. ఇటీవల ఆయన్ని కలిసినప్పుడు నేను గేమ్ చేంజర్ మూవీని చేస్తున్నానని చెప్పగా, ఆదిత్య రామ్ కూడా ఇన్‌స్పైర్ అయ్యి ఇద్దరం కలిసి చేద్దామని నిర్ణయించుకున్నాం. ఈ ట్రావెల్ కంటిన్యూ అవుతుంది. వారిసు సినిమా తర్వాత నేను తమిళంలో ఇంకా సినిమాలు చేయాలనుకుంటున్నాను. నవంబర్ 9న గేమ్ చేంజర్ టీజర్‌ను లక్నోలో విడుదల చేయబోతున్నాం. తర్వాత యు.ఎస్‌లో ఓ భారీ ఈవెంట్ చేయటానికి ప్లాన్ చేస్తున్నాం. తర్వాత చెన్నైలో ఓ ఈవెంట్ చేస్తున్నాం. జనవరి తొలి వారంలో ఏపీ, తెలంగాణల్లో ఈవెంట్స్ నిర్వహిస్తాం. జనవరి 10న సంక్రాంతి స్పెషల్‌గా గేమ్ చేంజర్ సినిమాను రిలీజ్ చేస్తాం. యూనివర్సల్‌గా గేమ్ చేంజర్ సినిమా అందరినీ మెప్పిస్తుంది. ట్రిపులార్ తర్వాత రామ్ చరణ్‌గారు గ్లోబల్ స్టార్ అయ్యారు. ఆయన హీరోగా నటిస్తోన్న సినిమా గేమ్ చేంజర్. కియారా అద్వానీ హీరోయిన్. ఎస్.జె.సూర్యగారు కీ రోల్ చేశారు. తమన్ ఫెంటాస్టిక్ సాంగ్స్ అందించారు'' అన్నారు.

ఆదిత్య రామ్ మాట్లాడుతూ ''నేను సినీ రంగం నుంచి గ్యాప్ తీసుకుని 10 సంవత్సరాలకు పైగానే అయ్యింది. దిల్‌రాజుగారితో కలిసి ఈ రోజు మీ ముందుకు వచ్చాను. నేను ఆదిత్యరామ్ మూవీస్ బ్యానర్‌పై నాలుగు సినిమాలు చేశాను. ప్రభాస్‌తో ఏక్ నిరంజన్ సినిమా నిర్మించిన తర్వాత బ్రేక్ తీసుకున్నాను. రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగు పెట్టేశాను. ఇప్పుడు గేమ్ చేంజర్ సినిమాతో మీ ముందుకు వస్తున్నాను. ఎస్‌వీసీతో కలిసి ఆదిత్యరామ్ మూవీస్ ఈ సినిమాను తమిళంలో విడుదల చేస్తుంది. మంచి కథలు, డైరెక్టర్స్‌తో మంచి సినిమాలు చేయటానికి ప్లాన్ చేస్తున్నాం. దిల్‌రాజుగారి విషయానికి వస్తే మంచి కథను సెలక్ట్ చేసుకుని, స్క్రిప్ట్‌ను గొప్పగా సిద్ధం చేసి, కొత్త దర్శకుడిని ఎంచుకుని సినిమా చేస్తారు. తెలుగు సినీ ఇండస్ట్రీలో ఎక్కువ సంఖ్యలో బ్లాక్ బస్టర్స్, హిట్ సినిమాలు చేసిన నిర్మాత దిల్‌రాజుగారు. ఆయనతో కలిసి సక్సెస్‌ఫుల్ సినిమాలను నిర్మిస్తానని నమ్మకంగా ఉన్నాను'' అన్నారు.

# ఘనంగా "ఆదిపర్వం" ప్రీ రిలీజ్ ఈవెంట్




రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్వికా ఆర్ట్స్ పతాకంపై ఏఐ ఎంటర్ టైన్ మెంట్స్ కలయికలో నిర్మించిన చిత్రం ఆదిపర్వం. ఈ సినిమాలో మంచు లక్ష్మి, ఎస్తేర్, శివ కంఠమనేని ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మరో కీలక పాత్రను ఆదిత్య ఓం పోషిస్తున్నారు. ఎర్రగుడి నేపథ్యంలో అమ్మవారి చుట్టూ అల్లుకున్న పీరియాడిక్ ప్రేమకథతో గ్రాఫిక్స్ ప్రధానంగా ఆదిపర్వం చిత్రాన్ని రూపొందిస్తున్నారు దర్శకుడు సంజీవ్ మేగోటి. ఆదిపర్వం సినిమా ఈ నెల 8న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. 500కు పైగా థియేటర్స్ లో "ఆదిపర్వం" సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. మంగళవారం చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సంజీవ్ మేగోటి మాట్లాడుతూ.. మహాభారతంలో 18 పర్వాలు. మా సినిమా మొదలై 18 నెలలు అవుతోంది ఈ నెల 8వ తేదీన "ఆదిపర్వం" తెలుగు, కన్నడలో రిలీజ్ చేస్తున్నాం. చిన్న చిత్రంగా మొదలై బిగ్ మూవీగా మారింది ఆదిపర్వం. హనుమంతు క్యారెక్టర్‌లో ఆదిత్య ఓం నటన హైలైట్‌గా నిలుస్తుంది. మా సినిమాకు సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ఈ నెల 8వ తేదీన రిలీజ్ అవుతున్న చిత్రాల్లో ఆదిపర్వం ది బెస్ట్ మూవీగా నిలుస్తుంది అన్నారు.

నిర్మాత ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. ఆదిపర్వం కంటెంట్ లో ప్రేక్షకుల్ని ఆకర్షించే అంశాలు ఉన్నాయి. పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా అన్నారు. సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ.. సినిమాకున్న 24 క్రాఫ్టులు ఎవరి కాంట్రిబ్యూషన్ వారు చేస్తే పర్ఫెక్ట్ మూవీ వస్తుందని చెప్పేందుకు ఆదిపర్వం నిదర్శనం అన్నారు.

యాక్టర్ జెమినీ సురేష్ మాట్లాడుతూ.. ఆదిపర్వం సినిమాలో మంచి క్యారెక్టర్ లో నటించే అవకాశం ఇచ్చిన దర్శకుడికి థ్యాంక్స్ చెబుతున్నా. యూత్ సినిమాకు రావడం చాలా ముఖ్యం. ఆదిపర్వం సినిమాను కూడా ప్రేక్షకులు ఈ ఫ్రైడే థియేటర్స్ లో చూస్తారని కోరుకుంటున్నా అన్నారు.

హీరో ఆదిత్య ఓం మాట్లాడుతూ.. ప్రతి నటుడికి, ఫిలిం మేకర్‌కు ప్రేక్షకుల దగ్గర నుంచి వచ్చే స్పందనే ఆక్సీజన్ లాంటిది. ఆదిపర్వం సినిమాను మీరంతా థియేటర్స్‌లో చూసి ఆ ప్రాణవాయువు మాకు అందిస్తారని కోరుకుంటున్నా. ఈ సినిమాలో హనుమంతు అనే కీ రోల్ చేశాను. ఇలాంటి మంచి క్యారెక్టర్ నాకు ఇచ్చిన దర్శకుడు సంజీవ్ కి థ్యాంక్స్. ఆదిపర్వంలో మీరు థ్రిల్ అయ్యేలా యాక్షన్, డివోషనల్ ఎలిమెంట్స్ ఉంటాయి. సినిమాకు చిన్నా పెద్దా తేడా లేదు. కంటెంట్ బాగున్న సినిమాను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉంది. ఈ నెల 8న ఆదిపర్వం థియేటర్స్ లో చూడండి అన్నారు.

# కంటెంట్ ఉంటే సినిమాకి జనాలొస్తారు

## - రాకేష్ వర్రే



రాకేష్ వర్రే టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం జితేందర్ రెడ్డి. ఉయ్యాలా జంపాల, మజ్ను సినిమాలు తీసిన విరించి వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నవంబర్ 8 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రెస్ మీట్ ఇటీవలే జరిగింది.

హీరో రాకేష్ మాట్లాడుతూ.. "ఎవరికీ చెప్పొద్దూ సినిమా తర్వాత, చేస్తే మంచి సినిమా చేయాలి కానీ మాములు కంటెంట్ తో సినిమా చేయకూడదు అని నిర్ణయించుకున్నాను. లేట్ అయినా కానీ మంచి సినిమా చేయాలనే నేను డిసైడ్ అయ్యాను. రాకేష్ అనే నేను ఒక బ్రాండ్ గా ఎదిగిన రోజున నేను కొత్త వాళ్ళతో సినిమా చేస్తాను. జితేందర్ రెడ్డి సినిమా నేను చేయడానికి కారణం ఈ సినిమా కథ. ఈ సినిమా పూర్తిగా చేసాం కానీ మేలో రిలీజ్ అనుకున్నాం. వేరే వేరే ఇష్యుస్ వల్ల సినిమా పోస్టుపోన్ అవుతూ వచ్చింది. జితేందర్ రెడ్డి ఒక ఫైటర్. అయన అభిమానులు ఈ సినిమా చూస్తారు. ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం నాకుంది. ఈ సినిమా కి 75 రూపీస్ తో ప్రీమియర్స్ ప్లాన్ చేస్తున్నాం" అని అన్నారు.

దర్శకుడు విరించి వర్మ మాట్లాడుతూ.. "ఈ సినిమా ని డైరెక్ట్ చేయడం నేను లక్కీ గా ఫీల్ అవుతున్నాను. జితేందర్ రెడ్డి కథ విన్నాక, నేను ఈ సినిమా చేయాలనే డిసైడ్ అయ్యాను. ఈ సినిమా కి చాలా పెద్ద స్పాన్ ఉంది. ఈ సినిమా కి సరైన నటీనటులు, టెక్నీషియన్స్, నిర్మాత అందరూ దొరికారు. ఈ సినిమా నిర్మాత వారి సోదరుడి కథ చెపుదాం అని ముందుకొచ్చారు. ఏ విధమైన కాంప్రమైజ్ అవ్వకుండా సినిమా చేసారు. మంచి సినిమా తో మీ ముందుకు వస్తున్నాం అని ప్రగాఢంగా నమ్ముతున్నాం." అన్నారు.

గేయ రచయిత రాంబాబు గోశాల మాట్లాడుతూ.. "ఈ సినిమాలో అన్ని పాటలు రాసాను. ఇంతకు ముందు అర్జున్ రెడ్డికి కంతారాకి రాసాను. వాటితో పోలిస్తే ఈ సినిమా పాటలు డిఫరెంట్‌గా ఉంటాయి. నిన్న రిలీజ్ అయినా ఈ మట్టి బంగారం అనే సాంగ్ నా బెస్ట్ వర్క్ అనుకుంటాను. మజ్ను, ఉయ్యాలా జంపాల రాసాను, డైరెక్టర్ విరించి వర్మ ఈ సినిమాలో అన్ని పాటలు రాసే అవకాశం ఇచ్చారు. హీరో రాకేష్ బాగా కష్టపడ్డారు. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుంది అనుకుంటున్నాను" అన్నారు.

నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. "ఈ పాటికే ఈ సినిమా ఏంటి అని అందరికీ అర్థమయ్యే ఉంటుంది. నేనే తక్కువ సినిమాలు చూసే వాణ్ణి కానీ నేను ఈ సినిమా తీశాను. ఈ సినిమా ట్రావెల్ లో అందరితో పని చేయడం మర్చిపోలేని అనుభవం. ఈ సినిమా తీశానని తృప్తి నాకు ఉంది. జితేందర్ రెడ్డి జీవితం ఒక చరిత్ర. కానీ ఆ కథని చాలా బాగా చూపించారు. జగిత్యాలలో ప్రీమియర్ వేసాము. చూసిన వాళ్ళు చాలా మంది కళ్లనీళ్లు పెట్టుకున్నారు." అని అన్నారు.

రాకేష్ వర్రే, వైశాలి రాజ్, రియా సుమన్, ఛత్రపతి శేఖర్, సుబ్బరాజు, రవి ప్రకాష్.. పలువురు ముఖ్య పాత్రలు పోషించారు. దర్శకుడు: విరించి వర్మ, నిర్మాత: ముదుగంటి రవీందర్ రెడ్డి, సహ నిర్మాత: ఉమ రవీందర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: వాణిశ్రీ పొదుగు, ఛాయాగ్రాహకులు: వీ ఎస్ జ్ఞాన శేఖర్, సంగీత దర్శకులు: గోపి సుందర్, ఎడిటర్: రామకృష్ణ అర్రం, పీఆర్: మధు వి ఆర్.

# ట్రెండింగ్‌లవ్ ఫస్ట్‌లుక్ లాంచ్



వర్ధన్ గుర్రాల, హమరేశ్, శాంతి తివారి, నిత్యశ్రీలు ముఖ్య పాత్రల్లో నటించగా వెల్‌నోన్ షార్ట్‌ఫిలిమ్ మేకర్ హరీశ్ నాగరాజు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం ట్రెండింగ్‌లవ్. దొరకునా ఇటువంటి ప్రేమ ట్యాగ్‌లైన్. తన్వీ ప్రొడక్షన్స్, ఆర్‌డిజి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సోనుగుప్తా, రూపేశ్ డి గోయల్ నిర్మాతలు. ట్రెండింగ్‌లవ్ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రముఖ నటి, నిర్మాత కొణిదెల నిహారిక చేతులమీదుగా విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ.. ట్రెండింగ్‌లవ్ దర్శకుడు హరీశ్ ఎంతో టాలెంట్ ఉన్న దర్శకుడు. నేను గతంలో యూట్యూబ్ కోసం చేసిన షార్ట్‌ఫిలింలో తనతో పనిచేశాను. ఈ సినిమా టైటిల్ సమాజంలో ఉన్న కరెంట్ సిట్యూవేషన్‌ను ఎలివేట్ చేసేలా ఉంది. సినిమాలోని కొన్ని కట్స్ చూశాను చాలా బావున్నాయి. ఈ టీమ్ అందరికి చక్కని విజయం దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని అన్నారు. దర్శకుడు హరీశ్ నాగరాజు మాట్లాడుతూ.. '' నేను ఒక్క మెసేజ్ పెట్టి మా సినిమా ఫస్ట్‌లుక్‌ను మీ చేతుల మీదుగా ఓపెన్ చేయండి అని అడగ్గానే సరే అని మాటీంని ఎంకరేజ్ చేయటానికి ముందుకొచ్చారు నిహారిక. టాలెంట్ ఉన్న ఎంతోమందికి కేరాఫ్ అడ్రస్‌గా పింక్ ఎలిఫెంట్ సంస్థ మారింది. అందుకే ఆమెను నేను టాలీవుడ్ బంగారం అంటుంటాను. మా సినిమాలో నటించిన నటులందరికి ఎంతో మంచి పేరు వస్తుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు సోనుగుప్తా, రూపేశ్ డి గోయల్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు. మధుర ఆడియో ఈ చిత్ర ఆడియో హక్కులను సొంతం చేసుకుంది. ఈ చిత్రానికి సంగీతం - సునీల్ కశ్యప్, కెమెరా - బ్రహ్మతేజ మరిపూడి, నిఖిల్ కాలేపు, ఎడిటింగ్ - గ్యారి బి.హెచ్, లిరిక్స్ - బాలాజి, విశ్వనాథ్ కరసాల, ఆర్ట్ - షర్మిల ఎలిశెట్టి.

# 'రివాల్వర్ రీటా' ఏపీ, తెలంగాణ రైట్స్ ని దక్కించుకున్న హాస్య మూవీస్



కీర్తి సురేశ్ మోస్ట్ అవైటెడ్ మూవీ 'రివాల్వర్ రీటా' ఏపీ, తెలంగాణ రైట్స్ ని హాస్య మూవీస్ రాజేష్ దండా దక్కించుకున్నారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేశ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ 'రివాల్వర్ రీటా'. రాధిక శరత్‌కుమార్, రెడిన్ కింగ్స్లీ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి జే.కే చంద్రు దర్శకత్వం వహిస్తున్నారు. ప్యాషన్ స్టూడియోస్, ది రూట్ బ్యానర్స్ పై సుధన్ సుందరం (మహారాజ్ నిర్మాత) జగదీష్ పళనిస్వామి నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ మంచి బజ్ క్రియేట్ చేసింది. తాజాగా ఈ మూవీ ఏపీ, తెలంగాణ రైట్స్ ని సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ హాస్య మూవీస్ రాజేష్ దండా ఫ్యాన్సీ రేటుకి దక్కించుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# "నాకొక పెళ్ళాం కావాలి" అంటున్న హీరో స్మైల్ శ్రీను

ఓ మై లవ్, 18 టు 25 బళ్లారి, దర్బార్.. వంటి కన్నడ హిట్ సినిమాలకు దర్శకత్వం వహించి టాలెంటెడ్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న స్మైల్ శ్రీను ఇప్పుడు తెలుగు కన్నడ భాషల్లో హీరోగా ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఫీల్ గుడ్ మూవీస్ చేసి కన్నడ ప్రేక్షకుల మనసులో మంచి పేరు తెచ్చుకున్న స్మైల్ శ్రీను దర్శకత్వంలో వచ్చిన కన్నడ చిత్రం ఓ మై లవ్ 50 రోజులు పూర్తి చేసుకొని ఘన విజయం సాధించింది. అదే జోష్‌తో ఉన్న స్మైల్ శ్రీను ఇప్పుడు ''నాకొక పెళ్ళాం కావాలి'' అనే చిత్రం ద్వారా హీరోగా రానున్నారు. ఈ చిత్రానికి హరి అల్లినేని దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఇప్పుడు ఈ సినిమా కథకు సూటయ్యే హీరో స్మైల్ శ్రీనుకి పిల్లని ( హీరోయిన్) వేతికె పనిలో ఉన్నట్టు తెలుస్తుంది. అలానే కొంతమంది చిత్ర యూనిట్ టెక్నీషయన్లును ఎంపిక చేసే పనిలో ఉన్నారు. ఈ సందర్భంగా హీరో స్మైల్ శ్రీను మాట్లాడుతూ.. తెలుగు కన్నడ బాషల్లో హీరోగా నా తొలి సినిమా ఇది. తెలుగులో సినిమా చేయడం చాలా సంతోషంగా ఉంది. దర్శకుడు హరి అల్లినేని ఇప్పటికే స్క్రిప్ట్ పని పూర్తి చేశారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్ ఈ సబ్జెక్టు ప్రతి ఒక్కరిని అలరిస్తుంది.'' అని అన్నారు. డైరెక్టర్ హరి అల్లినేని మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులకు నచ్చే విధంగా స్క్రిప్టు బాగా వచ్చింది. జనవరిలో సెట్ మీదకి తీసుకెళ్లబోతున్నాం. సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను, టెక్నికల్, కాస్ట్ అండ్ క్రూ త్వరలోనే ప్రకటించబోతున్నాం..'' అని అన్నారు.



Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com